www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సీజేఐగా జస్టిస్ ఖన్నా

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

తొలిరోజే 45 కేసుల విచారణ 2

వచ్చే ఏడాది మే 13 వరకు పదవిలో ఖన్నా

శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, ఖర్గే



భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

మంగళవారం | 12-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 207 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి సా. 4.05 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 7.52 తదుపరి ఉత్తరాభాద్ర తె. 5.40, వర్జ్యం: సా. 4.35-6.02; దుర్ముహూర్తం: ఉ. 8.37-9.21, రా. 9.47-10.37; అమృతఘడియలు: రా. 1.18-2.45; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సంక్షేమం.. అభివృద్ధి!

రాష్ట్ర బడ్జెట్‌లో సమతుల్యత
'సూపర్ సిక్స్' అమలుకు నిధులు

కేశవ్ పద్దు
రూ.2,94,427 కోట్లు



బడ్జెట్ పత్రాల బ్యాగ్‌తో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- అసాధారణ 'ఆలస్యం'తో పూర్తిస్థాయి బడ్జెట్
- రూ.2.94 లక్షల కోట్లతో పయ్యావుల పద్దు
- ఆదాయం రూ.2.01 లక్షల కోట్లుగా అంచనా
- అప్పులు రూ.93,253 కోట్లు తేవాల్సిందే
- 30 వేల కోట్ల గ్రాంటు వస్తుందని లెక్కలు
- బడ్జెట్‌లో ఆచితూచి అంకెల కూర్పు
- ఆదాయం ఆధారంగా పరిమాణం కుదింపు

ఆర్థిక పునరుజ్జీవమే మా లక్ష్యం

వైసీపీ పాలనలో పతనం అంచుల్లోకి రాష్ట్రం

వనరులు దోపిడీ, నిధుల దుర్వినియోగంతో అధోగతి.. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కూటమి సర్కారు తన తొట్టతొలి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ఆర్థిక సంవత్సరం మొదలైన ఎనిమిది నెలల తర్వాత... మరో నాలుగు నెలలు మాత్రమే మిగిలిఉండగా రూ.2.94 లక్షల కోట్లతో 2024-25 పద్దును రూపొందించింది. ఇప్పటిదాకా ఓటాన్ అకౌంట్‌కే పరిమితం కాగా... ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం శాసనసభకు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పించారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో బడ్జెట్‌కు ఆన్‌లైన్ ద్వారా ఆయన ఆమోదం పొందారు. అనంతరం అసెంబ్లీలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర... వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు, మండలిలో మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి... రెండింటికీ సమప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్ రూపొందించారు. 'సూపర్ 6' పథకాలకు నిధులు

మిగతా 13వ పేజీలో...

"వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక రథం అగాధంలో కూరుకుపోయింది. చంద్రబాబు అనుభవంతో తిరిగి దానిని గాడిన పెడతాం. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఆర్థిక వ్యవహారాలు దుర్వినియోగమయ్యాయి. ఆర్థిక సూత్రాల ప్రకారం కాకుండా.. ఒక వ్యక్తి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన సాగించినదాని ఫలితమే ఇది. రాష్ట్రంలో ఇన్నాళ్లూ ఆర్థికంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పతనం అంచున ఉన్న ఆర్థిక వ్యవస్థను దారికి తెచ్చి రాష్ట్రాన్ని పునర్నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం"

- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- మొత్తం బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.2.34 లక్షల కోట్లు
- మూలధన వ్యయం రూ.32,712 కోట్లు
- ద్రవ్యలోటు రూ.68,743 కోట్లు
- జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు 4.19శాతం
- జీఎస్‌డీపీలో ద్రవ్యలోటు 2.12శాతం



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి కేశవ్

అన్నదాతకు అగ్రతాంబూలం



- వ్యవసాయం మరింత పరిపుష్టం.. మళ్లీ పావలా వడ్డీ రుణాలు
- సాగు బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు
- చిన్న, సన్నకారు రైతులకు 50% సబ్సిడీపై యంత్రాలు
- 2 సీజన్లకూ పంటల బీమా.. కిసాన్ డ్రోన్లతో నవశకానికి నాంది

12

అసెంబ్లీ.. 11 రోజులు

- బీజేపీ వినతి మేరకు తొలి 3 రోజులు సాయంత్రం 5 వరకు కొనసాగింపు
- బడ్జెట్, ఐదు నెలల పాలనపై చర్చ
- పలు బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- సభ ఎవరి కోసమూ ఆగదు.. బీఏసీలో సీఎం

మండలి ముద్దు.. సభ వద్దు



- శాసనమండలికి హాజరైన వైసీపీ.. శాసనసభకు మాత్రం దూరం
- పార్టీ భిన్న వైఖరిపై విమర్శలు
- తాడేపల్లిలో ఎమ్మెల్యేలతో జగన్ భేటీ
- ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే అసెంబ్లీలో మాట్లాడే చాన్స్ వస్తుందని వ్యాఖ్య

12



వర్రా అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఐజీ ప్రవీణ్

వర్రా రవీంద్రా రెడ్డి సోషల్ మీడియాలో వికృత పోస్టులు పెట్టడంలో సిద్ధ హస్తుడు. ఇదంతా అతను వ్యక్తిగతంగా చేసింది కాదు. వ్యవస్థీకృతంగా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ప్రతి జిల్లాకు ఒక గ్రూప్ కన్వీనర్ ఉంటారు. వీళ్లకు తాడేపల్లి నుంచి దిశా నిర్దేశం వస్తుంది. కొన్ని పోస్టులు సొంతంగా పెడతారు. మరికొన్ని పైనుంచి వచ్చే సూచనల మేరకు పెడతారు.

- డీఐజీ కోయ ప్రవీణ్

సజ్జల డైరెక్షన్

వైసీపీ సోషల్ మీడియా యాక్షన్

సజ్జల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలోనే బూతు, నీచ పోస్టులు

- 40 యూట్యూబ్ చానళ్లు... 400పైగా అకౌంట్లు
- ఇతర వ్యక్తుల ఖాతాల నుంచి వైసీపీ పోస్టులు
- డిజిటల్ కార్పొరేషన్ సిబ్బంది సొంతానికి వాడకం
- పార్టీ సోషల్ మీడియా ఆఫీసు నుంచే తతంగం
- సునీత, షర్మిలపై పోస్టుల వెనుక అవినాశ్ రెడ్డి
- ఆయన డిక్టేషన్‌తో పీఏ రాఘవ రెడ్డి కంటెంట్
- దానినే వర్రా రవీంద్రా రెడ్డి పోస్ట్ చేశాడు
- కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడి

వర్రా రవీంద్రా రెడ్డి అరెస్టు
సహకరించిన మరో ఇద్దరూ

కడపలో మీడియా ముందు ప్రవేశ పెట్టిన పోలీసులు

కడప (క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సజ్జల భార్గవ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాతే బూతులు పెరిగాయని కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. షర్మిల, సునీత, వైఎస్ విజయలక్ష్మిపై పోస్టుల వెనుక ఎంపీ అవినాశ్ రెడ్డి 'డిక్టేషన్' ఉన్నట్లు తేలిందన్నారు. సోషల్ మీడియాలో కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై విషం చిమ్ముతున్న ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు, జగన్ సతీమణి భారతీరెడ్డి పీఏ వర్రా రవీంద్రారెడ్డితోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశామని ప్రకటించారు. ఈ ముగ్గురినీ సోమవారం

మిగతా 14వ పేజీలో...

అసభ్యకర పోస్టులపై ఉక్కుపాదం

- పంచ్ ప్రభాకర్ సహా పలువురిపై రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదు
- నారా లోకేశ్‌ను కించపరుస్తూ పోస్టు పెట్టిన వ్యక్తికి రిమాండ్
- వైసీపీ మాజీ మంత్రి కాకాణిని 2 గంటలు విచారించిన పోలీసులు

14

రామ్‌గోపాల్ వర్మపై కేసులు



మద్దిపాడు, తుళ్లూరు స్టేషన్లలో నమోదు

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టారని ఫిర్యాదు

రూ. 40 వేల కోట్లతో
టాటా 'పవర్'

సౌర, పవన విద్యుత్‌లో భారీ పెట్టుబడి

- రాష్ట్రవ్యాప్తంగా 20 హోటళ్ల స్థాపన
- అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ కూడా
- టీసీఎస్ ఆధ్వర్యంలో ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్
- సచివాలయంలో చంద్రబాబుతో టాటా గ్రూప్ చంద్రశేఖరన్ భేటీ
- పారిశ్రామికాంధ్ర దిశగా కీలక చర్చలు



టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, టాటా గ్రూప్ నిర్ణయించాయి. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ రంగంలో రూ.40 వేల కోట్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు టాటా పవర్ సంస్థ ముందుకొచ్చింది. 5 గిగా వాట్ల సామర్థ్యంతో సోలార్, విండ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. టాటా గ్రూప్ సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ నేతృత్వంలోని బృందం సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్‌తో సమావేశమైంది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని పెంచేలా పలు అంశాలపై వీరు చర్చించారు. పలు రంగాల్లో పెట్టుబడులపై కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 హోటళ్ల (తాజ్, వివంతా, గేట్‌వే, సెలెక్యూషన్స్, జింజర్ హోటల్స్) నెలకొల్పేందుకు, పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయడానికి టాటా గ్రూప్ సుముఖత తెలిపింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే అంశంపై గత ఆగస్టులోనే చంద్రశేఖరన్ అమరావతికి వచ్చి చంద్రబాబుతో చర్చించారు. పూర్తిస్థాయి కార్యాచరణతో రావాలన్న సీఎం సూచనతో మూడు నెలలు తిరక్కుండానే ఆయన

మిగతా 2వ పేజీలో...



డ్రోన్ టెక్నాలజీతో రీసర్వే చేపడతామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసిన జగన్ సర్కారు నాడు తెరవెనుక నడిపిన కొనుగోళ్ల బాగోతం ఇది. 'జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పేరిట సర్వే కోసం కొన్న డ్రోన్లలో కొన్నే పనిచేశాయి. మిగతావి సాంకేతిక వైఫల్యాలతో నేలకూలాయి. కొందరు సర్వేయర్లు గాయపడ్డారు కూడా. అయితే, రాజకీయ సలహాదారుకు చెందిన అనుచర కంపెనీల నుంచి వీటిని కొనడంతో.. ఈ ఉదంతాలేవీ వెలుగుచూడకుండా చీకట్లో కలిపేశారు. రూ.200కోట్లు ఈ కంపెనీలకు చెల్లించి.. చెత్త డ్రోన్లు తీసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించి మరీ తెచ్చుకున్న ఈ డ్రోన్లు నాలుగురోజులు కూడా పనిచేయలేదు. అయినా..ఇవేవీ బయటకు రాకుండా నాటి సర్వే అధికారులు తొక్కిపెట్టారు. అధికారంలోకి రాగానే రీ సర్వే నిలిపివేసిన ప్రభుత్వం... జగన్ హయాం డ్రోన్ల దందాపైనా దృష్టిపెట్టాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

రీసర్వే కోసం కొన్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న నాటి సీఎం జగన్(ఫైల్)

రీసర్వే డ్రోన్లు ఢమాల్!

నింగిలో తిరగాల్సినవి నేలపాలు.. వాటిపై పెట్టిన కోట్ల డబ్బు బూడిదపాలు

జగన్ జమానాలో
200 కోట్లతో డ్రోన్లు కొనుగోలు
డీల్‌లో ఎన్నెన్నో అడ్డగోలు పనులు

- న్యాయసమీక్షకు వెళ్లకుండా బిట్లు బిట్లుగా టెండర్లు
- రాజకీయ సలహాదారు అనుచర కంపెనీలకు లబ్ధి
- సర్కారుకు చెత్త డ్రోన్లు అంటగట్టిన వైనం
- కొన్న 52 డ్రోన్లలో రెక్కలు తెగి పడిపోయినవి 44
- బాగుచేయాలంటే రూ. కోట్లు కుమ్మరించాల్సిందే
- రాగానే రీ సర్వేను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- డ్రోన్ల దందాపైనా దృష్టి పెట్టాలని రైతు సంఘాల వినతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జంతర్‌మంతర్ జగన్ పాలనలో ఇదొక కొత్తకోణం! కాసుల యావలోపడి నాడు అత్యంత దారుణమైన ఆర్థిక అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు అనేకం చోటుచేసుకున్నాయి. తాజాగా 'డ్రోన్ల' బాగోతం బయటకొచ్చింది. భూముల సర్వే పేరు చెప్పి, ఆధునిక టెక్నాలజీని వాడుతున్నామని ఆర్భాటపు ప్రకటనలు చేసి రూ.200 కోట్లతో ఎందుకూ పనికిరాని డ్రోన్లు, రోవర్లు కొన్నారు. రూ.100 కోట్ల మేర ఉన్న ఏ కొనుగోలు అయినా న్యాయ కమిషన్ (జ్యుడీషియల్ ప్రివ్యూ) ఆమోదానికి వెళ్లాల్సి ఉండగా, దాన్నుంచి తప్పించి బిట్లుబిట్లుగా కొనుగోలు చేయించారు. ఓ రాజకీయ సలహాదారు బినామీలకు లబ్ధిచేకూర్చారు. ప్రభుత్వానికి చెత్త డ్రోన్లు, రోవర్లు వచ్చిపడ్డాయి. కొన్నందుకు వాటిని భూముల సర్వే పేరిట కొద్దిరోజులు ఆకాశంలో తిప్పారు. ఇప్పుడవి మూలనపడ్డాయి. వాటికి మరమ్మతులు చేయించాలంటే కోట్లు కుమ్మరించాల్సిందే. మళ్లీ తన ప్రభుత్వమే వస్తుందన్న ధీమాతో అనామక కంపెనీల నుంచి డ్రోన్లు కొని వాటిని సరిగ్గా పక్షం రోజులు కూడా వాడకుండా పక్కనపడేశారు. కొన్నందుకు కంపెనీల ఖాతాల్లో ప్రభుత్వ ధనం జమ అయింది. సర్కారుకు చెత్త సరుకు వచ్చింది. ఇప్పుడవి ఇనుప ముక్కలుగానే మిగిలిపోయేలా ఉన్నాయి. 200 కోట్లు వెచ్చించి కొన్న సాంకేతిక పరిజ్ఞానం

మిగతా 3వ పేజీలో...

టీచర్లను వైసీపీ అవమానించింది!

- బ్రాందీ షాపుల ముందు నిలబెట్టింది
- బాత్‌రూముల ఫొటోలు తీయించింది
- మేం వారి గౌరవ ప్రతిష్ఠలు పెంచుతాం
- అన్ని విధాలుగా అండగా ఉంటాం
- కూటమి విజయంలో వారి పాత్ర కూడా
- రాష్ట్రం నాలెడ్జ్ హబ్ కావాలి
- ఒకప్పుడు నేనే జనాభా నియంత్రించాలన్నా.. ఇప్పుడు జన సంఖ్య పెరగాలి: సీఎం
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, సత్యకుమార్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది. టీచర్లకు ఎల్లప్పుడూ గౌరవం ఉంటుంది. అలాంటి టీచర్లను కూడా గత వైసీపీ ప్రభుత్వం అవమానించింది. బ్రాందీ షాపుల ముందు నిలబెట్టింది. బాత్‌రూముల ఫొటోలు కూడా తీయించి మరో రకంగా అవమానించింది. టీచర్ల ప్రతిష్ఠ, గౌరవం పెంచే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. వారికి సమాజంలో ఉండే గౌరవం కొనసాగేలా చూస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా

మిగతా 14వ పేజీలో...

15% వృద్ధిరేటే లక్ష్యం

కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలకు వేదికగా ఏపీ

- నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. నేడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్
- కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలి.. విజన్ 2047 భేటీలో సీఎం
- అంతర్రాష్ట్ర మండలి స్థాయీ సంఘంలో చంద్రబాబుకు చోటు

2

బంగాళాఖాతంలో అల్పపీడనం 2

రానున్న 24 గంటల్లో వర్షాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ 3

భారత్‌కూ ఐరన్ డోమ్!



- త్వరలోనే దేశానికి పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థ
- రష్యా కంపెనీతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కీలక ఒప్పందం

2

మళ్లీ రగిలిన మణిపూర్

- భద్రతాదళాలు, మిలిటెంట్ల మధ్య ఎదురుకాల్పులు
- పోలీస్‌స్టేషన్‌పై దాడులు.. దుకాణాలకు నిప్పు

11 మంది కుకీల హతం

అమరావతికి లైన్ క్లియర్! 2



- 15 వేల కోట్ల రుణంలో కీలక ఘట్టం పూర్తి
- ఢిల్లీలో త్రైపాక్షిక ఒప్పందం రూపకల్పన
- డిసెంబరులో రూ.3,700 కోట్ల అడ్వాన్స్

సీజేఐగా జస్టిస్ ఖన్నా ప్రమాణం

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్లో ద్రౌపది ముర్ము, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయించారు. సంజీవ్ ఖన్నా ఆంగ్లంలో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రాం మేఘ్వాల్ , మనోహర్ లాల్ ఖట్టర్, కిరెన్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, ఏపీ గవర్నర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ ఖన్నా వయసు 64 ఏళ్లు. 1960 మే 14న ఆయన జన్మించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. అంటే ఆయన 2025 మే 13 వరకు పదవిలో కొనసాగుతారు. 2019 జనవరి 18న జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని, ఆర్టికల్ 370 రద్దు సహేతుకమేనని, ఈవీఎంలలో లోపాలేమీ లేవని ప్రకటించిన వివిధ ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆయన బెయిల్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీలో


జస్టిస్ ఖన్నాతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

లా చదివిన ఖన్నా హైకోర్టు న్యాయమూర్తి కాకముందు అనేక సంవత్సరాలు ప్రాక్టీసు చేశారు. ఆయన ప్రఖ్యాత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్ఆర్ ఖన్నా సోదరుడి కుమారుడు. ప్రాథమిక హక్కులను రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని హెచ్ఆర్ ఖన్నా ప్రకటించిన విషయం తెలిసిందే. జస్టిస్ సంజీవ్ ఖన్నా తండ్రి దేవ్‌రాజ్ ఖన్నా గతంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, నూతన సీజేఐ సంజీవ్ ఖన్నాకు ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కాగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి విపక్షనేత రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు.

50 ఏళ్ల క్రితం ఖన్నా పెద్దనాన్నకు
ఇందిర ఆగ్రహంతో సీజేఐ పదవి దూరం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నాకు పెద్దనాన్న. ఓ కేసులో తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని అప్పటి ప్రధాని ఇందిర.. హెచ్ఆర్ ఖన్నాకు సీజేఐ పదవి ఇవ్వరాదని పట్టుబట్టి అనుకున్నది సాధించారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులపై నాటి ప్రధాని ఇందిర ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఏడీఎం జబల్పూర్ వర్సెస్ శివకాంత్ సుక్లా వాజ్యం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. 'ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులను హరించివేయడం సబబేనా?' అన్నది ఈ వ్యాజ్యం సారాంశం. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా.. ఇందిర నిర్ణయాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. మైనారిటీ తీర్పునే వెలువరించినా.. ఎక్కడా ఎలాంటి జంకు లేకుండా ఆయన నిర్భయంగా వ్యవహరించారు. ఇది ఇందిరకు ఆగ్రహం తెప్పించింది. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్‌గా ఉన్న ఆయనకు సీజేఐ పదవిని దూరం చేసింది. ఖన్నా కంటే జూనియర్‌ను ఇందిర సీజేఐ సీట్లో కూర్చోబెట్టారు.

మణిపూర్‌లో 11 మంది కుకీ మిలిటెంట్ల హతం

ఇంఫాల్, నవంబరు 11: మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో సోమవారం భద్రతాదళాలు, కుకీ మిలిటెంట్ల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు హతమయ్యారు. తొలుత బోరోబెక్రా పోలీసుస్టేషన్‌పై కుకీ మిలిటెంట్లు దాడులకు పాల్పడ్డారు. అనంతరం సమీపంలోని జకురాడోర్ కరోంగ్ గ్రామానికి వెళ్లి బీభత్సం సృష్టించారు. అనేక దుకాణాలకు నిప్పు పెట్టారు. దరిమిలా భద్రతాదళాలు- కుకీ మిలిటెంట్ల మధ్య భారీ స్థాయిలో ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 11 మంది కుకీ మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు తెలిపారు. కొంతమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా గాయపడ్డారని వారు వెల్లడించారు. మరోవైపు ఆదివారం మైతేయి గ్రామాలపైన కుకీ ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. జిరిబామ్ జిల్లాలోని థమ్నాపోక్పీ, సబున్‌కోక్, సనసాబి గ్రామాలకు సమీపంలోని కొండలపై నుంచి తుపాకులు, బాంబులతో దాడులకు పాల్పడ్డారు. పంటకోత కాలం కావడంతో పొలాల్లో పనిచేసుకుంటున్న తమవారిని లక్ష్యంగా చేసుకుని కుకీ వర్గాలు దాడులకు పాల్పడ్డాయని మైతేయిలు ఆరోపించారు. బీఎస్ఎఫ్ జవాన్లు రావడంతో వారు దాడులను నిలిపివేశారని లేదంటే భారీ నష్టం జరిగేదని అన్నారు.

లోకం తీరు



కాలుష్యాన్ని ఏ మతమూ ప్రోత్సహించదు

- ఢిల్లీలో ఏడాదంతా బాణసంచా నిషేధంపై నిర్ణయం తీసుకోండి: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 11: కాలుష్యాన్ని పెంచే కార్యక్రమాలను ఏ మతమూ ప్రోత్సహించదని సోమవారం వ్యాఖ్యానించింది. ఏడాది పొడవునా బాణసంచాను నిషేధించడంపై పక్షం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది. దేశ రాజధాని పరిసరాల్లో వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ 1985లో పర్యావరణవేత్త ఎం.సి.మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై జరిగిన విచారణలో భాగంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కాలుష్యరహిత వాతావరణంలో జీవించడం పౌరుల ప్రాథమిక హక్కని తెలిపింది. ఏడాదంతా బాణసంచా నిషేధంపై భాగస్వాములందరితో చర్చించి ఈ నెల 25లోగా నివేదిక సమర్పించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఒవైసీది రజాకార్ల సంతతి: ఫడణవీస్

ముంబై, నవంబరు 11: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఒవైసీది రజాకార్ల సంతతి అని ఫడ్నవీస్ తాజాగా విమర్శలు సంధించారు. 'ఒవైసీ రజాకార్ల వారసుడు. రజాకార్లు మరఠ్వాడా ప్రజలను హింసించారు' అని అన్నారు. మహారాష్ట్రలో 'ఓటు జిహాద్' మొదలైందని శనివారం ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలతో ఈ మాటల యుద్ధానికి తెరలేచింది. 'ఓటు జిహాద్'ను 'ఓటు ధర్మయుద్ధం'తో ఎదుర్కోవాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దీనికి ఒవైసీ స్పందిస్తూ తమ పూర్వీకులు బ్రిటీష్ పాలకులపై జిహాద్ చేస్తున్నప్పుడు ఫడ్నవీస్ పూర్వీకులు తెల్లదొరలకు 'ప్రేమలేఖలు' రాసేవారని విమర్శించారు.

ఈపీఎఫ్‌వోలో 21 వేలకు వేతన పరిమితి!

న్యూఢిల్లీ, నవంబరు 11: కేంద్ర ప్రభుత్వం త్వరలో వేతన జీవులకు శుభవార్త చెప్పనుందా? ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) పరిమితిని రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచనుందా? ఈ ప్రశ్నలకు విశ్వసనీయవర్గాలు ఔననే చెబుతున్నట్లు జాతీయ వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. దీంతోపాటు.. ఉద్యోగుల సంఖ్యను బట్టి కంపెనీల నమోదు విధానం కొనసాగుతుండగా.. ఆ సంఖ్య పరిమితిని తగ్గించనున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అంటే.. ప్రస్తుతం ఉన్న 20 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న కంపెనీలు ఈపీఎఫ్‌వోలో చేరడం తప్పనిసరి. ఈ సంఖ్యను 10-15కు తగ్గించే అవకాశాలున్నాయి. మరోవైపు ఈపీఎఫ్‌వో వేతన పరిమితిని పెంచడం వల్ల ప్రభుత్వంతోపాటు.. ప్రైవేటు రంగంపైనా భారం పడుతోందని.. అయితే, ఉద్యోగులకు మాత్రం మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యనిధికి ఉద్యోగి, యజమాని చెరో 12% వాటాను చెల్లించగా.. యజమాని వాటా నుంచి 8.33% పింఛను పథకానికి.. మిగతాది ఈపీఎఫ్‌లో జమ అవుతుంది.

వితంతు కోడలికి మామ భరణం ఇవ్వక్కర్లేదు

భోపాల్, నవంబరు 11: వితంతువైన కోడలికి ఆమె మామ ఎలాంటి భరణం చెల్లించాల్సిన పనిలేదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు మహమ్మదీయ చట్టం అంగీకరించదని తెలిపింది. భర్త చనిపోవడంతో తన పోషణ నిమిత్తం నెలకు రూ.40వేల భరణం ఇచ్చేలా మామను ఆదేశించాలని కోరుతూ ఓ ముస్లిం మహిళ కోర్టును ఆశ్రయించారు. ఇందుకు గృహ హింస చట్టాన్ని ఆసరాగా తీసుకున్నారు. ఆ చట్టంలోని 18 నుంచి 22 వరకు ఉన్న సెక్షన్లను ప్రస్తావిస్తూ అత్తవారింట్లో నివసించే హక్కు తనకు ఉందని, అందువల్ల భర్త తండ్రే ఆదుకోవాల్సి ఉందని కోరారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నెలకు రూ.3,000 చెల్లించాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి జస్టిస్ హృదేశ్ రాయ్ విచారణ జరిపారు. తన కుమారుడు జీవించి ఉన్నప్పుడు ఆమె ఎప్పుడూ తమ ఇంట్లో కలిసి ఉండలేదని, వారిద్దరు వేరేగా జీవించే వారని పిటిషనర్ వాదించారు. అందువల్ల ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

అయోధ్య రామమందిర పునాదులు పెకిలిస్తాం: పన్నూన్

న్యూఢిల్లీ, నవంబరు 11: అయోధ్య రామ మందిరం సహా పలు హిందూ ఆలయాలపై నవంబరు 16, 17 తేదీల్లో దాడులు చేస్తామని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్నూన్ హెచ్చరించాడు. ఈ మేరకు నిషేధిత సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జె) సంస్థ ఓ వీడియో విడుదల చేసింది. అందులో.. అయోధ్య రామ మందిర పునాదులు పెకిలించివేస్తామని పన్నూన్ పేర్కొన్నాడు. అలాగే కెనడాలోని భారతీయులను తాము దాడులు చేసే హిందూ ఆలయాలకు దూరంగా ఉండాలని హెచ్చరించాడు. కాగా, పన్నూన్ గతంలోనూ ఇలాంటి బెదిరింపులకు పాల్పడ్డాడు. నవంబరు 1 నుంచి 19 వ తేదీ వరకు ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని గతనెలలో బెదిరించాడు.

ప్రజ్వల్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ నాయకుడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. నిందితుడు పలుకుబడి ఉన్నవారని, విచారణ సమయంలో ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అత్యాచార కేసులలో ఆయన బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ప్రజ్వల్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనిపై సముద్రమట్టానికి 5.8 కి.మీ.ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. ఇది రానున్న రెండు రోజుల్లో పశ్చిమంగా పయనించి తమిళనాడు, శ్రీలంక దిశగా వస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తాలో పలుచోట్ల, రాయలసీమ, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నెల 13, 14 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

భారత్‌కూ ఐరన్ డోమ్!

త్వరలోనే దేశానికి పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థ

- రష్యా కంపెనీతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కీలక ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 11: భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా కీలక ముందడుగు పడింది. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తరహాలో... రష్యా గగనతలానికి రక్షణ వలయంగా నిలుస్తున్న అత్యాధునిక పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్-గన్ వ్యవస్థ త్వరలోనే భారత్‌కు కూడా అందుబాటులోకి రానుంది. ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్).. రష్యాకు చెందిన ఆయుధ ఎగుమతిదారు రోసోబొరోనెక్స్‌పోర్ట్ (ఆర్‌వోఈ)తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గోవాలో జరిగిన ఇండియా-రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ (ఐఆర్ఐజీసీ) సబ్ గ్రూప్ సమావేశంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత్, రష్యా మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని ఈ భాగస్వామ్యం నొక్కిచెబుతోంది.

పాంట్‌సిర్ రక్షణ వ్యవస్థ సామర్థ్యం

పాంట్‌సిర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అనేది విమానాలు, డ్రోన్లు, క్షిపణులతోపాటు సైనిక స్థావరాలకు గగనతలం నుంచి వచ్చే ముప్పుని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి రూపొందించిన అత్యాధునిక మొబైల్ రక్షణ వ్యవస్థ. దీనిలో ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగిన స్వల్ప, మధ్య శ్రేణి క్షిపణులు



ఉంటాయి. అలాగే డ్యూయల్ 30ఎంఎం ఆటోమేటిక్ ఫిరంగులు బహుళ అంచెల రక్షణను అందిస్తాయి. అత్యాధునిక రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్‌ను కలిగి ఉన్న పాంట్‌సిర్ వ్యవస్థ 36 కిలోమీటర్ల దూరంలో, 15 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగిరే లక్ష్యాలను గుర్తించి అలవోకగా ఛేదించగలదు. వేగంగా దూసుకొచ్చే శత్రు ఆయుధాలను అంతే వేగంగా ప్రతిస్పందించి తిప్పికొట్టగలదు. రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా.. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, రోసోబొరోనెక్స్‌పోర్ట్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఉత్పత్తి, సాంకేతికత బదిలీ, పాంట్‌సిర్ వేరియంట్ల ఉమ్మడి అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించాలని బీడీఎల్, ఆర్‌వోఈ లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఈ నెలాఖరులో రష్యా నుంచి మరో యుద్ధనౌక

రష్యాలో నిర్మిస్తున్న రెండు గైడెడ్ క్షిపణి వ్యవస్థ కలిగిన యుద్ధనౌకల్లో మొదటిది ఈ నెలాఖరులోగా భారత్‌కు చేరనుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వీటి డెలివరీ ఆలస్యమైంది. అలాగే.. రష్యా అందజేయాల్సిన మిగిలిన రెండు 'ఎస్-400' ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలు 2026 నాటికి భారత్‌కు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాదాపు 4,000 టన్నుల బరువున్న యుద్ధనౌకను కొన్ని నెలలుగా కలినిన్‌గ్రాడ్‌లోని యాంటార్ షిప్‌యార్డులో మోహరించారు. డిసెంబరు మొదటి వారంలో రష్యాను సందర్శించనున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ యుద్ధనౌకను అప్పగించనున్నారు. భారత్ దీన్ని ఐఎన్ఎస్ తుశీల్‌గా ప్రారంభించనుంది. కాగా, ఈ శ్రేణిలో మరో యుద్ధనౌకను వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు అప్పగించనున్నట్టు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. రష్యా నుంచి నాలుగు గ్రిగోరోవిచ్ క్లాస్ యుద్ధనౌకల కొనుగోలుకు భారత్ 2018 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకోగా.. రూ.8వేల కోట్లతో వాటిలో తొలి రెండు నౌకలను ఇప్పటికే అందుకుంది.

ఎమ్మెల్యేలను కొనడం.. ప్రభుత్వాలను కూల్చడం!

- మోదీకి తెలిసింది అదే: ఖర్గే

న్యూఢిల్లీ, నవంబరు 11: ఎమ్మెల్యేలను కొనడం, ప్రభుత్వాలను కూల్చడం, ప్రతిపక్షాలను అణచేయడం.. ఇవే ప్రధాని మోదీకి తెలుసంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. బీజేపీ 'విభజన' ఎన్నికల నినాదాలు కేవలం తమకు కావాల్సిన కొందరు వ్యాపారవేత్తల కోసమేనని ఆరోపించారు. సోమవారం ఝార్ఖండ్‌లో పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఖర్గే మాట్లాడారు. అదానీ, అంబానీతో కలసి మోదీ, అమిత్ షా కేంద్రాన్ని నడుపుతున్నారన్నారు. 'ఇచ్చిన హామీలను ఎన్నటికీ నెరవేర్చని ఓ అబద్ధాల కోరు మోదీ.. కనీసం మణిపూర్‌ను సందర్శించే ధైర్యం చేయలేకపోతున్నారాయన.. సుదీర్ఘ బీజేపీ పాలన నడుస్తున్న గుజరాత్‌లో ఏమైనా స్వర్ణయుగం వచ్చిందా..? కాషాయ వస్త్రాలతో సాధువుల్లా వచ్చి కొందరు ముఖ్యమంత్రులు (యోగిని ఉద్దేశించి) అయ్యారు. విభజిస్తే నరికేస్తామంటూ ఉగ్రవాదుల భాష మాట్లాడుతున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ఖర్గేను హిందూ వ్యతిరేకి, సనాతన వ్యతిరేకిగా అభివర్ణించింది.

సమాజ విచ్ఛిన్నానికి దేశ వ్యతిరేకుల ప్రయత్నం

- మన సమైక్యతే వారి ఓటమి: మోదీ



అహ్మదాబాద్, నవంబరు 11: తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు దేశ వ్యతిరేకులు సమాజ విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. వారి ఉద్దేశాల తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వారిని ఓడించేందుకు మనమంతా సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని ఖేడా జిల్లా వడ్తాల్ పట్టణంలో ఉన్న శ్రీస్వామినారాయణ్ ఆలయ ద్విశతాబ్ది వార్షికోత్సవానికి హాజరైన భక్తులను ఉద్దేశించి ప్రధాని సోమవారం వర్చువల్‌గా ప్రసంగించారు. '2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు పౌరుల ఐక్యత, దేశ సమగ్రత ముఖ్యం. అయితే, దురదృష్టవశాత్తూ కొందరు తమ సంకుచిత మనస్తత్వంతో, తమ స్వార్థ ప్రయోజనాల కోసం కుల, మత, భాష, స్త్రీ-పురుష, గ్రామీణ-పట్టణ పరంగా ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ఓడించేందుకు మనమంతా సమైక్యమవ్వాలి. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేయడానికి ఆత్మనిర్భరతే తొలి అడుగు' అన్నారు. స్వామినారాయణ్ భక్తులైన సాధువులందరూ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేసే ప్రతిజ్ఞలో దేశంలోని ప్రతి పౌరుడినీ భాగస్వామ్యం చేయాలని కోరారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఆ ఆలయంతో తనకు అనుబంధం ఉందని, ఆలయ ద్విశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఒక నాణేన్ని కూడా విడుదల చేసిందని మోదీ చెప్పారు. భారత సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. కుంభమేళాల ప్రాముఖ్యతను ఇతర దేశాల ప్రజలూ అర్థం చేసుకునేలా స్వామినారాయణ్ భక్తులు కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్య ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే పూర్ణ కుంభ మేళాకు విదేశీయులనూ భారీగా రప్పించాలని కోరారు. 'ప్రపంచ వ్యాప్తంగా మీ ఆలయాలున్నాయి. ఆ ఆలయాల ద్వారా కుంభమేళా గురించి అవగాహన కల్పించండి. ప్రతి ఆలయం తరఫున కనీసం వంద మంది విదేశీయులను కుంభమేళాకు తీసుకువచ్చేందుకు కృషి చేయండి' అన్నారు.

రాహుల్ అబద్ధాలకు అడ్డుకట్ట వేయండి

రాహుల్‌గాంధీ అబద్ధాలకు అడ్డుకట్ట వేయాలని, మహారాష్ట్ర ఎన్నికల్లో ఆయన చేస్తున్న అసత్య ప్రచారాన్ని నిలువరించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఫిర్యాదు చేసింది. భారత యూనియన్ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా రాహుల్ రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. "మహారాష్ట్రకు రావాల్సిన యాపిల్ ఐఫోన్, బోయింగ్ విమానాల తయారీ యూనిట్లు వేరే రాష్ట్రానికి వెళ్లిపోయాయి" అని రాహుల్ అసత్య ప్రచారం చేస్తున్నారని వివరించింది. మరోవైపు, మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో బీజేపీ ప్రకటనలు మత కోణంలో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫిర్యాదులో పేర్కొంది.

అమరావతికి లైన్ క్లియర్!

- 15 వేల కోట్ల రుణ మంజూరులో కీలక ఘట్టం పూర్తి

అమరావతి, న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి నిధుల రాకకు ముందడుగు పడింది. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) కలిసి ఇస్తున్న రూ.15,000 కోట్ల అప్పునకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందాలు సిద్ధమయ్యాయని సీఆర్‌డీఏ కమిషనర్ కె.భాస్కర్ తెలిపారు. సోమవారం ఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమావేశం సజావుగా సాగిందన్నారు. ఢిల్లీలోని ప్రపంచబ్యాంకు కార్యాలయంలో ఒప్పంద రూపకల్పనపై సుదీర్ఘ కసరత్తు జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆర్థిక, న్యాయ మంత్రిత్వ శాఖల అధికారులు, ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.భాస్కర్, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, ఆర్థిక శాఖ అధికారి డి. సురేంద్ర, ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ) ప్రతినిధులు పాల్గొన్నారు. రుణానికి సంబంధించి నియమ నిబంధనలు సిద్ధం చేశారు. డిసెంబర్ 11న జరిగే ఏడీబీ బోర్డు సమావేశంలో, అదే నెల 17న జరిగే ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశంలో ఈ ఒప్పందాలకు ఆమోదం తీసుకుంటారు. ఆ తర్వాత మొత్తం అప్పు రూ.15,000 కోట్లలో 25 శాతం అంటే దాదాపు రూ.3,700 కోట్లను ఆ బ్యాంకులు అడ్వాన్సుగా విడుదల చేస్తాయి.

అంతర్రాష్ట్ర మండలి స్థాయీ సంఘంలో బాబు

- మరో ఆరు రాష్ట్రాల సీఎంలు కూడా...

న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన అంతర్రాష్ట్ర మండలి స్టాండింగ్ కమిటీని పునర్వవస్థీకరించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్రకుమార్ సింగ్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు 7 రాష్ట్రాల ముఖ్యమంత్రులను సభ్యులుగా చేర్చారు. ఏపీ సీఎం చంద్రబాబు, అసోం సీఎం హిమంత బిశ్వా శర్మ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝీ, మహారాష్ట్ర సీఎం షిండే, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్ సభ్యులుగా ఉంటారు. ప్రధాని మోదీ ఆమోదం మేరకు ఈ స్థాయి సంఘాన్ని పునర్వవస్థీకరించారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో అంతర్రాష్ట్ర మండలి సెక్రటరీ పేరిట విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర మండలి ముందు చర్చనీయాంశాలపై ఈ స్థాయి సంఘం సభ్యులు నిరంతరం చర్చిస్తారని హోం శాఖ తెలిపింది.

15 శాతం వృద్ధిరేటే లక్ష్యం

- కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలకు వేదికగా ఏపీ
- నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్
- నేడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదం
- వనరులతోపాటు కొత్త పాలసీలూ ఉన్నాయి
- కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలి
- విజన్ 2047 భేటీలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు


స్వర్ణాంధ్రప్రదేశ్ - విజన్ 2047 రూపకల్పన సందర్భంగా పారిశ్రామికవేత్తలు, టాస్క్‌ఫోర్స్ సభ్యులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే రోజుల్లో 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలుచేసి ఫలితాలు సాధిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. అవకాశాల కల్పనతో సంపద సృష్టి సాధ్యమవుతుందని, అలా వచ్చిన సంపదను పేదవర్గాలకు పంచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు. 2014-19 టీడీపీ హయాంలో 13.5 శాతం వృద్ధిరేటు సాధించామని, ప్రస్తుతం 15 శాతం వృద్ధిరేటు సాధించగలమన్న ధీమాను చంద్రబాబు వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ - 2047పై సచివాలయంలో సోమవారం పారిశ్రామికవేత్తలతో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. విజన్ - 2047 లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం మేధోమథనం చేశారు. ఈ కమిటీ ఛైర్మన్‌గా సీఎం చంద్రబాబు, కోఛైర్మన్‌గా టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ఉన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రమంత్రులు, సీఐఐ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఇప్పుడు టెక్నాలజీ మరింత అడ్వాన్స్‌గా ఉంది. దీన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. యువతకు అవకాశాలు కల్పిస్తే తిరుగులేని ఫలితాలు వస్తాయి. ఏపీలో సహజవనరులు, మానవవనరులు, మౌలిక సదుపాయాలు, హైవేలు, ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. కొత్త ఆవిష్కరణలకు, కొత్త ఆలోచనలకు మేం వేదికగా ఉండాలనుకుంటున్నాం. నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడాం, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడున్నామని సీఎం అన్నారు. 'నాడు ఒక ఇంటి నుంచి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలన్న లక్ష్యంతో పనిచేశాం. నేడు ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం' అని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని, వీటికితోడు ఉత్తమమైన పాలసీలు కూడా ప్రకటించామన్నారు. ఈ సమావేశంలో టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జీఎం రావు, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, టీవీఎస్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, అపోలో ప్రతినిధి ప్రీతారెడ్డి, పిరామల్ గ్రూప్ ఛైర్మన్ అజయ్ పిరామల్, రెడ్డి ల్యాబోరేటరీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.40 వేల కోట్లతో టాటా 'పవర్'

(మొదటి పేజీ తరువాయి)

రెండోసారి వచ్చి చర్చించడం విశేషం. రాష్ట్రాభివృద్ధికి రతన్ టాటా ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అట్టడుగు వర్గాలకు సాధికారిత కల్పించడమే ఆయనకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు.

టాటా గ్రూప్ ప్రధాన భాగస్వామి: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో టాటా గ్రూప్ ప్రధాన భాగస్వామిగా కొనసాగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. చంద్రశేఖరన్‌తో చర్చల వివరాలను ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దివంగత రతన్ టాటా దార్శనిక నాయకత్వం, అందించిన సహకారం భారతదేశ పారిశ్రామిక రంగంపై చెరగని ముద్ర వేసిందని.. రాష్ట్ర అభివృద్ధికి కూడా ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. విశాఖలో 10 వేల ఉద్యోగాలకు అవకాశం ఉన్న కొత్త ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్థాపించడానికి టీసీఎస్ కట్టుబడి ఉందన్నారు. 'పర్యాటక, పారిశ్రామికాభివృద్ధిని పెంపొందించడానికి రాష్ట్రవ్యాప్తంగా 20 హోటళ్లతో పాటు ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను ఇండియన్ హోటల్స్ (టాటా గ్రూప్) అన్వేషిస్తోంది. మరోవైపు రూ.40 వేల కోట్ల భారీ పెట్టుబడితో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పి 5 గిగా వాట్ల విద్యుదుత్పత్తికి టాటా పవర్ అంచనాలు రూపొందిస్తోంది. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' విధానంతో రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడానికి టాటా ఇన్నోవేషన్ హబ్ మార్గదర్శకత్వం వహిస్తుంది. ఆరోగ్య రంగంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కోసం డీప్ టెక్, ఏఐ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించడానికి సమాలోచనలు చేశాం. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

పలు రంగాల్లో టాటా గ్రూప్ చేయూత: లోకేశ్

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో భాగంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో టాటా గ్రూప్ కీలక భాగస్వామి కానుందని మంత్రి లోకేశ్ తెలిపారు. మౌలిక వసతులు, చిన్న, సూక్ష్మ పరిశ్రమల రంగం, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగాల్లో చేయూతనివ్వనుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.


పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి విడుదలవుతున్న నీరు

పట్టిసీమ ఎత్తిపోతల నుంచి 3,540 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి సోమవారం 3,540 క్యూసెక్కుల గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేశారు. ఈ ఏడాది వర్షాభావంతో పలుమార్లు ట్రయల్ రన్ మాత్రమే నిర్వహించారు. తాజాగా గోదావరి నీటి మట్టం 14 మీటర్లకు పైబడి ఉండడంతో కృష్ణా డెల్టాలకు సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 పంపులు 10 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు డీఈఈ పెద్దిరాజు తెలిపారు.


మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి ఫరూక్, స్పీకర్ అయ్యన్న

మహారాష్ట్రకు చంద్రబాబు, పవన్ .. 16, 17న ఎన్డీయే తరఫున ప్రచారం

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి ఎన్డీయే తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. బీజే పీ పెద్దల ఆహ్వానం మేరకు ఈ నెల 16, 17 తేదీల్లో ఇద్దరు నేతలు మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాలకు ఇద్దరు ముఖ్య నేతలు అందుబాటులో ఉండకపోవచ్చునని సమాచారం.

'దీపం-2'గా ఉచిత సిలిండర్ల పథకం: ఉచిత సిలిండర్ల పథకానికి ప్రభుత్వం 'దీపం-2' పేరు పెడుతూ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

రీసర్వే డ్రోన్లు ఢమాల్!

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగపడకపోతే ఎవరిది బాధ్యత? ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు ఎవరిపై చర్యలు తీసుకుంటారు? రీ సర్వేను ఆపేసిన కూటమి సర్కారు, ఆ పేరిట జరిపిన కొనుగోళ్ల అక్రమాలపై దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఏదీ పారదర్శకత?

జగన్ సర్కారు 2019 డిసెంబరులో భూముల సర్వే ప్రారంభించింది. కానీ సర్వే, సరిహద్దుల చట్టాన్ని త్రికరణ శుద్ధిగా అమలుచేయలేదు. భూములను నేలమీద ఉండి కొలిస్తేనే అనేక సమస్యలు వస్తున్నాయి. కోట్లల్లో భూ వివాదాలు ఉంటున్నాయి. జగన్ సర్కారు ఈ వాస్తవాన్ని గమనించకుండా, తామే బెస్ట్ అనిపించుకోవాలని అనుకుంది. డ్రోన్లు, మినీ విమానాలతో ఆకాశం నుంచి భూముల ఫొటోలు తీసి వాటి ఆధారంగా సర్వే చేయాలని పెద్దప్లాన్ వేశారు. సంప్రదాయ పద్ధతుల్లో సర్వే చేయాలంటే కొత్తగా ఏ పరికరం కొనాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే సర్వేయర్ల వద్ద ఉన్న చైన్‌లు, ఇతర సాంకేతికతను ఉపయోగించుకోవచ్చు. జగన్ సర్కారు, ఆయన అనుంగ అధికారులు ఖరీదైన సాంకేతికతను తెచ్చిపెట్టుకోవాలని, ఇందుకోసం భారీగా కొనుగోళ్లు జరపాలని భావించారు. రోవర్‌లు, డ్రోన్లు, కంప్యూటర్లు, ప్రింటర్‌లు, సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనాలని నిర్ణయించారు. అయితే, ఇందులో ఏమాత్రం పారదర్శకతను ప్రదర్శించకూడదనుకున్నారు. తమ అస్మదీయ కంపెనీలకే టెండర్లు వెళ్లేలా నిబంధనలు, మార్గదర్శకాలు మార్చేశారు. జ్యుడీషియల్ ప్రివ్యూ(న్యాయ కమిషన్) పరిశీలనకు టెండర్లు వెళ్లకుండా వ్యవహారం నడిపారు. నిజానికి జగన్‌కు పారదర్శకతే ఉంటే రీ సర్వేకు అవసరమైన డ్రోన్లు, రోవర్‌లు ఒకేసారి కొనవచ్చు. ఇందుకు గ్లోబల్ టెండర్ పిలిస్తే అంతర్జాతీయ కంపెనీలు బిడ్డింగ్‌లో పాల్గొని పోటీని పెంచుతాయి. ఫలితంగా ప్రభుత్వానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరికరాలు అందుతాయి. అయితే, దీని వల్ల జగన్‌కు, ఆయన అనుచర గణానికి ఏం ఉపయోగం? అందుకే గ్లోబల్ టెండర్లు పిలవలేదు. తమకు నచ్చినట్లుగా టెండర్లు పిలిచి ముందుగానే అనుకున్న కంపెనీలకు టెండర్ కట్టబెట్టారు. ఇందులో ఓ రాజకీయ సలహాదారు అనుచరులు తెచ్చిపెట్టుకున్న అద్దె కంపెనీలు కూడా ఉన్నాయి. బిట్లు బిట్లుగా విడగొట్టి చిన్న టెండర్లుగా మార్చి బిడ్డింగ్ జరిపారు. దీంతో సహజంగానే పెద్ద కంపెనీలు టెండర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. అద్దె కంపెనీలే టెండర్‌లో పాల్గొని బిడ్‌లు దక్కించుకున్నాయి. ఇలా 2022 నుంచి 2024 ఫిబ్రవరి నాటికి 52 డ్రోన్లు కొన్నారు. 3వేలకు పైగా రోవర్లు కొనుగోలు చేశారు. వీటి కొనుగోలు వ్యయం 200 కోట్లపైనే. ఇదంతా కేవలం ఆరు వేల గ్రామాల్లో జరిగిన భూ సర్వేకోసం చేసినదే. ఇంకా 12వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వేచేయాలి. ఇందుకోసం దశలవారీగా డ్రోన్లు కొనాలని పెద్ద ప్లాన్‌లు వేశారు.

నేలకూలిన 44 డ్రోన్లు

సర్వేకోసం కొన్న డ్రోన్లు కొన్ని బాగా పనిచేశాయి. మరికొన్ని సాంకేతిక వైఫల్యాలతో నేలకూలాయి. కొన్ని జనావాసాల్లో కూలిపోయాయి. ఈ ప్రక్రియలో కొందరు సర్వేయర్లు గాయపడ్డారు. అయినా వీటిని బయటకురాకుండా నాటి సర్వే అధికారులు తొక్కిపెట్టారు. ప్రతిపక్షాలు గొడవ చేస్తాయన్న భయంతో ఆ ఉదంతాలు వెలుగుచూడకుండా చీకట్లో కలిపేశారు. ఇలా రీ సర్వే జరుగుతున్న సమయంలోనే 12 డ్రోన్లు ఆకాశం నుంచి నేలకూలి దెబ్బతిన్నాయి. సహజంగా ఆయా కంపెనీలే మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ కింద సర్వీసు చేయాలి. కానీ, ఆ కంపెనీలు ఓ రాజకీయ సలహాదారు అద్దెకు తెచ్చుకున్నవి కావడంతో అవి చేతులెత్తేశాయి. దీంతో ఆ డ్రోన్లు ఇనుపముక్కలుగా మిగిలాయి. ఆ తర్వాత మరో 32 డ్రోన్లు కొనుగోలు చేసి సర్వేకు ఉపయోగించారు. కానీ ఏం లాభం? కొత్తవాటి పనితీరు తెలియకముందే రెక్కలు తెగిన పక్షుల్లా నేలరాలాయి. సర్వే అధికారులు, సిబ్బంది వాటిని భద్రంగా ఆఫీసులకు తరలించారు. ఇలా 44 డ్రోన్లు మూలనపడ్డాయి. వాటిని బాగుచేయాలంటే కోట్ల రూపాయల ఖర్చుకానుందని సర్వే అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతో దెబ్బతిన్న డ్రోన్లు ఇప్పుడు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇవన్నీ జగన్‌కు, ఆయన అనుంగ ఉన్నతాధికారులకు తెలుసు. అయితే, వారి సిఫారసుల మేరకే కొన్నవి కావడంతో డ్రోన్ల డ్యామేజీపై స్పందించలేదు.

విచారణ జరుపుతాం

రీ సర్వే పేరిట కొనుగోలు చేసిన డ్రోన్లు ఎందుకూ పనికి రాకుండా పోయిన విషయం తమ దృష్టికి వచ్చిందని ప్రభుత్వం చెబుతోంది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపిస్తామని వెల్లడించింది. రీ సర్వే అంతా తప్పులే అని, ఆ పేరిట జరిగిన అక్రమాలపై విచారణ జరుపుతామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్

- ఉపాధ్యాయ స్థానానికి డిసెంబరు 5న పోలింగ్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికకు సంబంధించి పోలింగ్ డిసెంబరు 5న జరగనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఈ నెల 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పరిశీలన, 21న ఉప సంహరణకు తుది గడువని తెలిపింది. డిసెంబరు 5న పోలింగ్ జరుగుతుందని పేర్కొంది.

ప్రముఖ మృదంగ విద్వాంసుడు కమలాకరరావు కన్నుమూత



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు వరదరావు కమలాకరరావు (88) కన్నుమూశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో సోమవారం తుది శ్వాసవిడిచారు. స్వాతంత్ర్య సమర యోధులు, వారి కుటుంబాలకు నిత్యాన్నదానం సాగించిన జి.వరదారావు, నేత్రావతి దంపతులకు 1936లో కమలాకరరావు జన్మించారు. చిన్న వయసు నుంచే మృదంగం పట్ల ఎనలేని మక్కువ కనబరిచేవారు. మృదంగాన్ని నేర్చుకుని అనతికాలంలోనే దేశవ్యాప్తంగా పేరుగాంచారు. పాల్ఘాట్ మణి అయ్యర్ వద్ద గురుకులవాసం చేశారు. కళాశాల విద్యార్థిగా ఉండగానే అప్పటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా ప్రెసిడెంట్ మెడల్‌ను అందుకున్నారు. ద్వారం వెంకటస్వామి వంటి గొప్ప వయోలిన్ విద్వాంసులు మొదలుకొని జీఎన్ బాలసుబ్రహ్మణ్యం, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, చెంబై వైద్యనాథ్ భాగవతార్, టీకే రంగాచారి, శ్రీపాద పినాకపాణి, ఈమని శంకరశాస్త్రి వంటి ప్రముఖుల మెప్పుపొందారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ సహా అనేక దేశాల్లో శాస్త్రీయ సంగీత సభల్లో శ్రోతలను మైమరిపించారు. గణపతి సచ్చిదానంద స్వామి, పాల్ఘాట్ మణి అయ్యర్ మెమోరియల్, కంచికామకోటి పీఠం అవార్డులను అందుకున్నారు. ఆయన ముగ్గురు కుమారులు యోగీష్, జగదీష్, హరీష్ మృదంగం విద్వాంసులుగా రాణిస్తున్నారు. కుమార్తెలు నిర్మల, షీలా ఉన్నారు. కమలాకరరావు భార్య గతంలోనే మరణించారు.

స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ ఉంటుంది

- పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వండి
- హైకోర్టుకు నివేదించిన శాసనసభ కార్యదర్శి తరపు న్యాయవాది
- జగన్‌కు ప్రతిపక్షనేత హోదా పిటిషన్‌పై విచారణ నాలుగు వారాలకు వాయిదా

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తనకు ప్రతిపక్షనేత హోదా కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని శాసనసభ కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శిని సోమవారం హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ప్రతిపక్షనేత హోదా కల్పించేలా ఏపీ శాసనసభ కార్యదర్శిని, అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 12-బిలో ప్రతిపక్షనేత పదవి గురించి నిర్వచించారన్నారు. దీని ప్రకారం హోదా పొందేందుకు తాను అర్హుడునని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా... శాసనసభ కార్యదర్శి తరపు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపిస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. స్పీకర్‌కు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందన్నారు. జగన్ తరఫున న్యాయవాది సి.సుమన్ స్పందిస్తూ.. చిరునామా సక్రమంగా లేదనే కారణంతో స్పీకర్ కార్యదర్శి నోటీసుల స్వీకరణకు నిరాకరించారన్నారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చడంపై అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం న్యాయమూర్తి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

విశాట్-2025 నోటిఫికేషన్ విడుదల

- విజ్ఞాన్ వర్సిటీలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి మార్చి 1 నుంచి పరీక్షలు



నోటిఫికేషన్ పోస్టర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పి నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి విశాట్ 2025 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షద్వారా విజ్ఞాన్ వర్సిటీలో బీటెక్, ఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఏ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్), అగ్రికల్చరల్, ఫార్మాడీ తదితర కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తామని వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండు తెలుగురాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. విశాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ చివరి తేదీగా నిర్ణయించామని తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విజ్ఞాన్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో, www.vignan.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణకిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ గౌరిశంకర్ రావు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకుంటే వైసీపీఎల్‌పీ మొత్తం రాజీనామా చేయాలి

- జగన్ స్వయంకృతాపరాధంతోనే విపక్ష హోదాకు దూరం: షర్మిల



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే వైసీపీ శాసనసభాపక్షం మొత్తం రాజీనామాలు చేయాలి. అప్పుడు ఇంట్లో కాదు... ఎక్కడైనా కూర్చుని తాపీగా మాట్లాడుకోండి' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. సభకు వెళ్లకుండా తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాలని వైసీపీ నిర్ణయించడంపై సోమవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే పోతానని మారాం చేయడానికో పులివెందుల నియోజకవర్గ ఓటర్లు ఓటెయ్యలేదు. ఇంట్లో కూర్చొని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది. మీ స్వయంకృతాపరాధం మిమ్మల్ని ప్రతిపక్ష హోదాకు దూరం చేసింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తాననడం జగన్ అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం' అని షర్మిల అన్నారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ ఉచిత కోచింగ్

- 16 నుంచి ప్రారంభం.. రాష్ట్రవ్యాప్తంగా 5,200 మందికి శిక్షణ: మంత్రి సవిత

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. అమరావతి సచివాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. 'ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ఈ నెల 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నాం' అని మంత్రి తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు సమ్మె కాలానికీ జీతం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వంలో సమ్మె చేసిన కాలానికి కూడా జీతాలు విడుదల చేసింది. జీతాలు పెంచాలని, ఇతరత్రా డిమాండ్లపై 2023 డిసెంబరులో సమగ్రశిక్ష ఉద్యోగులు 21 రోజుల పాటు సమ్మె చేశారు. ఆ కాలానికి గత ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదు. దీనిని సమగ్రశిక్ష ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వారికి జీతాలు ఇవ్వాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

క్రీడల కుంభమేళా కల!


ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ పోటీలు నిర్వహించాలన్న స్వప్నం సాకారం చేసుకునే దిశగా భారత్ తొలి అడుగువేసింది. 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు తమకు ఆసక్తి ఉన్నదంటూ భారత ప్రభుత్వం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి అధికారికంగా ఓ లేఖ పంపింది. దీంతో సాధారణ ఒలింపిక్స్, ఆ వెంటనే జరిగే పారాలింపిక్స్ నిర్వహణను దక్కించుకునేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించబోతున్నదన్న విషయం స్పష్టమైంది. ఈ క్రీడల ఆతిథ్యం కోసం పోటీ తీవ్రంగా ఉండనుంది. హక్కుల కైవసానికి పోటీపడే దేశాల సంఖ్య రెండంకెల్లో ఉందట. వీటిలో సౌదీ అరేబియా, ఇండోనేసియా, కతార్, తుర్కియే నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురవవచ్చు. దీనికి ముందు 2030లో జరిగే యూత్ ఒలింపిక్స్‌కు సైతం మనమే వేదికగా నిలవాలని మోదీ ఆకాంక్షించారు.

మన ప్రయత్నాలు సఫలమై భారత్‌కు ఒలింపిక్స్ కేటాయిస్తే అవి ఏ నగరంలో జరుగుతాయన్న విషయమై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం అహ్మదాబాద్‌కు ప్రధాన వేదికగా అవకాశం ఇస్తారన్న విషయమూ అవగతమైంది. భారత క్రీడాప్రాధికార సంస్థకు చెందిన మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ భారత ఒలింపిక్ స్వప్నాన్ని ఆవిష్కరించారు. మోదీ ఆకాంక్ష నెరవేరితే భారత్ ఈ ఘనతను అందుకున్న నాలుగో ఆసియా దేశంగా గణుతికెక్కుతుంది. ఇంతకుముందు చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లో ఒలింపిక్స్ జరిగాయి. అన్నీ కలిసివచ్చి భారత్‌కు ఆ భాగ్యం దక్కితే.. మన దేశంలో ప్రజాదరణ పొందిన కొన్ని క్రీడల్ని జాబితాలో చేర్చడం దాదాపు ఖరారైనట్టే. వాటిలో టీ20 క్రికెట్, యోగా, కబడ్డీ, ఖో-ఖో, చెస్, స్క్వాష్‌లను పొందుపరుస్తారని భావిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఐఓసీకి ఎన్నికలు జరిగిన అనంతరం మాత్రమే వేదిక ఖరారవుతుంది. ఇక 2036 కంటే ముందు 2028లో అమెరికా, 2032లో ఆస్ట్రేలియాలో ఒలింపిక్స్ జరగనున్నాయి. మరోవైపు భారత్‌కు ఒలింపిక్స్ కేటాయింపు చేయరాదంటూ పాకిస్థాన్ ఓ వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాక్ వేదికగా జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నీకి మన జట్టును పంపేందుకు భారత ప్రభుత్వం నిరాకరిస్తున్న నేపథ్యంలో దానికి పాక్ ప్రతీకారం తీర్చుకోవాలని యోచిస్తోందట. ఈ మేరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీని సంప్రదించి, భారత్‌కు నిర్వహణ అవకాశం ఇవ్వరాదని దాయాది దేశం కోరనుందట.

భారత్ వేదికగా 1951, 1982 సంవత్సరాల్లో ఆసియా క్రీడలు, ఆ తర్వాత 2010లో ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలు జరిగాయి. కామన్వెల్త్ క్రీడలకు సంబంధించి లోపభూయిష్టమైన నిర్వహణ, అవినీతి ఆరోపణలు, భద్రతాపరమైన సమస్యలతో భారత్ ప్రతిష్ఠ మసకబారింది. కామన్వెల్త్ పోటీల నిర్వహణను అస్తవ్యస్తం చేసిన మన వ్యవస్థలు ఒలింపిక్స్ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. క్రీడల కుంభమేళాగా చెప్పుకునే ఒలింపిక్స్ నిర్వహణలో ఖర్చు అంశం అన్నింటిలోకీ అత్యంత ప్రధానమైనది. అనుకున్న అంచనాలు అవధులు దాటడం సర్వసాధారణం. ఆటలు ముగిశాక ఆర్థికంగా కునారిల్లిన దేశాలను చూశాం. ఆటల పండుగను నిర్వహించే చాన్స్ లభిస్తే ఆయా నగరాల్లో కొంతమేర పర్యాటకం అభివృద్ధి చెందవచ్చునుగాక. అలాగే మౌలిక వసతులూ, అంతర్జాతీయ స్థాయి స్టేడియాలు సమకూరుతాయనడంలోనూ సందేహంలేదు. అయితే ఆ తర్వాతే అసలు సమస్య ఉత్పన్నమవుతుంది. అట్టహాసంగా నిర్మించిన స్టేడియాలు తెల్ల ఏనుగుల్లా మారిపోతాయి. స్టేడియాల ఆలనాపాలనా తలకుమించిన భారమవుతుంది. అంతేకాదు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నది ఆర్థిక నిపుణుల అంచనా. తాజాగా జరిగిన పారిస్ ఒలింపిక్స్ కోసం ఆ దేశం సుమారు 77 వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. అయితే భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఖర్చు విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి వుంటుంది.

ఓ అధ్యయనం ప్రకారం ఒలింపిక్స్‌ను నిర్వహించిన అనంతరం ఆయా దేశాల ఆర్థిక ప్రగతి తీవ్రంగా మందగించింది. దీనికి ప్రధాన కారణం క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై పెట్టిన ఖర్చు పూర్తిగా నిరుపయోగంగా మారడమే. ఉదాహరణకు 1988 సియోల్ ఒలింపిక్స్ తర్వాతి ఏడాది దక్షిణ కొరియా జీడీపీ దారుణంగా పడిపోయింది. ఇక గ్రీసు, ఏథెన్స్, రియో క్రీడల తర్వాత ఆ దేశాల పరిస్థితి కూడా ఇదే. 2016 రియో క్రీడలకోసం ఉపయోగించిన స్టేడియాల్లో చాలావరకు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి. 1976 ఒలింపిక్స్ నిర్వహించిన కెనడాకు ఆ అప్పులనుంచి బయటపడడానికి మూడు దశాబ్దాలు పట్టింది. ఆతిథ్య దేశాలు నిర్వహణ ఖర్చు విషయంలో అత్యంత ప్రణాళికబద్ధంగా వ్యవహరించినా బిలియన్ డాలర్ల నష్టాలు మామూలే. ఏదేమైనా పోటీల నిర్వహణ అవకాశం భారత్‌కు దక్కుతుందా లేదా అనేది నిర్ధారణ కావడానికి మరికొంత సమయముంది. ఆ అవకాశం భారత్‌కు దక్కితే గత పోటీల ఆతిథ్య దేశాల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాల్సివుంది. అనవసర ఖర్చులు, ఆడంబరాలకు పోకుండా నియంత్రించుకోవాలి. క్రీడా సంస్కృతి లోపించిన భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహణతోనైనా ప్రజల్లో ఆ దిశగా కొంతమేర అవగాహన ఏర్పడినా అదే పదివేలు.

కశ్మీరం ఎటు వెళుతోంది?



ప్రపంచంలో ఎక్కడైనా భూభాగాలపై స్వామ్యాన్ని సాధించటం సులభం. ప్రజల హృదయాలను గెలుచుకోవటం కష్టం. రాజకీయ విసుర్లు ప్రతివిసుర్లతో ఆర్టికల్ 370పై పదేపదే సవాళ్లు చేయటం కంటే కశ్మీరు ప్రజలను సమాధానపరచటానికి మార్గాలను అన్వేషించటం ప్రస్తుతం అత్యవసరం. సంపూర్ణ హక్కులతో రాష్ట్ర హోదాను జమ్మూకశ్మీర్‌కు కలగచేస్తే ఆ దిశగా కీలక అడుగుపడుతుంది. అదికూడా జరక్కపోతే చరిత్ర తిరిగే మలుపులను ఊహించలేం!



■ రాహుల్ కుమార్

చరిత్రను విస్మరించటం మనకు కొత్తకాదు. చరిత్రను తవ్వితీయటమూ వింతకాదు. అలా తవ్వితీయటం మనల్ని ఒక్కోసారి నిర్ఘాంతపరుస్తుంది. నిశ్చేష్టులను చేస్తుంది. ఆగ్రహాన్ని పుట్టిస్తుంది. ఆవేశాన్ని రగుల్చుతుంది. ఆవేదన పొంగేలా చేస్తుంది. నిశ్చితాభిప్రాయాల్ని తలకిందులు చేస్తుంది. ఇంత గాఢ భావోద్వేగాలను కలిగించే చరిత్రను ఒక పట్టాన విస్మరించలేం! నిత్యం ఏదోరకంగా రగిలిపోయే కశ్మీర్‌పై ఇలా తవ్వితీసిన చరిత్ర ఒకటి ఇటీవల జనం ముందుకు వచ్చింది. కశ్మీర్‌టైమ్స్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ప్రముఖ జర్నలిస్టు అనురాధ భాసిన్ 'ఏ డిస్‌మాంటల్డ్ స్టేట్' అనే పేరుతో రాసిన చరిత్రను విస్మరిద్దామనుకున్నా విస్మరించలేం! ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా కశ్మీర్‌లో జరిగిన పరిణామాలపై ఇప్పటివరకూ వినిపించని కథ వినిపిస్తున్నానంటూ సాహసోపేతంగా ఎన్నో ఘటనలను కళ్ల ముందుంచారు. విస్మరించలేని భావనాశక్తితో ఒక రచన ఊగిపోతే దాంతో విభేదించే శక్తులూ ఉంటాయి. భిన్న ప్రయోజనాలు కాంక్షించే జన సమూహాలున్న సమాజంలో దేన్నీ ఒక దృష్టితో చూడటం అసాధ్యం. అందుకే కశ్మీర్‌పై ఏకాభిప్రాయం రావటం కష్టం! ఏకాభిప్రాయం అసాధ్యమైనా ఉన్న అభిప్రాయాల్లో న్యాయబద్ధమైనవి లేకుండా పోవు. అక్కడి ప్రజలకు సాంత్వన ఇచ్చేవి ఉండకుండా పోవు. హింసను చల్లార్చే మార్గాలను సూచించేవి కనిపించకుండా పోవు. అవేమిటో తెలుసుకోటానికి భాసిన్ రచన ఖచ్చితంగా తోడ్పడుతుంది.

జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో పొందుపరచటం చారిత్రక మహాపాపంగా పరిగణించే ధోరణి ఇప్పుడు ప్రబలంగా ఉంది. ఎటువంటి మినహాయింపుల్లేకుండా సాధారణ రాష్ట్రస్థాయినే కశ్మీర్‌కు ఆనాడు కల్పించి ఉంటే 75 ఏళ్లనాడే సమస్య సమసిపోయేదని రాజకీయంగా ఎంతైనా వాదించొచ్చు. కానీ జమ్మూకశ్మీర్.. భారత్‌లో విలీనమైన ఆనాటి చరిత్రనూ, అప్పటి పరిస్థితులనూ దృష్టిలో పెట్టుకుంటే దాన్ని అంగీకరించటం తేలిక కాదు. కశ్మీర్‌పై వచ్చిన ప్రామాణిక చరిత్రలన్నీ దీన్నే చెబుతాయి. ఆనాటి జమ్మూకశ్మీర్ మహారాజు హరిసింగ్ ప్రేమతో తన రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేయలేదు. పాకిస్థాన్ ప్రోద్బలంతో శ్రీనగర్‌ను చుట్టుముడుతున్న ఆక్రమణదారుల నుంచి రక్షించుకోటానికే భారత్ సైనిక సహాయాన్ని అర్థించారు. సాంకేతికంగా ఆనాటికి వేరే రాజ్యంగా ఉన్న జమ్మూకశ్మీర్‌కు ఆ సాయాన్ని చేయలేమనీ, తమతో విలీనమైతే అందుకు ముందుకు వస్తామని భారత్ తేల్చిచెప్పటంతో గత్యంతరం లేక హరిసింగ్ అంగీకరించారు. విలీనపత్రంపై సంతకం చేసినా పలుషరతులు పెట్టారు. రక్షణ, విదేశీ, కరెన్సీ, కమ్యూనికేషన్స్ మినహా మిగతా అన్ని విషయాలపై భారత ప్రభుత్వం చేసే ఏ చట్టానికైనా తన ఆమోదం ఉండాలని స్పష్టంచేశారు. ఈ షరతుల నేపథ్యంలోనే ఆర్టికల్ 370 వచ్చింది. జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసితులు ఎవరన్నది నిర్దేశించటానికి వీలు కలిగించే ఆర్టికల్ 35ఏను కూడా రాజ్యాంగంలో ఆ నేపథ్యంలోనే పొందుపరచారు. 35ఏ ఆర్టికల్ వల్లే భూములపై కశ్మీరు ప్రజలకు ప్రత్యేక హక్కులు వచ్చాయి. ఇతరులు అక్కడ భూములు కొనకుండా నిషేధాలూ కొనసాగాయి. ఉద్యోగాలు జమ్మూకశ్మీర్ ప్రజలకే దక్కేలా చర్యలూ తీసుకున్నారు. ఈ నిషేధాలన్నీ ఆర్టికల్ 35ఏ వల్లే ఆనాడు కొత్తగా వచ్చాయని భావించలేం. హరిసింగ్ పాలనలోనూ అవి ఎంతోకొంత అమల్లో ఉన్నాయి. ప్రజా ఒత్తిడికి తలవొగ్గి వాటిని ఆయన ప్రవేశపెట్టారు. ఇక పాలనపరంగా చూస్తే హరిసింగ్ ప్రభుత్వం ఏ మాత్రం జనరంజకమైనది కాదు. అంతా భూస్వాముల ఆధిపత్యమే ఉండేది. పౌరహక్కుల్లేవు. రాజకీయ హక్కులు అసలే లేవు. కశ్మీర్‌తో పాటు జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాల్లోనూ సంఖ్యాపరంగా అనాడు ముస్లింలే ఎక్కువగా ఉన్నా పాలనలో వారికి భాగం లేదు. కౌలుదారులుగా, కూలీలుగా, వృత్తి జీవులుగా ఉన్న వారిలో ముస్లింలే ఎక్కువ. అధిక సంఖ్యాక ప్రజలకు హక్కులు, అధికారాలు, భూసంపద పంపిణీని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ ఉనికిలోకి వచ్చింది. భారత్ సైన్యానికి చేదోడుగా నిలిచి ఆక్రమణదారులను తరమటానికి తోడ్పడింది. కశ్మీర్ భారత్‌లో విలీనమయ్యేలా ప్రజాభిప్రాయాన్ని మలచింది. ఎక్కడా జరగని స్థాయిలో భూసంస్కరణలను అమలుపరచింది. భూస్వాముల నుంచి లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని రైతులకు పంచింది. ఇదంతా గడిచిన చరిత్ర. మరి వర్తమానం సంగతేమిటి?

తీవ్ర వివాదానికి కారణమైన ఆర్టికల్ 370 రద్దును సుప్రీం కోర్టు కూడా సమర్థించింది. అసలు ఆర్టికల్ 370 రద్దయి 5ఏళ్లు గడిచిపోయాయి. జమ్మూకశ్మీర్‌కు ఒకనాడున్న ప్రత్యేకతలన్నీ పోయాయి. రాష్ట్రమే రెండు కేంద్రపాలిత ప్రాంతాలైంది. ఏళ్ల విరామం తర్వాత ఎన్నికలూ జరిగాయి. ఫలితాలూ వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో నవశకాన్ని ఆరంభించామని ప్రచారం చేసుకున్న బీజేపీ 90 స్థానాలున్న అసెంబ్లీలో 29 సీట్లతో సరిపెట్టుకుంది. కశ్మీర్‌లోయలో ఒక్క స్థానమూ గెలవలేదు. గెలిచినవన్నీ హిందువులు అధికంగా ఉన్న జమ్మూలోనే ఉన్నాయి. మరోవైపు కశ్మీర్‌లో హింసా సంఘటనలూ పెరుగుతున్నాయి. కశ్మీరేతర వ్యక్తులపై దాడులూ కొనసాగుతున్నాయి. ప్రత్యేకతలన్నీ చాలావరకూ తీసివేసి, దేశంలో అమలయ్యే చట్టాలన్నిటినీ జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశామని చెప్పుకొంటున్నప్పటికీ మారిన పరిస్థితులతో ప్రజలు సమాధానపడినట్టుగా దాఖలాలు కనిపించటం లేదు. ఎందుకిలా జరిగింది? కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగా జాతీయ జీవన స్రవంతిలో కశ్మీర్ ప్రజలు ఎందుకు కలవలేకపోతున్నారు?

వీటికి సమాధానాలు తెలుసుకోటానికి ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా జరిగిన పరిణామాల గురించి లోతుగా తెలుసుకోవాలి. ఆర్టికల్ 370ని రద్దుచేసిన 2019 ఆగస్టు 5కు చాలా ముందుగానే కశ్మీర్‌లో అరెస్టులు మొదలయ్యాయి. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారని అనుకున్న వాళ్లందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు 5 నుంచి కశ్మీర్ అంతా లాక్‌డౌన్ పరిస్థితే నెలకొంది. రాజకీయ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులను గృహనిర్బంధంలో ఉంచారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లను వాడకుండా నిషేధాలను విధించారు. ల్యాండ్‌లైన్ల ఫోన్లపైనా ఆంక్షలు అమలయ్యాయి. ప్రజల మధ్య సమాచారమార్పిడి పూర్తిగా నిలిచిపోయింది. ప్రసార సాధనాల వార్తా సేకరణకు అన్ని వైపుల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజలకు వివరమైన సమాచారం లభించే పరిస్థితి లేదు. జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే చట్టాల మంచి చెడులపై అభిప్రాయాలు వెల్లడించే మార్గం ప్రజలకు లేదు. ప్రజల భౌతిక సంచారంపైనా అడుగడుగునా నిషేధాలు అమలయ్యాయని చెబుతూ అనురాధ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. ఆ తర్వాత 2020 మార్చిలో విధించిన కోవిడ్ లాక్‌డౌన్‌తో జనజీవితం మరింత ఆంక్షలమయమైంది. తమ జీవితాలనూ తమ రాజకీయాలనూ తాము అనుసరించాల్సిన ఆర్థిక విధానాలనూ ఇతర రాష్ట్రాలతో తాము కొనసాగించాల్సిన సంబంధాలనూ నిర్దేశించే అనేక నిర్ణయాలు కశ్మీర్ ప్రజల ప్రమేయం లేకుండా జరిగిపోయాయనీ, 1947 తర్వాత ఏ రాష్ట్ర ప్రజలకూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్నదే అనురాధ వాదన సారాంశంగా చెప్పుకోవచ్చు. ఆర్టికల్ 370ను కశ్మీర్ భారత్‌లో విలీనం కావటానికి తోడ్పడే విశిష్ట రాజ్యాంగ సాధనంగా గతంలో భావించారు. దాన్ని 2019 ఆగస్టు 5న నిర్వీర్యం చేసినా ఎప్పటి నుంచో దాన్ని బలహీనపరచటం మొదలైంది. పలు రాష్ట్రపతి ఉత్తర్వులతో కీలక కేంద్ర చట్టాలన్నీ కశ్మీర్‌లో అప్పటికే అమలయ్యాయి. అందుకే అది అలంకారప్రాయంగా మిగిలిపోయింది. బలమైన భావోద్వేగ అంశంగా మాత్రమే ఉండిపోయింది. దాన్నొక్కదాన్ని తొలగిస్తే సమస్య జటిలం అయ్యేది కాదు. సంపూర్ణ రాష్ట్ర హోదానీ తొలగించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు చేయటం, శాశ్వత నివాసీయులుగా విద్యా, ఉద్యోగాల్లో కశ్మీర్ ప్రజలకు లభించే ప్రత్యేక హక్కులను నిర్వీర్యం చేయటం, భూములు కశ్మీరేతర ప్రజల్లోకి వెళ్లేలా పలు చట్టాలను మార్చటం, ఇతర రాష్ట్రాల ప్రజలకు ఆస్తుల కొనుగోలుపై ఏదో రూపంలో హక్కులు లభించేలా చూడటం.. ఇప్పుడు తీవ్ర సమస్యలుగా మారాయి. ఈ మార్పులకు కశ్మీర్ ప్రజలు ఎలా సమాధానపడతారన్నదే సవాల్‌గా మారింది. ఈ మార్పులకు వారు అంగీకరించనంత వరకూ సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న పూచీలేదు!

ప్రత్యేక హక్కులను వదులుకోవటం ఎక్కడా సులభంగా జరగదు. చారిత్రక సందర్భం ఒక్కోచోట ఒక్కో విధంగా ఉండొచ్చు. కానీ ఆ సందర్భంగా ఒనగూడిన హక్కులు స్థిరమైన ప్రత్యేక మనఃస్థితిని కలిగిస్తాయి. అది బలీయంగా ఉన్నంత వరకూ ప్రజల మనస్సుల్లో ప్రత్యేక హక్కుల భావం తొలగిపోదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంగా కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం, తెలంగాణ ప్రాంతీయ కమిటీ, తెలంగాణ మిగులు

కశ్మీర్‌టైమ్స్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ప్రముఖ జర్నలిస్టు అనురాధ భాసిన్ 'ఏ డిస్‌మాంటల్డ్ స్టేట్' అనే పేరుతో రాసిన చరిత్రను విస్మరిద్దామనుకున్నా విస్మరించలేం! ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా కశ్మీర్‌లో జరిగిన పరిణామాలపై ఇప్పటివరకూ వినిపించని కథ వినిపిస్తున్నానంటూ సాహసోపేతంగా ఎన్నో ఘటనలను కళ్లముందుంచారు.

నిధులు, ముల్కీ నిబంధనలు, ఆరుసూత్రాల పథకం, 610 జీవో లాంటివన్నీ దశాబ్దాలపాటు ప్రజల మనస్సుల్లో నిలిచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు దారితీశాయి. నిధులు, నీళ్లు, నియామకాలు తెలంగాణ వాసులకే పూర్తిగా దక్కాలనే ఆకాంక్ష, పట్టుదలను అసలుసిసలైన ప్రజాస్వామ్య కోరికలుగా భావిస్తే కశ్మీర్ ప్రజలు అవే కోరుకుంటే కాదనలేని పరిస్థితే ఉంటుంది. ప్రజాస్వామ్య కోరికను ఒక చోట ఆమోదించి మరొకచోట తిరస్కరించటాన్ని ఎవరూ సమర్థించుకోలేరు. తెలంగాణ రాష్ట్రం అవసరం గురించీ జరిగిన అన్యాయాల గురించీ వాగ్దానభంగాల గురించీ సాగినన్ని చర్చలు ఏ ప్రత్యేక రాష్ట్రోద్యమాల్లోనూ సాగలేదు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందించిన సౌలభ్యాలతో చర్చలు, ప్రతిచర్చలు భిన్న వేదికలపై కనీవినీ ఎరగని రీతిలో విజృంభించి బలమైన సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి.


అంతర్జాతీయ సరిహద్దులో కశ్మీర్ ఉండటాన్నీ మతపరమైన సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకుని భిన్న ప్రమాణాలను అనుసరిస్తే దూరాలు పెరుగుతాయి తప్ప తరగవు. ప్రపంచంలో ఎక్కడైనా భూభాగాలపై స్వామ్యాన్ని సాధించటం సులభం. ప్రజల హృదయాలను గెలుచుకోవటం కష్టం. రాజకీయ విసుర్లు ప్రతివిసుర్లతో ఆర్టికల్ 370పై పదేపదే సవాళ్లు చేయటం కంటే కశ్మీరు ప్రజలను సమాధానపరచటానికి మార్గాలను అన్వేషించటం ప్రస్తుతం అత్యవసరం. సంపూర్ణ హక్కులతో రాష్ట్ర హోదాను జమ్మూకశ్మీర్‌కు కలగచేస్తే ఆ దిశగా కీలక అడుగుపడుతుంది. అదికూడా జరక్కపోతే చరిత్ర తిరిగే మలుపులను ఊహించలేం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

అక్షరాలను శ్వాసించిన 'జయమ్' నవలా స్రష్ట

'మీ రచనా శక్తికి, శైలికీ నా జోహార్లు. ఇంత గొప్ప వచనం ఈ మధ్య కాలంలో చదవలేదు' అంటూ నాయుని కృష్ణమూర్తి వచన భాగవతం మొదటి భాగానికి బొమ్మలు వేయడానికి అంగీకరిస్తూ బాపు రాసిన ఉత్తరంలోని మాటలివి. కృష్ణమూర్తి అడక్కుండానే 'మిగతా భాగాలకు కూడా బొమ్మలు వేస్తాను పంపించండి' అన్నారు బాపు. నాయుని కృష్ణమూర్తి ఆధునిక వచనంలో రాసిన రామాయణ, భాగవతాలే కాదు, మహాభారతం మూల కథ ఆధారంగా చాలా సరళంగా, సులభ శైలిలో రాసిన 'జయమ్' నవల చాలా ప్రసిద్ధమైంది.

తెల్లని జుట్టు, తెల్లని గడ్డం, తెల్లని ప్యాంటుషర్టులో చిరునవ్వుతో ఆప్యాయమైన పలకరింపుతో ఒక తాత్వికుడిలా నడయాడిన నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన కథకుడు, నవలాకారుడు, నాటక రచయిత, నిఘంటువుల నిర్మాత, సినీ గేయరచయిత మాత్రమే కాదు, అనేక పత్రికల్లో పనిచేసిన పాత్రికేయుడు, 'స్నేహబాల' సంపాదకుడు కూడా. గుర్రంకొండ మండలం నడింపర్ల గ్రామంలో 1951 నవంబర్ 12న ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి తన 67వ ఏట 2018 మార్చి 1న కన్నుమూశారు. తన 22వ ఏట రాసిన 'యామినీకుంతలాలు' నవలకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఉగాది నవలల పోటీలో మూడవ బహుమతి లభించింది. ఉన్నత విలువలు గల పాత్రలు పడే సంఘర్షణతో అభ్యుదయ భావాలతో ఈ నవల సాగుతుంది. ఎన్ని సమస్యలు వచ్చినా జీవితం నుంచి పారిపోకూడదనే హితవే ఈ నవల సారాంశం. 'మనిషి గుర్రమురోరి మనిషీ', 'ప్రలోభం' నవలలు కూడా రాశారు. కృష్ణమూర్తి ముప్పై కథలు రాశారు. వ్యక్తిగా, రచయితగా ఆయనలో నిరాడంబరత్వమే తప్ప ఎక్కడా ఆవేశం కనిపించదు. పతనమవుతున్న కుటుంబ సంబంధాలు, విలువల పట్ల ఆవేదన కృష్ణమూర్తి రచనల్లో నిండుగా వ్యక్తమైంది.



ఆప్యాయమైన పలకరింపుతో ఒక తాత్వికుడిలా నడయాడిన నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన కథకుడు, నవలాకారుడు, నాటక రచయిత, నిఘంటువుల నిర్మాత, సినీ గేయరచయిత, పాత్రికేయుడు. ఆయన కీర్తిశిఖరం 'జయమ్'. మహాభారత మూల కథ ఆధారంగా సృజనాత్మకతను జోడించి రాసిన నవల అది. వ్యాసుడి కాలంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన ఘర్షణ నిజంగా జరిగిన చరిత్రగా కృష్ణమూర్తి విశ్వసిస్తారు.

ఇంగ్లీషు నేర్చుకునే తెలుగు విద్యార్థుల కోసం మూడు నిఘంటువులను నాయుని కృష్ణమూర్తి తయారు చేశారు. బొమ్మల ద్వారా గుర్తుపట్టడానికి తెలుగు -ఇంగ్లీషు బొమ్మల నిఘంటువు, తెలుగు - ఇంగ్లీషు సచిత్ర నిఘంటువును రూపొందించగా, మూడవదిగా తెలుగు-ఇంగ్లీషు విద్యార్థి నిఘంటువును తయారు చేశారు. తెలుగు పదాలు తెలిసిన విద్యార్థులు వాటిని ఇంగ్లీషులో ఏమంటారో తెలుసుకోవడానికి బొమ్మలతో ఈ నిఘంటువులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తయారు చేశారు. ఏ విశ్వవిద్యాలయాలో, ఏ పరిశోధనా సంస్థలో తయారు చేయవలసిన నిఘంటువుల నిర్మాణాన్ని, ఒక్కడుగా నాయుని కృష్ణమూర్తి భుజానికెత్తుకుని పూర్తి చేశారు.

నాయుని కృష్ణమూర్తి కీర్తిశిఖరం 'జయమ్'. మహాభారత మూల కథ ఆధారంగా సృజనాత్మకతను జోడించి రాసిన నవల అది. వ్యాసుడి కాలంలో కౌరవులు, పాండవుల మధ్య జరిగిన ఘర్షణ నిజంగా జరిగిన చరిత్రగా కృష్ణమూర్తి విశ్వసిస్తారు. కురువంశం తన కళ్లముందే సర్వనాశనం కావడం పట్ల వ్యాకులత చెంది, వంశ నాశనానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ వ్యాసుడు 'జయమ్' పేరుతో కావ్యం రాస్తాడు. వ్యాసుడి తరువాత ఈ కావ్యాన్ని జనమేజయుడికి వైశంపాయనుడు ఎన్నో వివరణలు, పూర్వకథలు, శాస్త్రాలు జోడించి మహాభారతంగా వినిపిస్తాడు. దీంతో వ్యాసుడు రాసిన 'జయమ్' 8,800 శ్లోకాల నుంచి 24 వేల శ్లోకాలుగా పెరిగిపోతుంది. వేల సంవత్సరాల క్రమంలో పౌరాణికులు భారతాన్ని విపరీతంగా పెంచేశారు. స్కాండినేవియన్ సాహితీవేత్త సోరెన్ సోరెన్ సన్ 1883–94 మధ్య మహాభారతం నుంచి మూల కథను వేరు చేయడానికి ప్రయత్నం చేశాడు. ఎనభై ఏళ్ల తరువాత గుజరాత్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ అహ్మదాబాద్ బ్రాంచి డైరెక్టర్ ప్రొఫెసర్ కేశవరావు కె.శాస్త్రి కొన్నేళ్లపాటు శ్రమించి మహాభారతం నుంచి మూల కథ 'జయమ్'ను వేరు చేసి 'జయసంహితను' ప్రచురించారు. పాండురాజు మరణం తరువాత కుంతీదేవి కుమారులతో హస్తినకు వెళ్లడంతో 'జయమ్' కథ మొదలవుతుంది. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక పాండవులు హస్తినాపురానికి తిరిగి రావడంతో నవల పూర్తవుతుంది.

నాయుని కృష్ణమూర్తి అక్షరాలను నమ్ముకున్న వారే కాదు, ఆ అక్షరాలను శ్వాసించిన ఆచరణశీలి. చౌడేపల్లెలో అన్నదమ్ములతో కలిసి విజయవాణి ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించడమే కాదు, అక్కడి నుంచి రాష్ట్రంలోని విద్యార్థుల కోసం 'మా బడి' 'పాఠశాల' అనే విద్యావిషయక పత్రికలను కూడా తీసుకొచ్చారు. దేశమంతా 1991లో చేపట్టిన సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా, మన రాష్ట్రంలో ఎంపికైన చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని నూతన అక్షరాస్యుల కోసం 'వెలుగుబాట' అన్న పత్రికను కూడా తీసుకొచ్చారు. ఈ పత్రికపైన 1995లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ వారు డాక్యుమెంటరీని రూపొందించారు. జిల్లా సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మన్‌గా నాయుని కృష్ణమూర్తి పదిహేను సంవత్సరాలు పనిచేశారు. రాష్ట్ర లిటరరీ మిషన్‌తో పాటు, కేంద్ర లిటరరీ మిషన్‌లో కూడా సభ్యుడిగా వ్యవహరించారు. బహుముఖీనమైన ప్రతిభకు తోడు, ఆయన మనుషులను ఎంతగానో ప్రేమించారు. ఆ ప్రేమే పునాదిగా ఆయన నలుగురు అన్నదమ్ముల కుటుంబ సభ్యులంతా కలిసి చౌడేపల్లెలో ఇప్పటికీ ఒకే ఇంట్లో ఉమ్మడిగా జీవించడం అరుదైన ఆదర్శం.

● రాఘవ

(నేడు నాయుని కృష్ణమూర్తి జయంతి)

'పునర్విభజన' సమ ప్రాతినిధ్యం కల్పించేనా?

వచ్చే ఏడాది జనగణన ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందులో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అమలు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. తద్వారా అన్ని ప్రాంతాలు, వర్గాలకు న్యాయబద్ధమైన హక్కుగా తగిన ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరి కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితమవుతుందా? లేక లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాలు, ప్రాంతాలకు పారదర్శక ప్రాతినిధ్యం లభించే దిశగా రానున్న జనాభా లెక్కలు ఓ మలుపుగా నిలవాల్సిన అవసరమున్నది.

పదేండ్లకోసారి జనగణన చేయడమనేది పాలన, ప్రణాళికలో చాలా ముఖ్యమైన ప్రక్రియ. జనాభా, ప్రజల స్థితిగతులు, అవసరాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, వనరుల పంపిణీకి జనగణన ఉపయోగపడుతుంది. అంతేకాకుండా నియోజకవర్గాల పునర్విభజనకు కూడా జనాభా లెక్కలే ప్రామాణికంగా నిలుస్తాయి. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమమవుతుంది.

భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సుదీర్ఘమైన చరిత్ర ఉన్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు గాను డీలిమిటేషన్ ప్రక్రియను మొదటిసారిగా తీసుకొచ్చారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో భిన్న ప్రాంతాల్లో, భిన్న స్థాయిలో జనాభా కలిగి ఉండటం, విభిన్న వర్గాలు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమతుల్యత పాటించేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టారు. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జనాభా నియంత్రణ కార్యక్రమం దక్షిణాది రాష్ట్రాల్లో విజయవంతంగా అమలైంది. అందువల్ల ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉన్నది. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన చర్చ జరుగుతున్నది. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన చేస్తే జనాభా నియంత్రణ, ఆర్థికాభివృద్ధిలో చైతన్యం కనబర్చిన రాష్ట్రాలుగా సీట్ల పెంపులో వెనుకబడిపోవడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలు మూల్యం చెల్లించుకున్నట్టవుతుందని కొందరు పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు. లేకపోతే, జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాదిన సీట్లు భారీగా పెరిగి, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక వనరుల పంపిణీ, సామాజిక అభివృద్ధి, ముఖ్యంగా రాజకీయంగా, పాలనలో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకం. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. అంతేకాదు, నియోజకవర్గాల పునర్విభజన ద్వారా మహిళలకు దక్కాల్సిన సీట్ల సంఖ్య కూడా పెరిగే ఆస్కారమున్నది. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేందుకు ఎదుర్కొంటున్న ఆటంకాలు తొలగిపోతాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉన్నది. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. అలాంటి సమగ్ర సమాచారాన్ని విశ్లేషిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు, భావనలను గౌరవించినట్టు అవుతుంది. ఏండ్ల తరబడి జనాభా వృద్ధి రేటులో స్థిరత్వాన్ని పాటిస్తూ, ఆర్థికాభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు పారదర్శకమైన ప్రాతినిధ్యం లభించే విధంగా 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటిస్తామనే భరోసా కల్పించాలి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సీట్లు కేటాయించాలి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. సమగ్ర, శాస్త్రీయ దృక్పథంతో నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే భారతదేశ సమాఖ్య, ప్రజాస్వామిక స్ఫూర్తి పరిడవిల్లుతుంది. రాజ్యాంగంలోని మొదటి అధికరణ నిర్దేశించినట్టు 'India that is Bharath, shall be a Union of States' అనే మాటను ప్రతిబింబించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండాలి. అందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికి, దేశ సమగ్రతకు తలవంపులు తెచ్చే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.




సమగ్ర, శాస్త్రీయ దృక్పథంతో నియోజకవర్గాలను పునర్విభజించి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే భారతదేశ సమాఖ్య, ప్రజాస్వామిక స్ఫూర్తి పరిఢవిల్లుతుంది. రాజ్యాంగంలోని మొదటి అధికరణ నిర్దేశించిన 'India that is Bharath, shall be a Union of States' అనే మాటను ప్రతిబింబించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండాలి. అందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.




■ బోయినపల్లి వినోద్‌కుమార్

పార్లమెంట్ మాజీ సభ్యులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





అమరావతికి ఆర్థిక పునరుజ్జీవం

ఆవిరైన ఆశలకు ఊపిరిపోశారు. అమరావతి అభివృద్ధికి మళ్లీ బీజం వేశారు. ఐదేళ్ల తర్వాత కలలను సాకారం చేస్తూ సోమవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి కృష్ణాజిల్లావాసుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బందరు పోర్టు, గన్నవరం విమానాశ్రయం, అమరావతి మెట్రో.. వంటి కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు శుభపరిణామాలుగా పేర్కొంటున్నారు. ఇక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అమరావతి అవుటర్ రింగురోడ్డు అవసరాన్ని తెలియజేయడం మరో ముఖ్యమైన అంశంగా చెబుతున్నారు.

- (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



రాజధానికి రెక్కలు

ఉమ్మడి కృష్ణాకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు

అమరావతి అవుటర్‌పై ఆశలు

'గత ప్రభుత్వ హయాంలో అమరావతి అవుటర్ రింగురోడ్డు ప్రాజెక్టు నిలిచిపోయింది. 189 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఎక్స్‌ప్రెస్-వే పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు రాజధానిని.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తుంది. ఈ ప్రాజెక్టు మన రాష్ట్రంలో ప్రాంతీయ అనుసంధానతను, ఆర్థిక అభివృద్ధిని పెంచుతుంది.' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

కృష్ణా వర్సిటీ, వీఎంసీకి ఊతం

మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీకి రూ.9.67 కోట్లు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం అరకొర కేటాయింపులతో నెట్టుకురాగా, టీడీపీ ప్రభుత్వం వర్సిటీకి కేటాయింపులను గణనీయంగా పెంచింది. అలాగే, విజయవాడ నగరంలో మౌలిక వసతుల కల్పనకు వీఎంసీకి రూ.10 కోట్లు కేటాయించారు.

అమరావతికి ఊపిరినిస్తూ లైట్ మెట్రోలో కదలిక

- రూ.50 కోట్లు కేటాయిస్తూ కీలక నిర్ణయం
- బందరు పోర్టుకు రూ.150 కోట్లు
- కృష్ణా వర్సిటీ, వీఎంసీకి కూడా నిధులు
- కృష్ణాడెల్టాకు రూ.377 కోట్ల కేటాయింపు

బందరు పోర్టుకు ముందడుగు

ఉమ్మడి కృష్ణా జిల్లావాసుల శతాబ్దాల కల మచిలీపట్నం పోర్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోర్టు నిర్మాణాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. నవయుగతో ఉన్న నిర్మాణ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఆ తర్వాత డీపీఆర్ పేరుతో ఏడాది కాలక్షేపం చేశారు. 2020-21 బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. 2021-22 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినా పైసా ఖర్చు పెట్టలేదు. సుమారు రూ.12 వేల కోట్ల పైచిలుకు నిర్మాణ వ్యయమయ్యే పోర్టుకు ఈసారి బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించారు.

కృష్ణాడెల్టాకు ఊపిరి

ఉమ్మడి కృష్ణాలో సుమారు 10 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణాడెల్టా ఆధునీకీకరణతో మొత్తం ఆయకట్టుకు నీరు అందే అవకాశం ఉంటుంది. దశాబ్దకాలంగా ఆధునికీకరణ పనులు సాగుతూనే ఉన్నాయి. రూ.3,900 కోట్లతో 2007లోనే కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఆ తర్వాత అంచనాలు రెట్టింపయ్యాయి. ఇప్పటి వరకు సుమారు రూ.2వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంకా డెల్టా ఆధునికీకరణ పూర్తి కాలేదు. అంచనా వ్యయాలు పెరిగాయి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పనులు జరగడం లేదు. డెల్టా ఆధునికీకరణ చేస్తే సాగునీరు వృథా కాకుండా ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. 2023లో వైసీపీ సర్కార్ రూ.279 కోట్లు కేటాయించగా, టీడీపీ సర్కార్ రూ.377 కోట్లు ఇచ్చింది.

- మరిన్ని కథనాలు 8లో

బడ్జెట్ భేష్ • ఎమ్మెల్యేల మనసులో మాట

8లో

వామపక్షాల పెదవి విరుపులు



విదేశీ.. విహంగామా



- కొల్లేరుకు భారీగా చేరిన విదేశీ పక్షులు
- రకరకాల పక్షులతో ఆటపాకలో సందడి
- పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య

ఆనందం ఎగురుకుంటూ వచ్చింది. ఆహ్లాదం రెక్కలు విప్పుకొంటూ వాలింది. వినీలాకాశం నుంచి వచ్చిన విదేశీ అనుబంధాలు కొల్లేరుకు కొత్తకళను తెచ్చాయి. నీలాల నింగికీ, నీలిరంగు నీటికీ వంతెన కడుతూ వచ్చిన ఈ విదేశీ పక్షులతో కైకలూరు నియోజకవర్గంలోని ఆటపాక పక్షుల కేంద్రం కిలికిలలాడుతోంది. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి శీతాకాలపు అతిథులుగా వస్తున్న ఈ పక్షిరాజాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ల ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్లు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి కోసం ఏటా శీతాకాలంలో ఇలా సందడి చేస్తుంటాయి. - కైకలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)







మాలధారణం

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భవానీ దీక్షల స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు మండల దీక్షలు స్వీకరిస్తారు. ఆలయంలో దుర్గమ్మ అర్చనామూర్తిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చి, దీక్షల స్వీకరణ వేదిక వద్ద ఉంచారు. హారతులిచ్చిన అనంతరం గురుభవానీలు భక్తులకు దీక్షలు ఇచ్చారు.

6లో

• కార్తీక పుణ్యస్నానం





కార్తీకమాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కృష్ణానదిలో పుణ్యస్నానాల అనంతరం దీపాలు వదిలి, సమీపంలోని శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో దుర్గాఘాట్ కిటకిటలాడింది. కార్తీక దీపాలను నదిలో వదిలిన భక్తులు అనంతరం పరమేశ్వరుడిని దర్శించుకున్నారు.

డిజిటల్ అరెస్ట్.. బీ అలెర్ట్

సైబర్ నేరగాళ్ల సరికొత్త నేరాలు

నగరంలో పెరుగుతున్న సైబర్ కేసులు

- కేసులు, అరెస్టుల పేరుతో ఫోన్లు
- భయాలు, బెదిరింపులతో హడావిడి



6లో

• పటమటలంకకు చెందిన ఓ వ్యక్తికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ఇంగ్లీష్‌లో మాట్లాడాడు. ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'మీ ఫోన్ నెంబర్ నుంచి అనేక మందికి వేధింపులు జరుగుతున్నాయి. దీనిపై అంధేరి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.' అని చెప్పాడు. దీనికి ఇవతలి వ్యక్తి కంగారు పడ్డాడు. ఇంగ్లీష్‌పై పట్టున్న ఈయన తాను ఎలాంటి వేధింపులు చేయలేదని చెప్పాడు. ఎఫ్ఐఆర్ నెంబర్లు చెప్పాలని అడిగాడు. లైన్‌లో ఉంటే పోలీసులకు కలుపుతామని చెప్పి ఆ ఫోన్‌ను మరొకరికి కలిపాడు. కేసులు నమోదయ్యాయని చెబుతూ ఎఫ్ఐఆర్ నెంబర్లు తెలిపాడు. వెంటనే మళ్లీ ముందుగా ఫోన్లో మాట్లాడిన వ్యక్తి కేసు లేకుండా చేస్తామని భరోసా ఇచ్చాడు. తాము చెప్పినట్టు చేయకపోతే సిమ్ బ్లాక్ అయిపోతుందని బెదిరించాడు. ఇక్కడి వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తానని చెప్పడంతో అవతలి వ్యక్తి వెంటనే ఫోన్ కట్ చేశాడు. మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఇది తాజాగా జరిగిన ఘటన.

• తక్కువ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని తెలియజేసే వీడియో లింక్ సూర్యారావుపేటలో ఉంటున్న ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చింది. ఆ వ్యక్తి వెంటనే సైబర్ క్రైం పోలీసుల వద్దకు వెళ్లాడు. వచ్చిన వీడియోను పోలీసులకు చూపించాడు. ఇదంతా ఒక మోసమని చెప్పిన పోలీసులు అతనికి ఓ అవగాహన కల్పించారు. ఇంతవరకు బాగానే ఉంది. తర్వాత కొద్దిరోజులకు ఆయన ఫోన్‌కు వాట్సాప్‌లో ఒక నోటీసు వచ్చింది. కాసేపటికి వీడియో కాల్ వచ్చింది. విదేశాలకు పంపే పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, ముంబై పోలీసులు పట్టుకున్నారని ఫోన్ చేసిన వ్యక్తి చెప్పాడు. ఎలాంటి విచారణ లేకుండా ఉండాలంటే తాను చెప్పినట్టు చేయాలన్నాడు. అతను చెప్పినట్టు డబ్బు పంపాడు. ఈవిధంగా రూ.10 లక్షల వరకు కోల్పోయాడు. ఒక కేసులో త్రుటిలో తప్పించుకున్న ఆయన డిజిటల్ అరెస్టులో మాత్రం ఇరుక్కుపోయాడు. ఇన్నాళ్లూ వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లతో రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు... ఇప్పుడు డిజిటల్ అరెస్టులపై పడ్డారు. కేసులు, నోటీసుల పేరుచెప్పి రూ.లక్షల్లో కాజేస్తున్న ఘటనలు ఇప్పుడు నగరంలో ఎక్కువగా జరుగుతున్నాయి.

నగర వైసీపీకి మరో షాక్

- నలుగురు కార్పొరేటర్లు జనసేనలోకి..
- పవన్ సమక్షంలో చేరిక



8లో

భవానీ దీక్షల స్వీకరణ ప్రారంభం

- ఇంద్రకీలాద్రిపై మారుమోగిన జై దుర్గా జై జై దుర్గా నామస్మరణ
- చిరుమందహాసంతో కొలువుతీరిన కనకదుర్గమ్మ
- 15వ తేదీ వరకు మండల దీక్ష స్వీకరణ



కనకదుర్గమ్మ అర్చనా మూర్తికి హారతి ఇస్తున్న పీఠాధిపతి రాజాజీ గురుజీ. చిత్రంలో ఈవో రామారావు



మాలధారణకు వచ్చిన భవానీలు

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షల స్వీకరణ కార్యక్రమం జై దుర్గా జై జై దుర్గా నామస్మరణ నడుమ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. చిరుమందహాసంతో ఆసీనురాలయిన కనకదుర్గమ్మ అర్చనా మూర్తి కరుణా కటాక్షాలను కోరుతూ భక్తులు భవానీ దీక్షను స్వీకరించారు. ఈ నెల 15వ తేదీ వరకు మండల(41 రోజులు) దీక్షలు స్వీకరించనున్నారు. తొలుత ఆలయంలో దుర్గమ్మ అర్చనా మూర్తిని పల్లకిలో ఊరేగింపుగా దీక్షల స్వీకరణ వేదిక వద్దకు ఆలయ ఈవో రామారావు తదితరులు మేళతాళాలు, వేదమంత్రాలతో తీసుకువచ్చారు. వేదికపై అమ్మవారికి హారతి ఇచ్చారు, అనంతరం ఈవో రామారావు విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం తరపున యద్దనపూడి నాగరాజుశాస్త్రి, యనమండ్ర ఉమాకాంత శర్మ ఆచార్య గురుభవానీలుగా భక్తులకు దీక్షలు ఇచ్చారు. మహిళలు, పురుషులు, బాలబాలికలు దీక్షలు స్వీకరించారు. దీక్షలు స్వీకరించినవారికి ఈవో రామారావు అమ్మవారి స్తోత్రాలు, నామాలు ఉన్న పుస్తకాలను పంపిణీ చేశారు. దీక్షలకు సంబంధించిన నియమ నిబంధనల కరపత్రాలను అందజేశారు. పురాణపండ శ్రీనివాస్ రాయగా, బొల్లినేని కృష్ణయ్య దంపతులు ప్రచురించి ఇచ్చిన శ్రీనిధి , లలితా సహస్రనామాల పుస్తకాలను పంచారు. ఈ సందర్భంగా ఈవో రామారావు మాట్లాడుతూ వార్షిక భవానీ మండల దీక్షల స్వీకరణ ప్రారంభమయిందన్నారు. డిసెంబరు 14వతేదీ సాయంత్రం శివరామకృష్ణ క్షేత్రం నుంచి కలశజ్యోతుల ఉత్సవం జరుగుతుందని తెలిపారు. అదే నెల 21 నుంచి 25 వతేదీ వరకు దీక్షల విరమణలు ఉంటాయన్నారు. డిసెంబరు 25 వ తేదీ ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి ఉంటుందని తెలిపారు. కలశజ్యోతులు, దీక్షల విరమణలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైదిక కమిటీ సభ్యుడు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి భవానీదీక్షల విశిష్టతను వివరించారు. వేద పండితుడు శ్యావాస మహర్షి, అర్చకుడు వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు మాలధారణ చేస్తున్న ఈవో రామారావు



మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు

అబుల్ కలాం ఆశయాలను సాధిద్దాం

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు. చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను సాధిద్దామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం జెడ్పీ కాన్ఫరెన్సు హాలులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణరావు మాట్లాడుతూ ప్రజలందరూ విద్యావంతులవ్వాలని ఆకాంక్షించిన నేత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగం అభివృద్ధి కాని రోజుల్లోనే అబుల్ కలాం అరబ్బీ, పరిషియన్ భాషలు నేర్చుకోవడమే కాకుండా ఆ భాషల్లో కవితలు రాశారన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ భారతీయుల మేధస్సు దేశ విదేశాల్లో విద్యారంగంలో రాణిస్తోందన్నారు. జెడ్పీ సీఈవో కన్నారావు, డీఈవో రామారావు ప్రసంగించారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు అజీం, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహతో కలిసి ఆమె అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 123 అర్జీలు వచ్చినట్లు వివరించారు.

ప్రతి ఇంటా వెలుగులు నింపాలి

హోంమంత్రి అనిత

ఎస్ఎల్‌వీలో ఘనంగా కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న హోంమంత్రి అనిత

గుణదల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రతి ఇంటా చీకటిని పారద్రోలి వెలుగులు నింపాలని హోంమంత్రి అనిత ఆకాంక్షించారు. రామవరప్పాడు ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ విల్లాస్‌లో రత్నగణపతి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనిత హాజరై మాట్లాడుతూ కార్తీక మాసంలో పెట్టే దీపం మన జీవితంలో పెనుమార్పులు తీసుకొస్తుందని చెప్పారు. పవిత్రమైన కార్తీకమాసంలో దీపోత్సవ కార్యక్రమాన్ని ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ వారు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. భక్తిశ్రద్ధలతో విల్లాస్‌లో నివాసాలు ఉండేవారంతా దీపోత్సవంలో పాల్గొని పరమశివుడి ఆశీస్సులు పొందడం విశేషం అని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిధిగజపతిరాజు అన్నారు. ఎస్ఎల్‌వీ గ్రీన్ విల్లాస్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్తీక దీపోత్సవం నిర్వహించడం జరిగిందని బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ పెనుమత్స శ్రీనివాస రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి, ఎస్ఎల్‌వీ సీఈవో నాని, ఎస్ఎల్‌వీ డైరెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- ప్రజావేదిక కార్యక్రమానికి ఆలస్యంగా వస్తే సహించేదిలేదు
- ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించి సమావేశానికి రండి
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపరిష్కార వేదికలో వచ్చిన ప్రజా సమస్యలను సకాలంలో జిల్లా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్ సమావేశపు హాలులో సోమ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో తమ సమస్యలను పరిష్కరిస్తారని జిల్లా నలుమూలల నుంచి ఉదయాన్నే వస్తారని తెలిపారు. మీకోసం కార్యక్రమం ప్రారంభమయ్యే సమయానికి జిల్లా అధికారులు హాజరు కాకపోతే ఎలా అని కలెక్టర్ ప్రశ్నించారు. ఆలస్యంగా వచ్చే అధికారులు మీకోసం హాలులోకి రానవసరం లేదని గ్రూప్‌లో మెసేజ్ పెట్టానని, అది చూడలేదా అని ఆలస్యంగా వచ్చిన అధికారులను నిలదీశారు. చేనేత దుస్తులను ప్రతి సోమవారం ధరించి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

వినతులు ఇలా..

ఇళ్ల నిర్మాణాలకు చెల్లించవలసిన బిల్లు బకాయిలను చెల్లించాలని బాపులపాడు మండలం రంగన్నగూడెం లబ్ధిదారులు కలెక్టరుకు అర్జీ సమర్పించారు. తన కుమారుని పాఠశాలలోకి వెళ్లనీయకుండా నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాల వారు బయట కూర్చోపెడుతున్నారని మలకాపట్నానికి చెందిన బుర్రా దుర్గానాగాం జనేయులు ఫిర్యాదు చేశారు. డ్రైవర్స్ కాలనీ స్థలాన్ని వ్యాపార సంస్థకు ఇచ్చారని, ఈ స్థలాన్ని సచివాలయానికి కేటాయించాలని టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్ అర్జీ సమర్పించారు. కృత్తివెన్ను మండలం కోమాళ్లపూడి పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామ నివాసి ఆముదాలపల్లి శ్రీను సమర్పించిన అర్జీలో హోమ్‌గార్డు మురళీపై ఫిర్యాదు చేశారు. తన సరిహద్దులో ఇష్టారాజ్యంగా మురళి ప్రవర్తిస్తున్నాడని, అదేమిటని అడిగితే దుర్భాషలాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాలీబాల్ జాతీయ పోటీలకు చల్లపల్లి విద్యార్థిని



కుంచె దివ్య

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్ జాతీయస్థాయి పోటీలకు చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరానికి చెందిన కుంచె దివ్య ఎంపికైంది. త్వరలో జరుగనున్న అండర్ - 14 జాతీయ వాలీబాల్ పోటీలకు రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టులోకి దివ్యను ఎంపికచేశారు. చల్లపల్లి రాజా హైస్కూల్‌లో దివ్య తొమ్మిదవ తరగతి చదువుతోంది. విజయనగరంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్ ద్వారా ప్రాబబుల్స్ జట్టులో స్థానం దక్కించుకుంది.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

-మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ



రోడ్డును ప్రారంభించి ముందుకు సాగుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

పెనమలూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో ఆదాయం కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఉందని, సరిగ్గా పన్నులు వసూలు చేస్తే వందకోట్లు సమకూరతాయని, దీనికి స్వచ్ఛందంగా భవన యజమానులు పన్నులు చెల్లించి సహకరించాలని మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ కోరారు. సోమవారం సిద్ధార్థ అకాడమీ పైవంతెన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉన్నా సీఎం చంద్రబాబు అనుభవంతో నిధులు సమకూర్చి అభివృద్ధి కార్యక్రమాలు దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో మునిసిపాలిటీల ఆస్తి, నీటి తదితర పన్నులను డైవర్ట్ చేసి 3,200 కోట్లను వాడేశారని దుయబట్టారు. చట్టప్రకారం లోకల్ బాడీలకు వచ్చే పన్నులను కౌన్సిల్ తీర్మానాల ద్వారా అక్కడే అభివృద్ధి పనులకు వాడుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరిక మేరకు పంట కాల్వ రోడ్డును గంగూరు వరకు మరో మూడున్నర కిలోమీటర్లు పొడిగించేందుకు వెంటనే సీఆర్‌డీఏకు ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడెప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ చేస్తున్న గురుస్వామి మురళీధర్ నంబూద్రి చిత్రంలో హరివిల్లు ఫౌండర్, చైర్మన్ లక్షణ్ చౌదరి దంపతులు

ఆటోనగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్ వేములపల్లి లక్షణ్ చౌదరి ఆధ్వర్యంలో పటమట హరివిల్లు కార్పొరేట్ ఆఫీసు వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గొల్లపూడి అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి మురళీధర్ నంబూద్రి చేతుల మీదుగా పడిపూజామహోత్సవం జరిగింది. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సంగీత స్వరనిధి నేషనల్ అవార్డు గ్రహీత రాజేష్ అయ్యప్పస్వామి మధుర గీతాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరి నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎం.ఎస్ రాజు పాల్గొని అయ్యప్పస్వామి పడిపూజను తిలకించారు. కృష్ణాజిల్లా నలుమూల నుంచి అయ్యప్ప దీక్షాదారులు పాల్గొని స్వామిని సేవించి తరించారు. ఈ కార్యక్రమాన్ని హరివిల్లు టీమ్ వేల్పుల రమేష్‌బాబు, మోదుకూరి గంగాధర్ తదితరులు పర్యవేక్షించారు.

ఐదేళ్ల నుంచి పదేళ్లకు..

ఆర్అండ్‌బీలోబిడ్ అర్హతా కాలపరిమితి పెంపు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల బిడ్ అర్హతా కాలపరిమితి (బ్లాక్ పీరియడ్)ని పెంచుతామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. ప్రస్తుతం కాంట్రాక్టర్ల బిడ్ అర్హతా కాలపరిమితి ఐదేళ్లుగా ఉంది. దీన్ని పదేళ్లకు పెంచాలని ఇటీవల రహదారి నిర్మాణ పనులు చేసే కాంట్రాక్టర్లు ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. తాజాగా బిడ్ అర్హతా కాలపరిమితిని ఐదు నుంచి పది సంవత్సరాలకు పెంచుతూ రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు (జీఓ-342) జారీ చేశారు. ఈ ఉత్తర్వులు మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి.

ఏపీ రెరా కార్యవర్గం భర్తీకి సెర్చ్ కమిటీ

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీకి నూతన చైర్‌పర్సన్, సభ్యుల పోస్టుల భర్తీకి తగిన పేర్లు (ప్యానెల్) సూచించడానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, పరిశ్రమలు, వాణి జ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల కార్యదర్శి ఎన్.యువరాజ్‌లను సభ్యులుగా నియమించారు.

కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లిన లారీ

ప్రాణభయంతో దూకేసిన డ్రైవర్

ప్రమాదవశాత్తు లారీ చక్రాల కింద పడి దుర్మరణం

ఘంటసాల, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కేఈబీ కెనాల్‌లోకి లారీ దూసుకెళ్లి డ్రైవర్ మృతి చెందిన ఘటన ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ రెవెన్యూ పరిధిలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం వైపు నుంచి అవనిగడ్డ వైపునకు వెళ్తున్న లారీ పాపవినాశనం సమీపంలోకి రాగానే ఒక్కసారి అదుపు తప్పి కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. భయపడిన డ్రైవర్ గొరుముచ్చు దివాకర్ (54) లారీలో నుంచి బయటకు దూకే శాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదే లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఘంట సాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

స్టేట్ అండర్-17 బాలికల హ్యాండ్‌బాల్ విజేతగా కృష్ణా



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న హెచ్ఎం ఎస్తేరు రాణి

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమట బాలురు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మూడు రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగుతున్న ఏపీ స్టేట్ అండర్-17 హ్యాండ్‌బాల్ బాలికల చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా విజేతగా అవతరించింది. రన్నరప్‌గా శ్రీకాకుళం నిలవగా, విజయనగరం తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ బహూకరించారు. పాఠశాల హెచ్ఎం ఎస్తేరురాణి, లయన్స్ క్లబ్ జ్యూరి మిరియాల వెంకటేశ్వరరావు, స్టాప్ సెక్రటరీ షేక్ లాల్ మధు, సీనియర్ ఉపాధ్యాయులు శారద, గోపాలకృష్ణ, అండర్-17 స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.దుర్గారావు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కార్పొరేషన్ల చైర్మన్లు



వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో సోమవారం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఇంకా పలు కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాద పూర్వకంగా కలిశారు. తమను కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు కృతజ్ఞతలు తెలిపిన పట్టాభిరామ్‌తో చంద్రబాబు మాట్లాడుతూ బాగా పని చేయాలని, తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీఎం కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టింగ్

విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టింగ్ లు పెట్టిన వ్యక్తిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెం దిన పర్వత సుధాకర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెడుతు న్నాడు. దీనిపై పటమటకు చెందిన షేక్ నజీర్ అనే టీడీపీ కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సోమవారం కేసు నమోదు చేశారు.

చంపి పొలం కాజేయడానికి కుట్ర!

- అప్పు తీర్చమంటే కాళ్లు నరుకుతామంటున్నారు
- టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు

అమరావతి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ నేతలు చేసిన దౌర్జన్యాలపై వైసీపీ బాధితులు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి జవహర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గుంటూరు జిల్లా రాయపూడికి చెందిన కొండలరావు అర్జీ ఇస్తూ, తనకు రావాల్సిన డబ్బులను అడిగితే.. తన కాళ్లు నరికి, చంపిస్తానని వైసీపీ నాయకుడు ఆలోకం సురేష్ బెదిరిస్తున్నారని వాపోయారు. పల్నాడు జిల్లా రాయవరానికి చెందిన లక్ష్మీనరసమ్మ అర్జీ ఇస్తూ, తనను చంపి, తన పొలం కాజేసేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని వాపోయారు. గండికోట రిజర్వాయర్ ప్రాంతంలోని తన భూమికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద చెక్కులు ఇప్పిస్తానని సింహాద్రిపురం తహసీల్దార్ ఆఫీస్‌లో పని చేసే గంగరాజు రూ.7.50లక్షలు తీసుకుని, మోసం చేశారని కడప జిల్లా రామచంద్రాపురానికి చెందిన లింగమయ్య, రామాంజనమ్మ ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన శ్రీహరి అనే వ్యక్తి తమ పొలం కౌలుకు తీసుకుని, గడువు తీరినా తిరిగి అప్పగించకుండా ఇబ్బందిపెడుతున్నారని ఏలూరు జిల్లా కొత్తగూడేనికి చెందిన మాధవరావు, ప్రసాద్ వాపోయారు.

డిజిటల్ అరెస్ట్.. బీ అలెర్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒకప్పుడు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) నేరాలు ప్రజలను నట్టేట ముంచాయి. వాటిపై పూర్తి అవగాహన వచ్చాక ఇప్పుడు సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులతో ముంచడానికి సిద్ధమయ్యారు. వేర్వేరు నెంబర్లతో ఫోన్లు చేస్తూ డిజిటల్ అరెస్టుల పదాలను ఉపయోగిస్తున్నారు. కేసులు, నోటీసుల గురించి చెప్పి భయపెడుతున్నారు. ట్రాప్‌లో పడిన వారి నుంచి లక్షల రూపాయలు లాగేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఉత్తరాది రాష్ట్రాల నుంచి జరుగుతున్నాయి. మరికొంతమంది విదేశాల నుంచి ఈ నేరాలను నడిపిస్తున్నారు.

నగరంలో బాధితులు 82 మంది

సైబర్ నేరాల్లో ప్రస్తుతం ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టులు టాప్‌లో ఉంటున్నాయి. సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌కు వస్తున్న బాధితుల్లో ఎక్కువ మంది ఈ రెండింటిలో బాధితులుగా ఉంటున్నారు. డిజిటల్ అరెస్టులకు సంబంధించి ఈ ఏడాది నుంచే కేసులు పెరుగుతున్నాయి. పోలీసులు ఇప్పటి వరకు ఐదు కేసులు నమోదు చేశారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాల పేరుతో జరిగిన మోసాల్లో 82 మంది రూ.లక్షలు కోల్పోయారు. దక్షిణాది వాసులను టార్గెట్ చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా యువకులు, మధ్యవయస్కులను లక్ష్యంగా చేసుకుని ఫోన్లు చేస్తున్నారు. టార్గెట్ నెరవేరే వరకు వీడియో కాల్స్ చేస్తూ, వాట్సాప్‌ల్లో నోటీసులు పంపుతూ వేధిస్తున్నారు. వ్యక్తులు ట్రాప్‌లో పడగానే ఆ నెంబర్లను స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఇలా వస్తున్న కాల్స్, నోటీసులు నిజమేనని భయపడుతున్నారు.

ఈ అవగాహన ఉంటే..

- పోలీసులు గానీ, దర్యాప్తు సంస్థలు గానీ చేసే అరెస్టులకు ఆయా సంస్థల నుంచి సిబ్బంది నేరుగా వస్తారు.
- ఒకవేళ కేసు నమోదైతే విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇస్తారు.
- అరెస్టు చేయాలనుకున్న అధికారులు వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరు.
- నోటీసులను వాట్సాప్‌ల్లో పంపరు. సిబ్బంది స్వయంగా ఇచ్చి అందజేస్తారు.
- కేసు నమోదైన తర్వాత దాన్ని తొలగించాలంటే ఆ నేరంలో మన ప్రమేయం లేదని పోలీసులు నిర్ధారించాలి. అటువంటప్పుడే కేసులు తొలగించే అవకాశం ఉంటుంది.

డిజిటల్ అరెస్టుకు చట్టం లేదు

చట్టంలో గానీ, రాజ్యాంగంలో గానీ ఎక్కడా డిజిటల్ అరెస్టు అన్నమాటకు స్థానం లేదు. ఎవరైనా ఏదైనా కేసులో తప్పు చేసినట్టు నిర్ధారణ అయితే పోలీసులు స్వయంగా వెళ్లి అరెస్టు చేస్తారు. తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. ఇది చట్టప్రకారం జరిగే ప్రక్రియ. డిజిటల్ అరెస్టు అన్నది సైబర్ నేరగాళ్లు సృష్టించుకున్న పదం. సైబర్ నేరగాళ్లు వేస్తున్న ఎత్తుల్లో ఇదొకటి. ఎక్కడెక్కడి నుంచో వీడియో కాల్స్, వాటాప్స్ కాల్స్ చేసి ప్రజలను డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెడుతున్నారు. దీనికి ప్రజలు ఏమాత్రం బెదరాల్సిన అవసరం లేదు. ఎవరైనా ఫోన్లు చేసి కేసులు నమోదయ్యాయని, మాఫీ చేస్తామని చెప్తే అది కచ్చితంగా సైబర్ నేరమే. ఇలాంటి కాల్స్ వచ్చిన వెంటనే ప్రజలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాలి.

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

జాతీయ రహదారిపై కారు దగ్ధం



రాణిగారితోట, నవంబరు11 (ఆంధ్ర జ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారిపై వారధి వద్ద ఒక కారు అగ్నికి ఆహుతి అయ్యింది. కుంచనపల్లికి చెందిన విజయ శేఖరబాబు అనే వ్యక్తి బంధువులను పెజ్జోనిపేటలో దించేందుకు రినాల్ట్ లాడ్జి కారులో రాత్రి 11 గంటలకు బయలుదేరాడు. కారు వారధి దాటిన తరువాత కృష్ణలంక జాతీయ రహదారి సర్కిల్ లోని పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు రాగానే కారు నుంచి వాసన రావటంతో పాటు కారు ఒక్కసారిగా ఆగిపోయింది. వెంటనే కారు నుంచి మంటలు చెలరేగటంతో కారులో ఉన్న నలుగురు దిగి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది.

జిమ్నాస్టిక్స్‌లో కీర్తనకు బంగారు పతకాలు



విజయవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.కీర్తన(జూనియర్ ఇంటర్) కాకినాడలో ఈనెల 7 నుంచి 9 వరకు జరిగిన 68వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మూడు బంగారు మెడల్స్ సాధించింది. వచ్చే నెలలో కోల్‌కత్తాలో జరిగే నేషనల్స్‌కి సెలక్ట్ అయ్యింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, కళాశాల అధ్యాపకులు కీర్తనను అభినందించారు.

పచ్చదనానికి తూట్లు

- డంపింగ్ యార్డులా పోలీసుల ఔట్‌పోస్టు
- సీజ్ చేసిన వాహనాలు డంప్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- పట్టించుకోని జాతీయ రహదారుల విభాగం, పోలీసు ఉన్నతాధికారులు

(గుణదల, ఆంధ్రజ్యోతి)

పచ్చదనానికి ట్రాఫిక్ పోలీసులు తూట్లు పొడుస్తున్నా...పట్టించుకునే వారు లేరు. జాతీయ రహదారికి మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల విభాగం వారు రామవరప్పాడు వద్ద ఏర్పాటు చేసిన ఖాళీ స్థలాన్ని పోలీసులు డంపింగ్ యార్డ్‌లా వాడేస్తున్నారు. నాల్గవ ట్రాఫిక్ పోలీసులు కార్యకలాపాలు కొనసాగించేందుకు రామవరప్పాడు వద్ద గత ఏడాది ట్రాఫిక్ ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు.

రామవరప్పాడు రింగ్ రోడ్డు, మహానాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో సీజ్ చేసిన ఆటోలు, ద్విచక్ర వాహనాలను తీసుకొచ్చి జాతీయ రహదారికి మధ్యలో ఏర్పాటు చేసుకున్న ఔట్‌పోస్టు వద్ద డంపింగ్ చేయడం ప్రారంభించారు. దీంతో గన్నవరం ఎయిర్ పోర్టు మొదలు కొని రామవరప్పాడు రింగ్ వరకు జాతీయ రహదారికి మధ్యలో గ్రీనరీ దర్శన మిస్తుంది. మధ్యలో రామవరప్పాడు పంచాయతీ పరిధిలో మాత్రం వాహనాల డంపింగ్ యార్డ్ దర్శనమిస్తుంది. ముఖ్యమంత్రి మొదలుకొని ఉప ముఖ్యమంత్రి వీఐపీలు, వీవీఐపీలు ఎయిర్ పోర్టుకు ఇటుగానే ప్రయాణాలు సాగిస్తుంటారు. అటువంటిది జాతీయ రహదారుల విభాగం వారు లేదా పోలీసు ఉన్నత అధికారులు గాని ఇలా రోడ్డుకు మధ్యలో గ్రీనరీ లేకుండా వాహనాల డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏమిటి అని ప్రశ్నించక పోవడం ఆశ్చర్యంగా ఉంది.



రామవరప్పాడు వద్ద గ్రీనరీ కోసం వదిలిన ప్రదేశంలో డంప్ చేసిన వాహనాలు

నాల్గవ ట్రాఫిక్ పోలీసులు పత్రాలు లేని వాహనాలు, కాలం చెల్లిన వాహనాలు, జరిమానాలు చెల్లించని వాహనాలు సీజ్ చేసి సదరు వాహనాలను జాతీయ రహదారికి పక్కనే ఉన్న రైవస్ కాల్వ ఒడ్డున డంప్ చేసుకుంటే ఎవరికీ అభ్యంతరమే ఉండదు. దాని వల్ల పచ్చదనానికి తూట్లు పొడిచే పని ఉండదు. ఇన్నర్ రింగ్‌రోడ్డు దిగువ నుంచి రామవరప్పాడు వంతెన సెంటర్ వరకు జాతీయ రహదారికి పక్కనే ఉన్న రైవస్ కాల్వ ఒడ్డున ఖాళీగా ఉన్న ప్రదేశంలో వాహనాలను డంప్ చేసుకు నేందుకు స్థలం ఉంది. పోలీసు ఉన్నత అధికారులు ఈ విషయమై దృష్టి పెట్టి జాతీయ రహదారికి మధ్యలో వాహనాల డంప్‌ను తొలగించాలని నగర వాసులు కోరుతున్నారు.

మహిళలకు విద్య ఎంతో అవసరం

డాక్టర్ సిస్టర్ క్యాండీ కున్నా

లబ్బీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళలకు విద్య ఎంతో అవసరమని డాక్టర్ సిస్టర్ క్యాండీ కున్నా అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యతో ఉద్యోగావకాశాలు, వ్యాపారంగంతో పాటు సమాజంలో అన్ని రంగాల్లో రాణించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శశి. పి.రత్నశ్రీ, వై.శ్రీ సింధు, ఎన్.హిందోళ పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణలంక, సూర్యారావుపేట, సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ల పరిధిలో బైక్‌ల చోరీకి పాల్పడుతున్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రాయలకు చెందిన నంద్యాల రామకృష్ణ రాజు (50)ను సోమవారం కృష్ణలంక పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 10 లక్షలు విలువ గల 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. బైక్‌ల చోరీ వివరాలను సౌత్ ఏసీపీ యా బంగార్రాజు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చెడు వ్యసనాలకు లోనైన నంద్యాలరాజు తన వద్ద ఉన్న మూడు బైక్‌లను తాకట్టు పెట్టి జల్సాలు చేశాడు. ఈ ఏడాది మార్చిలో విజయవాడ వచ్చిన అతను బస్టాండ్ వద్ద పార్క్ చేసి ఉన్న బైక్‌ను డూప్లికేట్ తాళంతో తెరిచి దొంగిలించాడు. సత్యనారాయణపురం, కృష్ణలంక, సూర్యారావుపేట పరిధిలో 20 బైక్‌లను దొంగతనం చేసి వారధి సమీపంలో పాడుబడిన భవనంలో ఉంచాడు. ఆదివారం సిటీ బస్టాండ్ వద్ద ఒక బైక్‌ను అపహరించి తీసుకువెళుతున్న క్రమంలో కృష్ణలంక క్రైం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడిని పట్టుకున్నారు. అతనిని విచారించగా చోరీ బయటపడింది. కృష్ణలంక ఎస్‌ఐ సూర్యనారాయణ, క్రైం హెడ్ కానిస్టేబుళ్లు జి.సాంబయ్య, జీ.ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్ కే బాబూరావులను సీపీ, పోలీసు అధికారులు అభినందించారు.



యూబీఐ సిబ్బంది రక్తదానం

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ వన్‌టౌన్‌లోని జోనల్ కార్యాలయంలో సిబ్బంది సోమవారం రక్తదానం చేశారు. మొత్తం 50 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. మణిపాల్ ఆసుపత్రి వైద్యులు ఇక్కడ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ శ్రీధర్, డిప్యూటీ జోనల్ హెడ్ ఎం.సీతారామారావు, ఏజీఎంలు మూర్తి, హరీష్‌బేతా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఆనందం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ● ఎన్‌ఎస్‌ఎం స్కూల్‌లో ముగిసిన క్రీడలు



విజేతలతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అతిథులు

పటమట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని, క్రీడలతో ఆరోగ్యమే కాకుండా మానసిక ఆనందం సొంతం అవుతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎం స్కూల్‌లో మూడు రోజుల నుంచి జరుగుతున్న 35వ మౌంట్ ఫోర్టు క్రీడా సంబరాలు సోమవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథి గద్దె మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనవిధానంలో క్రీడల అభ్యసన చాలా అవసరమని, ఎన్‌ఎస్‌ఎం పాఠశాల విద్యార్థులు అభిరుచికి అనువైన క్రీడల్లో తగిన శిక్షణ ఇవ్వడంలో ముందంజలో ఉంటుందన్నారు. పాఠ శాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు మాకెంతో ఆనందాన్ని చ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మోస్ట్ రెవరెండ్ జోసెఫ్ రాజారావు తెలగతోటి, బ్రదర్ షైన్ అలెక్స్, బ్రదర్ కూటీ చాకో, వివిధ పాఠశాలలహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవ్ గర్ల్‌చైల్డ్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, డీఎంహెచ్‌వో తదితరులు

కృష్ణలంక, నవం బరు 11 (ఆంధ్ర జ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా బహుమతులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం, పీసీపీ ఎన్‌డీటీ చట్టం అమలులో భాగంగా సేవ్‌గర్ల్ చైల్డ్‌పై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా వాటిలో విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో నిధి మీనా అధికారులతో కలిసి ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేసి అభినందించారు. అదేవిధంగా కార్యక్రమం అనంతరం సీడీ-ఎన్సీడీ, కేన్సర్ స్ర్కీనింగ్ సర్వే 3.0లో భాగంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎల్‌టీవో డాక్టర్ ఉషారాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, ఎన్‌సీడీ-సీడీ పీవో డాక్టర్ మాధవి నాయుడు, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్‌తో పాటు వైద్య ఆరోగ్యం, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో కార్తీక దీపోత్సవం



లబ్బీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో కార్తీక సోమవారం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు శివలింగాకారంలో దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధవి, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ, వి.సంధ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **భారతీనగర్:** గురునానక్ కాలనీ శివాలయంలో సోమవారం భక్తులు వేకువ జామునే వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.



విజయవాడ కల్చరల్: యనమలకుదురులోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రాభిషేకాలు జరిగాయి. స్వామికి కల్యాణం జరిగింది. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ జరిగింది. సాయంత్రం ఆకాశదీపం, పంచహారతులు, స్వామి పల్లకీసేవ, భక్తుల దీపారాధనలు, భజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ముఖ్య అర్చకుడు జీఆర్‌వీ సాగర్, దేవస్థానం అర్చకులు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగానర్సింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.భవానీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సత్కార వేడుకలు

మొగల్రాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఉపాధ్యాయ సత్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో మదర్‌థెరెస్సా హైస్కూల్ (సీతారాంపురం) అధినేత కాకర్ల హరిప్రసాద్, నవభారత్ హైస్కూల్ (గన్నవరం) అధినేత షేక్ ఇమామ్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల వైపు కూడా విద్యార్థులను ప్రోత్సహించాలని పాఠశాలల యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథులుగా మాజీ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్, గోన సాంబశివరావు, ప్రత్యేక అతిథులుగా అనుమోలు తిరుమల గాంధీ, అవుతు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యదర్శి చోంగల హరనాథ్ తన కార్యదర్శి నివేదిక చదివి వినిపించారు. పలు విద్యా సంస్థల అధినేతలు, విద్యార్థులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి సీఎం సహాయ నిధి పత్రం అందజేత

పటమట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు అవడంతో ప్రజలు ఆనందపడుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధిలో రాణిగారి తోటకు చెందిన ఆరేపల్లి వెంకట సోమేశ్వరరావు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల మంజూరు పత్రాన్ని బాధితుడిగా గద్దె అందించి మాట్లాడారు.

పెన్సిల్ బాక్స్ పంపిణీ

లబ్బీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్, అమరావతి రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 250 మంది విద్యార్థులకు పీవీపీ మాల్‌లోని సినీ పోలీస్ థియేటర్లో సోమవారం వేర్ ఇన్ చోటా భీమ్ సినిమాను ప్రదర్శించారు. విశ్రాంతి సమయంలో విద్యార్థులకు ఆహార పదార్థాలు అందజేయడంతో పాటు పెన్సిల్ బాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా ఛైర్మన్ అశ్విన్, వైస్ ఛైర్మన్ కౌశిక్, సినీ పోలీస్ మేనేజర్ మురళి కృష్ణ, అమరావతి రౌండ్ టేబుల్ ఛైర్‌పర్సన్ సమీక్ష, వెంకట్, కాట్రగడ్డ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అర్జీలు పరిష్కరించాలి

కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ డాక్టర్ డీ.చంద్రశేఖర్, చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ సృజన, చీఫ్ మెడికల్‌ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, పీవో యూసీడీ ఇన్‌చార్జి డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రసంగిస్తున్న వినీల పాలడుగు

లబ్బీపేట, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఎవరి మీద ఆధారపడకుండా తమ కాళ్లపై నిలబడాలని ఎనర్జీ ఇండస్ట్రీస్ క్రెడిట్ మేనేజర్, టీడీపీ సెక్రటరీ మెల్‌బోన్ ఆస్ట్రేలియా వినీల పాలడుగు అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో పెవింగ్ ది వే టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న ఆగడాలకు వ్యతిరేకంగా కలిసి పోరాటం చేయాలని, ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనా తాను అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధవి, ఎస్.సుధారాణి పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ మేకా రమేష్, వెంకటేశ్వర్లు

మొగల్రాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత, తెలుగు సాహితీవేత్త, పీబీ సిద్ధార్థ కళాశాల మాజీ ప్రధానోపాధ్యాయులు స్వర్గీయ నాగళ్ల గురుప్రసాద్‌రావు స్మారక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం సోమవారం పీబీ సిద్ధార కళాశాలలో జరిగింది. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహించారు. అమెరికాకు చెందిన డాక్టర్ ప్రేమ్‌సాగర్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.7.50లక్షలను 50 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ శిష్యుడు బండ్ల మాధవరావు మాట్లాడుతూ గురుప్రసాద్‌రావు తన యావదాస్తిని తన శిష్యుడు, ప్రైమ్ హెల్త్ కేర్ వ్యవస్థాపకుడు అమెరికాలో స్థిరపడిన ప్రేమ్‌సాగర్ రెడ్డి ఫౌండేషన్‌కు చెందేలా వీలునామా రాసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నలందలో సీబీఎస్ఈ రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్



గవర్నర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో సోమవారం సీబీఎస్ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను పార్మడ్ సైంటిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ స్థాయిలో సైన్స్ స్ఫూర్తిని చాటడం, స్థిరమైన భవిష్యత్తు కోసం సైన్స్‌ను వ్యాప్తి చేయడం, శాస్త్ర సాంకేతిక రంగానికి యువతరాల కృషిని వివరించారు. విజ్ఞాన దాయకమైన కార్యక్రమాలు నిర్వహించడంలో నలంద యాజమాన్యం కృషిని అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, కమ్యూనికేషన్, ట్రాన్స్‌పోర్టు, సహాయ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే అంశాలపై 70 సైన్స్ ప్రాజెక్టుల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఎగ్జిబిషన్‌కు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎం. అరవిందన్, డాక్టర్ వి.జగదీష్, డాక్టర్ జి.సుష్మా, డాక్టర్ జి. శకుంతల, బి. మహిత, జి. సురేష్‌లు వ్యవహరించారు.

దుర్గగుడిలో అన్న వితరణకు విరాళాలు

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో అన్నవితరణ కార్యక్రమానికి భక్తులు సోమవారం విరాళాలు అందచేశారు. మధురానగర్‌కు చెందిన సికినం లోచిత రూ. 1,00,116, గన్నవరం సమీపంలోని గొల్లనపల్లికి చెందిన బొబ్బగాంధీ రూ. 1,01,116 విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ అధికారులకు అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం అందచేశారు.


సహస్రలింగార్చన..

సహస్రలింగార్చన సోమవారం వైభవంగా జరిగింది భక్తులు మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సహస్రలింగాలకు అర్చన, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు .

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 565	







బడ్జెట్.. భేష్

అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకునే.. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పటమట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమవారం అసెంబ్లీలో ప్రవేశపట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ అని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సుదీర్ఘ కసరత్తు చేసి పేద, బడుగు బలహీన వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్ ఉందని, బుడమేరు శాశ్వత ప్రక్షాళనకు రూ.330కోట్లు ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయమన్నారు. ఐదేళ్లుగా జరిగిన విధ్వంసానికి ఈ బడ్జెట్ చెంపపెట్టులాటిందన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్: ఎమ్మెల్యే వసంత



జి.కొండూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో మహా కూటమి ప్రభుత్వం జనరంజకంగా బడ్జెట్ ప్రవేశ పెట్టిందని బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలుకు కృషి చేస్తుందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే ఏపీ సమగ్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మేళవింపుగా బడ్జెట్: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం మేళవింపుగా కూటమి ప్రభుత్వ బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. సోమవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్పందించిన సౌమ్య చరిత్రాత్మక బడ్జెట్‌గా అభివర్ణించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేర సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వం నిబద్ధత చాటుకుందన్నారు. మౌలిక వసతుల కల్పన, పారిశ్రామికీకరణ వంటి రంగాలకు పెద్దపీట వేసినట్టు చెప్పారు. వ్యవసాయ రంగం పట్ల పూర్తి చిత్తశుద్ధితో ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గతంలో ఏప్రభుత్వం చేయని కేటాయింపులు చేసినట్లు ఆమె తెలిపారు. కూటమి బడ్జెట్ దేశానికి ఆదర్శమన్నారు. ఇంతటి అద్భుత బడ్జెట్‌ను అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పేదలను సంపన్నులుగా మార్చే బడ్జెట్: ఎమ్మెల్యే కుమార్‌రాజా



పామర్రు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదవర్గాల ప్రజల్ని సంపన్నుల మార్చేవిధంగా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం బడ్జెట్‌పై తన అభిప్రాయాన్ని వివరించారు. ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రైతు సంక్షేమం, రాష్ట్ర ప్రగతి, పునఃప్రారంభం, పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ తొలిమెట్టు కాబోతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల కలలు సాకారమయ్యేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ రుజువు చేసిందన్నారు.



కూటమి ప్రభుత్వ జనరంజక బడ్జెట్

కొనకళ్ల నారాయణరావు, ఆర్టీసీ చైర్మన్

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. కూటమి ప్రభుత్వం జనరంజకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది. ఒక పక్క ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటూనే రాష్ట్ర సమగ్రాభివృద్ధితో పాటు పేదల సంక్షేమ, అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఉన్న త విద్యకు రూ.2326, పట్టణాభివృద్ధికి రూ.11490, గృహ నిర్మాణాలకు రూ.4012, జలవనరుల శాఖకు రూ.16705, పరిశ్రమలు, వాణిజ్య రంగానికి రూ.3125 కోట్లు కేటాయించడం ముదావహం.

క్రీడల పట్ల బడ్జెట్‌లో చిత్తశుద్ధి చాటారు



అనిమిని రవినాయుడు, శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంపై సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధి బడ్జెట్‌లో వెల్లడైంది. అసెంబ్లీ సమావేశంలో క్రీడా రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్‌లో ప్రవేశపెట్టడమే నిదర్శనని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ కల్పనలో స్పోర్ట్సు కోటా రిజర్వేషన్ శాతం 2 నుంచి 3 శాతానికి పెంచడం, క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తూ రూ.100 కోట్ల ప్రకటించడం ఆనందదాయకం. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి శాప్ నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు.

తల్లికి వందనానికి రూ.2491 కోట్ల కేటాయిపు ముదావహం



మహమ్మద్ సద్‌రుద్దీన్ ఖురేషి, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కింద పేద విద్యార్థులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2491 కోట్లు కేటాయించడం ముదావహం. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారు. అయితే ముస్లిం మైనారిటీలకు గత ప్రభుత్వం ఇచ్చినదానికంటే తక్కువగా రూ.4376 కోట్లు కేటాయించడం దురదృష్టకరం.

రైతులకు బడ్జెట్‌లో సరిపడా నిధులు అభినందనీయం

గోపు సత్యనారాయణ, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు



రైతుల సంక్షేమానికి బడ్జెట్‌లో ఆశించిన విధంగా ప్రభుత్వం కేటాయించడం అభినందనీయం. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుంది. రైతుల కోసం విత్తనాల రాయితీకి రూ.240, భూసార పరీక్షలకు రూ.39, విత్తనాల పంపిణీకి రూ.240, ఎరువుల సరఫరాకు రూ.40, పొలం పిలుస్తోందికి రూ.1131, ప్రకృతి వ్యవసాయానికి రూ.423 కోట్లు కేటాయించారు.




లైట్ మెట్రోకు ముందడుగు

లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు అడుగులు పడేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో తొక్కి పట్టిన లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు కేటాయించింది. బడ్జెట్ అంటూ కేటాయించటంతో మెట్రో ప్రాజెక్టుకు కదలిక వచ్చినట్టు భావించాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయింపుల వల్ల ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే దశలోనే ఉందన్నది అర్థమౌతోంది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో లైట్ మెట్రోకు ఐదేళ్లూ ఒక్క పైసా కేటాయించలేదు. దీంతో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు మరుగన పడిపోయింది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వంలో చేతికి వచ్చిన తుది డీపీఆర్‌ను ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వం తొక్కి పట్టింది. రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదించాల్సిన లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టును ఆమోదించలేదు. క్యాబినెట్ ఆమోదం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి కూడా ఐదేళ్లూ పంపించలేదు. దీంతో అమరావతి తరహాలోనే విజయవాడకు కూడా వైసీపీ ప్రభుత్వం మొండిచెయి చూపింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం చర్యలు చేపట్టింది. గతంలో మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న రామకృష్ణారెడ్డికి మళ్లీ దీని బాధ్యతలను అప్పగించింది. ఆయన వచ్చీ రాగానే ఎక్కడికక్కడ ఆగిపోయిన ప్రక్రియలన్నింటినీ తిరిగి ప్రారంభించారు. తుది డీపీఆర్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అత్యున్నత నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ దశలో లైట్ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు జరపటంతో విజయవాడకు అత్యంత ప్రతిష్ఠాత్మక అడుగులు పడినట్టు అయింది. విజయవాడ లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి తొలి దశలో మొదటి కారిడార్ గన్నవరం నుంచి ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేసి ఎన్‌హెచ్ - 16 మీదుగా రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, తిరిగి పీఎన్‌బీఎస్‌కు చేరుకుంటుంది. 2వ కారిడార్ పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఉంటుంది. రెండో దశలో పీఎన్‌బీఎస్ నుంచి అమరావతికి పొడిగిస్తారు. లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు సర్దుబాటు అనేది కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం చొప్పున భరించగలిగితే మిగిలిన 60 శాతం అప్పుతీసుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు నూరు శాతం కేంద్ర ప్రభుత్వం సహాయం చేయటానికి అవకాశం ఉంది. లేకుంటే పీపీపీ పద్ధతిలో అయినా ప్రాజెక్టును అభివృద్ధి చేయటానికి అవకాశాలున్నాయి.



రెండు దశల్లో నిర్మించనున్న లైట్ మెట్రో రూట్ మ్యాప్

ఆశాలకు ఒంటరి మహిళ, వితంతు

పెన్షన్లు పునరుద్ధరించండి

జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు నిలిపేసిన వితంతు, ఒంటరి మహిళా పెన్షన్లు పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధా న కార్యదర్శి ఎ.కమల, ఉపాధ్యక్షురాలు టి.హవేలీకుమారి.. డీఆర్వో లక్ష్మీ నరసింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు, గర్భిణీ/బాలింతలకు, పసిపిల్లలకు, నిరంతరం ఆరోగ్య పరమైన సేవలందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆశా వర్కర్లందరూ దళిత బలహీన వర్గాల కు చెందిన పేద మహిళలని ప్రభుత్వం వీరికి చెల్లించేది, కనీస వేతనం కాదని, గౌరవ వేతనం మాత్రమేనని ఆరోపించారు. పైగా వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్, వంటి సౌకర్యాలేవీ వ ర్తించడం లేదని, చివరికి చనిపోతే మ ట్టిఖర్చులు కూడా లేని దయనీయ పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారన్నా రు. పెరుగుతున్న ధరలతో వచ్చే గౌర వ వేతనం చాలక, ఆర్థికంగా అనేక ఇ బ్బందులు పడుతున్నారన్నారు. కానీ ఇ ప్పటివరకు ఇస్తున్న ఒంటరి మహిళ వితంతు పెన్షన్లను, ప్రభుత్వ ఉద్యోగు లనే పేరుతో ఆశ వర్కర్లకు ఆపివేయడం దుర్మార్గమన్నారు. ఆశా వర్కర్లు ఎ దుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈనె ల 18న విజయవాడ సెంటర్ వద్ద జరి గే ధర్నాలో ఆశా వర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కమల

విలీన అధ్యాపకులకు తీవ్ర అన్యాయం

● డాక్టర్ కొల్లేటి రమేష్

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుల ఎన్నికల్లో ఈ ఏడాది కూడా ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోని విలీనమైన డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అన్యాయం జరిగిందని విలీన కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కొల్లేటి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల బోధన, కళాశాలల న్యాక్ గుర్తింపులో కళాశాలల అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులైన విలీన సిబ్బంది ద్వారా ప్రయోజనాలన్నీ పొంది ఉత్తమ అధ్యాపకుల అవార్డులకు విలీన అధ్యాపకులను పరిగణించకపోవడం పట్ల అధికారులకు మాపై ఉన్న వివక్ష తేటతెల్లమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గీతాభిషేకం పుస్తకావిష్కరణ



గీతాభిషేకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో రామారావు తదితరులు



దీపాలను వెలిగిస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయిని శ్రీమహాకాళేశ్వరుడి అలంకారాలను వర్ణిస్తూ ప్రతిరోజూ శివుడిపై ఒక పాట చొప్పున పచ్చిపులు సు సూర్యనారాయణ 1575 రోజులుగా రాస్తున్నారు. వీటిలో 108 పాటలను కార్తీక మాసం సందర్భంగా ఆవిష్కరించి భక్తులకు ఉచితంగా పంచేందుకు నిర్ణయించారు. ఇందుకు దుర్గగుడి ఈవో రామారావు సహకరించారు, పుస్తకాన్ని కళావే దికపై సోమవారం ఆవిష్కరించారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి కార్యక్రమాన్ని నిర్వహించారు. రచయితను ఈవో రామారావు సత్కరించారు. అమ్మవారి ప్రసాదం అందజేశారు. కాగా సహస్రలింగార్చన, సహస్రదీపాలంకరణ, ఊంజల్ సేవలో ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. కళావేదికపై విజయవాడ కొత్తపేటకు చెందిన కూచిపూడి నృత్యాలయ బృందం కూచిపూడి నాట్యం చేసి ఆహూతులను అలరించారు.



దుర్గమ్మ సన్నిధిలో అఘోరీ

తెలంగాణలో వివాదాస్పదంగా మారిన అఘోరీ నాగసాధు ఇటీవల రాష్ట్రంలోని అనేక శైవాలయాలను దర్శించుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు సోమవారం దుర్గగుడికి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసింది. ఆమె వచ్చి వెళ్లే వరకు సిబ్బంది వెంటే ఉన్నారు.

బడ్జెట్‌పై వామపక్షాల పెదవి విరుపులు

గవర్నర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వామపక్షాలు, వామపక్ష అనుబంధ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘా లు పెదవి విరిచాయి. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు బడ్జెట్‌పై మా ట్లాడుతూ రూ.2.94 లక్షల కోట్లతో ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక రంగాలకు తగిన కేటాయింపులు జరగలేదన్నారు. ఇరిగేషన్ రంగానికి రూ.16,705 కోట్లు కేటాయించడం, ప్రాజెక్టుల నిర్మాణాలకు సరిపోవని, రాజధాని అంతర్జాతీయ సంస్థలు ఇస్తామన్న రూ. 15వేల కోట్లు గ్రాంట్‌గానా, లేక రుణమా తేల్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.22 వేల కోట్లు బకాయిల ప్రస్తావన లేదని, 12వ పీ ఆర్‌సీ గురించి పేర్కొనలేదన్నారు.

విద్యారంగానికి తగ్గిన కేటాయింపులు: యూటీఎఫ్

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు 9.8 శాతం మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని, గత బడ్జెట్‌తో పోల్చితే చాలా తక్కువన్నారు. ఈ నిధులు ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి ఉపయోగపడవని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు ఆసక్తిని పెంచేలా చర్య లు తీసుకోవాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాల న్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులు, 12వ పీఆర్ సీ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరనిందతో నిండిపోయింది: సీపీఎం

ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయిందని, రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాలు గురించి ప్రస్తావనే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తోందో కనీస ప్రస్తావన చేయకపోవడం ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి బడ్జెట్‌లో చార్జీల తగ్గింపు గురించి ప్రస్తావనే చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివాసీలు, దళితులకు, మహిళలకు, మైనారిటీ సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. బడ్జెట్ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిందన్నారు.




బాలుర అండర్-19 వాలీబాల్ టోర్నీ విజేత టీమ్‌కు ట్రోఫీ అందిస్తున్న సీఎస్ఎస్ఎన్ రెడ్డి

స్టేట్ వాలీబాల్ చాంప్‌గా శ్రీకాకుళం, విశాఖ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో 3 రోజుల నుంచి జరుగుతున్న 68 ఏపీ స్టేట్ (అంతర్ జిల్లాల) వాలీబాల్ అండర్-19 బాల బాలికల చాంపియన్‌షిప్ బాలుర విభాగంలో శ్రీకాకుళం, బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా టీమ్‌లు టైటిళ్లను వశం చేసుకున్నాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి (ద్వితీయ), విశాఖపట్నం (తృతీయ), బాలికల్లో పశ్చిమగోదావరి (ద్వితీయ), విజయనగరం (తృతీయ)స్థానాల్లో నిలిచాయి. జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సెక్రటరీ వీ రవికాంత ఆధ్వర్యంలో జరిగిన విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు, పరిశీలకులు నాగేశ్వరరావు, కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ దోనేపూడి దయాకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు కేవీ నారాయణ, కె. భుజంగరావు, కె సుజాత, కె. మార్కండేయులు,ఎన్ సునీత పాల్గొని అందజేశారు.

ప్రపంచ వర్శిటీ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో సోమవారం జరిగిన ప్రపంచ వర్శిటీ రైఫిల్ షూటింగ్‌లో భారత్ టీమ్ స్వర్ణంతో మెరిసింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో విజయవాడ నగరానికి చెందిన మద్దినేని ఉమామహేష్, ఐశ్వర్య ప్రతాప్, రమేష్‌తో కూడిన టీమ్ స్వర్ణం వశం చేసుకుంది. వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో 0.1 పాయింట్ తేడాతో ఉమామహేష్ కాంస్యం కోల్పోయాడు. మొత్తం ప్రపంచలోని 23 దేశాల ఈ టోర్నీలో బరిలో దిగాయి. ఉమామహేష్ కేఎల్ వర్శిటీలో సీఎస్ఐటీ చివరి ఏడాది చదువుతున్నాడు. స్వర్ణం సాధించిన ఉమామహేష్‌కు చైర్మన్, వీసీ అభినందనలు తెలిపారు.

శాప్ చైర్మన్‌తో ఎమ్మెల్సీల చర్చ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాప్ కార్యాలయంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిరంజీవిరావు, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి క్రీడారంగ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలను రవినాయుడు దుశ్శాలువాలతో సత్కరించారు. క్రీడాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

పతకాలతో ఏపీకి ఉన్నతస్థానం

ఏపీ స్పోర్ట్సు అథారిటీ క్రీడాకారులకు అండగా ఉంటుందని శాప్ చైర్మన్ రవినాయుడు భరోసా ఇచ్చారు. జగ్గయ్యపేట పవర్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన రాజమండ్రికి చెందిన పవర్‌లిఫ్టర్ వి. రేవతి చైర్మన్‌ను కలిసి మెడల్‌ను చూపించారు. ఒంగోలుకు చెందిన అథ్లెట్ రామతులసీ ఇటీవల మలేషియా ఓపెన్ సాధించిన కాంస్యం చూపించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని రవినాయుడు ఆకాంక్షించారు.

రాష్ట్ర స్కేటింగ్‌లో అక్కాతమ్ముళ్ల సత్తా



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని మున్సిపల్ స్కేటింగ్ పార్కులో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి 36వ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన అక్కాతమ్ముళ్లు మాత్రపు జెస్సీ రాజ్, జోయల్ ఆదర్శ్ పతకాలతో సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా 250 స్కేటింగ్ క్రీడాకారులు బరిలో నిలవగా, జెస్సీ రాజ్ ఇన్‌లైన్‌లో రజతం సో లో డ్యాన్స్‌లో రజతం, ఫిగర్ విభాగంలో కాంస్యం సాధించింది. జోయల్ ఆదర్శ్ ఇన్‌లైన్‌లో కాంస్యం, ఫిగర్‌లో కాంస్యంలను సాధించింది. పతకాలు సాధించిన అక్కాతమ్ముళ్లను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్ చౌదరీ, చైర్మన్ పవన్‌కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. జెస్సీ రాజ్ ఇటీవలే న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచస్థాయి ఓషియానిక్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో స్వర్ణం సాధించడం గమనార్హం.

రైల్వేస్ చేతిలో ఆంధ్ర క్రికెట్ జట్టు పరాజయం

మూలపాడు వేదికగా కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో ఆంధ్ర క్రికెట్ టీమ్‌కు తొలి పరాజయం చవిచూసింది. రైల్వేస్ జట్టుతో మల్టీడేస్ క్రికెట్‌లో 325 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆంధ్ర టీమ్ పోరాడి 227 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో 446, రెండో ఇన్నింగ్స్‌లో 182 పరుగులను రైల్వేస్ టీమ్ చేయగా ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు కుప్పకూలిన విషయం తెల్సిందే. బౌలింగ్‌లో పటిష్టంగానే ఉన్నా ఆంధ్ర బ్యాటర్లు తేలిపోవడంతో 98 పరుగుల తేడాతో పరాజయం చెందింది. ఇంతకుముందు మేఘాలయ, విదర్భ జట్లపై ఆంధ్ర జయభేరి మోగించింది.

విజయవాడలో

వైసీపీకి బిగ్‌షాక్!

● వైఎస్ఆర్‌సీపీ నుంచి జనసేనలోకి వలసలు

● పవన్‌కల్యాణ్ సమక్షంలో నలుగురు కార్పొరేటర్లు జనసేనలో చేరిక

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 11 ఎమ్మెల్యే సీట్లను మాత్రమే గెలుచుకున్న వైఎస్ఆర్‌సీపీలో నేతలు, శ్రేణులు ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. ఇంతకుముందు కొంతమంది అటు టీడీపీలో, ఇటు జనసేనలో చేరుతున్న పరిస్థితి ఉంది. తాజాగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు, 51 వడివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, తూర్పు నియోజకవర్గంలోని 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వీరందరనీ పవన్‌కల్యాణ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దాదాపు శూన్య స్థితిలో తాను పార్టీ పెట్టినట్లు తెలిపారు. ప్రజల కోసమే పని చేయడానికి తాను అడుగులు ముందుకు వేసినట్టు చెప్పారు. 2009 నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయిన హరిప్రసాద్ తనతోనే నడిచినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్ రాష్ట్రానికి మేలు చేయాలన్న సంకల్పంతో వచ్చారన్నారు. తామంతా విపత్కర పరిస్థితులలో కలసి పనిచేసినట్లు తెలిపారు. కష్టాల కొలిమిలో నడుస్తూనే రాష్ట్రానికి అండగా ఉండాలని సంకల్పించినట్లు చెప్పారు.బీడు భూమి తప్ప ఇంక ఏమీ లేని స్థలంలో మంగళగిరిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. 2016లో మీడియా కూడా త్వరగా వచ్చేవారు కాదన్నారు. పదేళ్ల పార్టీ నిర్మాణానికి సమయం పట్టిందన్నారు. జనసేనకు బలమైన స్థానిక నాయకత్వం ఇప్పుడు ఉందన్నారు. కార్పొరేటర్లు పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. మోదీ మద్దతుతో చంద్రబాబు నాయకత్వంలో అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. రూ.లక్షా 31వేల కోట్ల రుణంతో కలెక్టివ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. టీడీపీ, చంద్రబాబు సుదీర్ఘ అనుభవానికి జనసేన బలమైన పోరాట శక్తిని ఇచ్చిందన్నారు. బీజేపీకి దేశంలో ఉన్న శక్తి సామర్థ్యాలు రాష్ట్ర అభివృద్ధికి బలంగా మారాయన్నారు. ఎంత పనిచేస్తే అంత గుర్తింపు పార్టీలో ఉంటుందన్నారు. హరిప్రసాద్, ఉదయభాను, మధుసూదన్‌రెడ్డి, రియాజ్, మండలి రాజేష్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఉదయభాను పార్టీలోకి వచ్చిన తరువాత పార్టీని బలోపేతం చేయాలని సూచించానని, ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టాల్సి ఉన్నా తృటిలో తప్పిందని, ఈసారి ఉదయభాను నిర్ణయాత్మక పాత్రలో ఉంటారని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

ఎయిర్‌పోర్టు అభివృద్ధి, నిర్వాసితులకు కేటాయింపులు

● నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కోసం రూ. 24.56 కోట్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. విమానాశ్రయాభివృద్ధికి సంబంధించి రూ.5 కోట్లను కేటాయించగా.. విమానాశ్రయ నిర్వాసితులకు ఊరటనిచ్చేలా రూ. 24.56 కోట్లను తొలి దశలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద డబ్బులు కేటాయించింది. విమానాశ్రయ నిర్వాసితులకు తొలి దశలో ఇళ్ళు నిర్మించుకోవటానికి రూ. 4.50 లక్షల నిధులను ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి సంబంధించి జీఓ కూడా ఇటీవల జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తాను అన్నట్టుగానే రూ. 24.56 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో చిన్న అవుటపల్లిలోని ఆర్‌అండ్‌ఆర్ లే అవుట్‌లో తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ళ పనులు ప్రారంభించుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది.

ఐటమ్ సాంగ్స్‌తో అదరగొడుతూ




స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా పలు సినిమాల్లో నటిస్తూ రాణిస్తున్నారు. ఒప్పుడు గ్లామర్ పాత్రలతో అదరగొట్టిన తమన్నా...ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు, పలు వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ మిల్కీ బ్యూటీ దక్షిణాదిలో కేవలం ప్రత్యేక సాంగ్స్‌లో మాత్రమే కనిపిస్తున్నారు. గతేడాది జైలర్ సినిమాలో ఐటమ్ సాంగ్‌లో మెరిసిన తమన్నా...ఇటీవల స్త్రీ-2 చిత్రంలో స్పెషల్ సాంగ్‌తో అదరగొట్టారు. ప్రస్తుతంలో తెలుగులో 'ఓదెల2' అనే సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆమె నటించిన క్రైమ్ అండ్ థ్రిల్లర్ హిందీ మూవీ 'సికందర్ కా ముఖద్దర్' నవంబరు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీవింగ్ అవనుంది.

డాక్టరు, డైరెక్టర్ ఒకటయ్యారు!



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, డాక్టర్ ప్రీతి చల్లా వివాహ బంధంతో ఒకటై కొత్త ప్రయాణం ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం వైభవంగా జరిగింది. డాక్టర్ ప్రీతి హైదరాబాద్‌లో గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. సెన్సిటివ్ కథలను ఎన్నుకొని అద్భుత చిత్రాలను రూపొందించే దర్శకుడిగా పేరొందిన క్రిష్ ప్రస్తుతం అనుష్క హీరోయిన్‌గా 'ఘాటీ' చిత్రాన్ని తీస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.

జపాన్‌లో రిలీజ్ అవుతున్న కల్కి



ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ' వచ్చే ఏడాది జనవరి 3న జపాన్‌లో జరిగే షోగాట్సు ఫెస్టివల్‌లో ప్రదర్శితమవుతుంది. జపాన్ సినీ దిగ్గజం కబాటా కైజో ఆధ్వర్యంలో ట్విన్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండడంతో కల్కి గ్లోబల్ జర్నీలో మరో అధ్యాయం మొదలవుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'కల్కి' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 12 వందల కోట్లకు పైగా వసూలు చేసి, 2024లో అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రంగా రికార్డ్ నెలకొల్పింది. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపిక తదితరులు నటించారు.

ప్లీజ్.. అలా పిలవొద్దు



తన అభిమానులతో పాటు సినీ ప్రముఖులకు అగ్రనటుడు కమల్ హాసన్ ఓ విజ్ఞప్తి చేశారు. తనను 'ఉలగనాయకన్' (విశ్వనటుడు) అంటూ పిలవొద్దని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. కమల్ హాసన్, లేదా కమల్ లేదా కేహెచ్ అని పిలిస్తే చాలని సూచించారు. కళ కంటే కళాకారుడు గొప్పకాదని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ చిత్రపరిశ్రమలో అగ్రహీరోగా ఉన్న కమల్ హాసన్‌ను అనేక మంది 'ఉలగనాయగన్' అంటూ సంబోధిస్తుంటారు. ఇకపై అలా పిలవొద్దని ఆయన కోరారు. 'నాపై మీకున్న అపారమైన ప్రేమాభిమానాల వల్ల 'ఉలగనాయగన్' అంటూ ముద్దుగా పిలుస్తుంటారు. మీ ప్రేమకు ఎన్నటికీ కృతజ్ఞుడను. సినిమా కళ అనేది ఒక వ్యక్తి కంటే గొప్పది. అలాంటి కళను మరింతగా నేర్చుకుంటూ పరిణామం చెందుతున్న నిత్యనూతన విద్యార్థిని నేను. ఇతర కళల తరహాలోనే సినిమా కూడా ప్రతి ఒక్కరికీ చెందినది. ప్రతిభావంతులైన కళాకారులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకుల కలయికతోనే సినిమా రూపుదిద్దుకుంటుంది. కళ కంటే కళకారుడు గొప్పవాడు కాదన్నది నా ప్రగాఢ విశ్వాసం. నిరంతర అభ్యాసంతోనే పురోగతిని సాధించవచ్చు' అని కమల్ విజ్ఞప్తి చేశారు. గతంలో హీరో అజిత్‌ను ఆయన అభిమానులు 'తల' అంటూ సంబోధించేవారు. దీన్ని గ్రహించిన అజిత్.. తనను 'తల' అని పిలవొద్దని అజిత్ లేదా అజిత్ కుమార్ లేదా ఏకే అని మాత్రమే పిలవాలని విజ్ఞప్తి చేసిన విషయం తెల్సిందే.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

టార్గెట్ రెండు సార్లు మిస్ అయింది..

ఈ సారి గట్టిగా కొడతా



వరుణ్‌తేజ్

'టార్గెట్ రెండు సార్లు మిస్ అయింది. ఈ సారి మాత్రం గట్టిగా కొడతా.నేను మామూలుగా మాటలు చెప్పే వ్యక్తిని కాదు. కానీ 'మట్కా' చూసి నమ్మకంతో చెబుతున్నా. ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది' అని చెప్పారు వరుణ్‌తేజ్. ఆయన హీరోగా నటించిన 'మట్కా' చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం వైజాగ్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'ఒక మాస్ సినిమా చేద్దాం.. అందరికీ నచ్చే చిత్రం చేద్దాం అనుకుంటున్న తరుణంలో దర్శకుడు కరుణకుమార్ 'మట్కా' కథతో వచ్చారు. ఆయనతో కలసి పని చేయడం నిజంగా నా అదృష్టం. సినిమా రిలీజ్ అయిన తర్వాత అందరూ ఆయన గురించి మాట్లాడుకుంటారు.ప్రతి సినిమా రిలీజ్ ముందు ఓ టెన్షన్ ఉంటుంది. అలా టెన్షన్ పడుతున్నప్పుడు రామ్‌చరణ్ అన్నయ్య ఫోన్ చేసి ఎమోషనల్ సపోర్ట్ ఇచ్చారు' అంటూ ఈ చిత్ర నిర్మాతలకు, నటించిన నటీనటులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా తర్వాత వరుణ్ తేజ్ పరిశ్రమలోని టాప్ మాస్ హీరోల్లో ఒకరవుతారని నిర్మాతల్లో ఒకరైన రామ్ తాళ్లూరి చెప్పారు. 'వైజాగ్‌కు ఓ చరిత్ర ఉంది. అందులో ఓ భాగాన్ని ఈ సినిమాగా చూపిద్దాం అనుకున్నాను. వైజాగ్‌లో ఒకప్పుడు జరిగిన కథ ఇది. కథ వినగానే ఫస్ట్ సిట్టింగ్‌లోనే వరుణ్‌తేజ్ ఓకే చేశారు. మనిషిలోని మంచీచెడు గురించి మాట్లాడే సినిమా ఇది' అని దర్శకుడు కరుణకుమార్ చెప్పారు. చరిత్రలో నిలిచిపోయే సినిమా ఇదనీ, మెగాఫ్యాన్స్ తొడ కొట్టి చెప్పవచ్చని మరో నిర్మాత డాక్టర్ విజయేందర్ రెడ్డి చెప్పారు.

దిల్ రాజు డ్రీమ్స్... కొత్త సినిమాలు



ప్రముఖ నిర్మాత దిల్ రాజు కొత్త నిర్మాణ సంస్థను ప్రకటించారు. 'దిల్ రాజు డ్రీమ్స్' పేరుతో నెలకొల్పిన ఆ ప్రొడక్షన్ హౌజ్ చిత్ర పరిశ్రమలో కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించనుంది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కొత్త నిర్మాణ సంస్థ గురించిన వివరాలను దిల్ రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'యంగ్ జనరేషన్‌తో సినిమాలు చేయాలని ఉంది. గతంలో నా జర్నీలో అన్నీ అద్భుతమైన సినిమాలే వచ్చాయి. స్టార్ హీరోలందరితో చేశాం. ఇండస్ట్రీకి వచ్చి 30 ఏళ్లు అయింది. ఇప్పుడు మాకు కంటెంట్‌కి కొదవ లేదు. వరుస సినిమాలు చేస్తున్నాం. న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేయాలని కొత్త బేనర్ 'దిల్ రాజు డ్రీమ్స్' ప్రారంభిస్తున్నాం. 'దిల్ రాజు డ్రీమ్స్'కు అనేక టీమ్స్‌ను ఏర్పాటు చేశాం. కథలు, సినిమాల నిర్మాణం, విడుదల వరకు న్యూ టాలెంట్‌ను సపోర్ట్ చేయాలనేదే మా ఆలోచన. దీనికోసం ఒక వెబ్ సైట్‌ని కూడా ఏర్పాటు చేశాం. త్వరలోనే దానిని లాంచ్ చేయనున్నాం. ఇదంతా కార్పొరేట్ స్టయిల్‌లో ఆర్గనైజ్డ్ సిస్టమ్‌గా ఉంటుంది. స్క్రిప్ట్ రివ్యూ పేరుతో ఎక్స్‌పెరిమెంట్ కూడా చేయాలనుకుంటున్నాం. 'జటాయి' అనే పాన్ ఇండియా సినిమా నా డ్రీమ్ ప్రాజెక్ట్. ఆ సినిమా వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అని చెప్పారు.

కొత్త సినిమా కబుర్లు...

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాను జనవరి 10న రిలీజ్ చేయబోతున్నాం. సంక్రాంతికి అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదల ఉంటుంది. నితిన్‌తో చేస్తున్న 'తమ్ముడు'ని శివరాత్రికి రిలీజ్ చేయనున్నాం. ఇవి కాకుండా నితిన్, వేణు కాంబినేషన్‌లో 'యల్లమ్మ', యష్ మాస్టర్ హీరోగా ఒక సినిమా, ఆశిష్ హీరోగా చేస్తున్న 'సెల్ఫిష్'... ఇలా అనేక సినిమాలతో బిజీగా ఉన్నా.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

నటి కస్తూరి హైకోర్టులో పిటిషన్



తెలుగు ప్రజలను కించపరిచేలా ఇటీవల వ్యాఖ్యలు చేసిన సీనియర్ నటి కస్తూరి.. తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. తెలుగువారిపై చేసిన వ్యాఖ్యల పట్ల విచారణ వ్యక్తం చేసిన తర్వాత కూడా రాజకీయకక్ష కారణంగా తనపై కేసు నమోదుచేశారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసులో కోర్టు విధించిన అన్ని షరతులకు కట్టుబడి ఉంటానని, అందువల్ల తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు మంగళవారం రానుంది. కస్తూరిపై మదురై, సేలం, చెన్నై తదితర ప్రాంతాల్లో పలు ఫిర్యాదులు నమోదైన విషయం తెలిసిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

చిత్రపురి కాలనీలో అనర్హుల రిజిస్ట్రేషన్లు రద్దు



తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలుగు సినీ పరిశ్రమపై కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రపురి కాలనీలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేరు మీద జూనియర్ ఆర్టిస్టుల కోసం, క్యారెక్టర్ ఆర్టిస్టుల కోసం స్థలాలు కేటాయించిందని గుర్తు చేశారు. ఇందులో అనర్హులుంటే వారి రిజిస్ట్రేషన్లు రద్దు చేసి ఆ స్థలాలను తెలంగాణ ఆర్టిస్టులకు ఇవ్వాలనేది తన ఉద్దేశం అని అన్నారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించిన తెలంగాణ ఫిల్మ్ చాంబర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా కోమటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "వారానికి నలుగురు, ఐదుగురు నిర్మాతలు వారి సినిమాల పోస్టర్ లాంచ్ చేయాలని కోరుతూ తన వద్దకు వస్తుంటారని, వారిని తాను అడిగితే థియేటర్లు దొరకడం లేదని అంటున్నారని అన్నారు. అలాంటి వాళ్లు రిలీజ్ డేట్ అనౌన్స్‌కి ముందే తనను సంప్రదిస్తే, మీకు సపోర్ట్‌గా ఉండి థియేటర్లు ఇప్పిస్తానని హామి ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. ఒక పాన్ ఇండియా సినిమా అంటూ ఐదారుగురు హీరోలకో, డైరెక్టర్లకో పరిమితమైతే ఎలా అని మంత్రి ప్రశ్నించారు. పాన్ ఇండియా సినిమా రిలీజ్ అవుతోంది, పెద్ద బడ్జెట్‌తో తీశాం, మాకు రెట్లు పెంచుకునే అవకాశం ఇవ్వండి అని కొందరు తన వద్దకు వస్తున్నారని, అలాంటి వారికి సమయం ఇవ్వనని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో టాలెంట్ కలిగిన నటులు ఎందరో ఉన్నారని, వారికి తమ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతిభ కలిగిన తెలంగాణ నటీనటులకు గుర్తింపు దక్కడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, వైస్ ప్రెసిడెంట్ గురురాజ్, సెక్రటరీలు జేవీర్, కాచం సత్యనారాయణ, టీ మా ప్రెసిడెంట్ రశ్మీ ఠాకూర్, ప్రసాద్ సంస్థల అధినేత రమేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దీపికకు వరం.. ఐశ్వర్యకు కలవరం





కొన్ని కొన్ని విషయాల గురించి వింటుంటే తమాషాగా అనిపిస్తుంటుంది. సినిమాల్లో మొదట ఒక తారను అనుకుని చివరికి మరొకరిని తీసుకోవడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది. ఇలాంటి మార్పుల వల్ల ఆయా తారల కెరీర్ కీలకమైన మలుపు తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఐశ్వర్య, దీపిక.. అందంలో, అభినయంలో సమ ఉజ్జీలే. ఐశ్వర్య చేయాల్సిన రెండు చిత్రాలు 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' చివరి క్షణంలో ఆమె చేజారి దీపికకు దక్కాయి. సల్మాన్ ఖాన్, ఐశ్వర్య జంటగా 'బాజీరావు మస్తానీ' చిత్రాన్ని తీయాలని దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ 2003లో ప్లాన్ చేశారు. అంతా సవ్యంగా జరుగుతుందనుకుంటున్న సమయంలో అప్పటివరకూ ప్రేమికులుగా ఉన్న సల్మాన్, ఐశ్వర్య బ్రేకప్ చెప్పేసుకుని విడిపోవడం, ఆ వార్త వైరల్ కావడంతో భన్సాలీ ముందే మేల్కొన్నారు. వీరిద్దరిని ఆయన వద్దనుకున్నారు. అప్పుడు హీరోయిన్‌గా దీపికను తీసుకున్నారు. అలాగే అల్లాఉద్దీన్ ఖిల్జీగా షారుఖ్‌ఖాన్‌నీ, రాణి పద్మావతిగా ఐశ్వర్య బచ్చన్‌ని పెట్టి 'పద్మావత్' చిత్రాన్ని తీయాలని భన్సాలీ ప్లాన్ చేశారు. కానీ ఒక నరహంతకుడి పాత్రను పోషించడానికి షారుఖ్ ఖాన్ ఆసక్తి చూపించకపోవడంతో షారుఖ్‌నే కాదు ఐశ్వర్యను కూడా మార్చేశారు భన్సాలీ. మళ్లీ ఆ అవకాశం దీపికకే దక్కింది. 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' చిత్రాలు ఒక్కొక్కటీ రూ 950 కోట్లు వసూలు చేయడంతో హీరోయిన్‌గా దీపిక జాతకమే మారిపోయింది.

'ధూం ధాం'గా ఎంజాయ్ చేస్తున్నారు

- ప్రొడ్యూసర్, రైటర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటించిన సినిమా 'ధూం ధాం'. సాయి కిశోర్ దర్శకత్వంలో ఎం.ఎస్.రామ్ కుమార్ నిర్మించారు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో చిత్రం సక్సెస్ గురించి ప్రొడ్యూసర్ రామ్ కుమార్, రైటర్ గోపీ మోహన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

- రామ్ కుమార్ మాట్లాడుతూ' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఒక థియేటర్‌లో కామన్ ఆడియన్స్‌తో కలసి హీరో చేతన్ సినిమా చూశారు. వారు మూవీని బాగా ఎంజాయ్ చేయడం గమనించి హ్యాపీగా ఫీలయ్యారు. సక్సెస్‌ఫుల్ హీరోలంతా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఇంప్రెస్ చేసిన వాళ్లే. చేతన్ కూడా అలాగే పేరు తెచ్చుకున్నారు. ఈ రోజుల్లో థియేటర్స్‌కు జనం పెద్దగా రావడం లేదు. మేము ఆశించినంత కలెక్షన్స్ లేకున్నా సంతృప్తికరంగానే వసూళ్లు ఉన్నాయి. మా సంస్థలో తరవాత చిత్రాన్ని మరికొద్ది రోజుల్లో అనౌన్స్ చేస్తాం. బయట హీరోలతో సినిమాలు చేసే ఉద్దేశం లేదు. చేతన్‌తోనే మా నెక్ట్స్ మూవీ ఉంటుంది' అని తెలిపారు.
- రచయిత గోపీ మోహన్ మాట్లాడుతూ' మేము అనుకున్నట్లే సాంగ్స్‌ను, కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వెన్నెల కిషోర్ క్యారెక్టర్‌కు ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రొడ్యూసర్ రామ్ కుమార్, హీరో చేతన్ ఇద్దరూ కామెడీ లవర్స్. నా నెక్ట్స్ మూవీ గల్లా జయదేవ్ రెండో అబ్బాయితో ప్లాన్ చేస్తున్నా. నా డైరెక్షన్‌లోనే ఆ సినిమా చేస్తా. ఆ వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.

వెయ్యేళ్ల కిందటి వీరుడి పాత్ర



డైరెక్టర్ శివ

సూర్య హీరోగా తెరకెక్కిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'కంగువ'. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. శివ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని కె.ఈ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈనెల 14 సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ హైలెట్స్‌ను మీడియాకు వివరించారు చిత్ర దర్శకుడు శివ. 'కొన్ని స్క్రిప్ట్స్‌ని జ్ఞానవేల్‌కి చెప్పినప్పుడు, వాటిలో 'కంగువ' ఆయనకు బాగా నచ్చింది. ఈ కథను హీరో సూర్యకు చెప్పమన్నారు. సూర్యకు స్క్రిప్ట్ చెప్పాను. చాలా బాగుంది మూవీ చేద్దాం అని సూర్య అన్నారు. అలా 'కంగువ' జర్నీ మొదలైంది. త్రీడీ మూవీస్‌లో 'కంగువ' బెస్ట్ అవుతుంది. కంగువ, ఫ్రాన్సిస్ అనే రెండు పాత్రల్లో సూర్య కనిపిస్తారు. 'కంగువ' వెయ్యేళ్ల కిందటి వీరుడి పాత్ర. ఈ పాత్రకు హద్దులు లేవు. ఫ్రాన్సిస్‌ను కొన్ని అంశాలతో కంట్రోల్ చేయవచ్చు. ఉధిరన్ అనే క్యారెక్టర్‌ను బాబీ డియోల్ చేస్తున్నారు. 'కంగువ'లో ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించాలని ప్రయత్నించాం. ఎందుకంటే ఇప్పటి ట్రెండ్‌లో ప్రేక్షకులు స్క్రీన్ మీద కొత్త ప్రపంచాన్ని, నేపథ్యాన్ని చూసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ గొప్ప సంగీతాన్ని అందించారు. చిత్రంలో ఒక సర్‌ప్రైజింగ్ అతిథి పాత్ర ఉంటుంది. అది 'కంగువ' సీక్వెల్‌కు లీడ్ ఇస్తుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతి స్టార్ హీరోతో సినిమా చేయాలని ఉంది. నా దగ్గర ఇంట్రెస్టింగ్ స్క్రిప్ట్స్ ఉన్నాయి. అవకాశం వస్తే తప్పకుండా తెలుగు స్టార్స్‌తో సినిమాలు చేస్తాను.

నటితో దర్శకుడి ఎంగేజ్‌మెంట్



సుహాస్ హీరోగా నటించిన 'కలర్ ఫొటో' చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్‌రాజ్ ఓ ఇంటివాడు అవుతున్నారు. 'కలర్ ఫొటో' చిత్రంలోనే నటించిన చాందినీ రావుతో ఆయన వివాహం డిసెంబర్‌లో జరుగనుంది. ఆ చిత్ర నిర్మాణ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. సోమవారం జరిగిన తమ వివాహ నిశ్చితార్థ ఫొటోలను సందీప్ రాజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

ఎన్టీఆర్ ఎంపిక చేసిన కథ



నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిన 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. సంపద హీరోయిన్. ఈ సినిమా గురించి నిర్మాత చింతపల్లి రామారావు మాటాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే వెరైటీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ అంశాలతో నిర్మించాం. జూనియర్ ఎన్టీఆర్ ఎంతో మెచ్చి ఎంపిక చేసిన కథ ఇది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు అద్భుతంగా చిత్రాన్ని రూపొందించారు. మా హీరో నార్నే నితిన్ నటించిన 'ఆయ్', 'మ్యాడ్' చిత్రాల తరహాలో హ్యాట్రిక్ హిట్ సాధిస్తుంది' అని చెప్పారు.

కోర్టు నేపథ్యంలో సాగే కథ



త్రిగుణ్, దీప్సిక ప్రధాన పాత్రలు పోషించిన 'ఉద్వేగం' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. త్రిగుణ్‌కు ఇది 25వ సినిమా. కోర్టు నేపథ్యంలో సాగే ఈ సినిమాను మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో జి.శంకర్, ఎల్.మధు నిర్మించారు. శ్రీకాంత్ భరత్, సురేశ్ నాయుడు, పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సినిమా టీజర్ ప్రేక్షకాదరణ పొందిందనీ, సినిమా కూడా వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందనీ నిర్మాతలు చెప్పారు.

పదేళ్లలో రూ.84 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల ద్వారా భారత కుటుంబాలకు సమకూరిన సంపద ఇది

దశాబ్ద కాలంలో రూ.714 లక్షల కోట్ల సంపద వృద్ధి

అందులో 11% ఈక్విటీల నుంచి.. : మోర్గాన్ స్టాన్లీ



న్యూఢిల్లీ: భారత కుటుంబాలు తమ ఆస్తుల్లో కేవలం 3 శాతం షేర్లలో పెట్టుబడిగా పెట్టడం ద్వారా గత పదేళ్లలో స్టాక్ మార్కెట్ నుంచి లక్ష కోట్ల డాలర్లు (రూ.84 లక్షల కోట్ల పైమాటే) ఆర్జించి ఉంటాయని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. గత పదేళ్లలో భారత కుటుంబాలు తమ సంపదను 8.5 లక్షల కోట్ల డాలర్ల (రూ.714 లక్షల కోట్లు) మేర పెంచుకున్నాయని.. అందులో 11 శాతం స్టాక్ మార్కెట్ నుంచి గడించాయని మోర్గాన్ స్టాన్లీ నివేదిక వెల్లడించింది. అయితే, ఈక్విటీల్లో భారత కుటుంబాల పెట్టుబడులు ఇప్పటికీ చాలా తక్కువేనని మోర్గాన్ స్టాన్లీ ఇండియా ఎండీ రిధమ్ దేశాయ్ అన్నారు. మొత్తం ఆస్తుల్లో 3 శాతంగా ఈక్విటీ పెట్టుబడులు మున్ముందు సంవత్సరాల్లో రెండంకెల స్థాయికి పెరగవచ్చన్నారు. మరిన్ని విషయాలు..

- కంపెనీ వ్యవస్థాపకుల ఈక్విటీ వాటాలను సైతం పరిగణనలోకి తీసుకుంటే, భారత కుటుంబాల సంపద గత దశాబ్దకాలంలో 9.7 లక్షల కోట్ల డాలర్లు పెరిగిందని.. అందులో 20 శాతం లేదా 2 లక్షల కోట్ల డాలర్లు స్టాక్ మార్కెట్ నుంచి సమకూరిందని అంచనా.
- ప్రస్తుతం భారత కుటుంబాల ఆస్తుల్లో ఈక్విటీల వాటా చాలా తక్కువే అయినప్పటికీ, గత పదేళ్లలో స్టాక్స్ వీరి పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. మున్ముందు ఈ పెట్టుబడులు మరింత వేగంగా వృద్ధి చెందనున్నాయని నివేదిక అంచనా వేసింది.
- బంగారం సైతం అతిపెద్ద సంపద సృష్టికర్తగా ఉంది. గత పదేళ్లలో పసిడి ద్వారా సంపద 22 శాతం పెరిగింది.
- 2014 మార్చిలో 1.2 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్.. గత పదేళ్లలో భారీగా వృద్ధి చెంది ప్రస్తుతం 5.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. మార్కెట్ క్యాప్ పరంగా ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్ మనదే.
- ప్రపంచ మార్కెట్ క్యాప్‌లో భారత్ స్టాక్ మార్కెట్ వాటా 2013లో 1.3 శాతంగా ఉండగా.. 2024 నవంబరు నాటికి 4.3 శాతానికి పెరిగింది. వర్ధమాన దేశాల్లో రెండో అత్యధిక వాటా మనదే.
- గత దశాబ్ద కాలంలో బంగారం, ఈక్విటీలే అత్యుత్తమ ప్రతిఫలాలు అందించాయి. భారత కుటుంబాల ఆస్తుల్లో అత్యధిక వాటా స్థిరాస్తులదే అయినప్పటికీ, వాటి విలువ మాత్రం మిగతా వాటితో పోలిస్తే అంతగా పెరగలేదని మోర్గాన్ స్టాన్లీ నివేదిక పేర్కొంది.

భాంజు రూ.139 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యార్థులకు సులభంగా గణితంలో మెలకువలు నేర్పే ఎడ్యుకేషన్ స్టార్టప్ కంపెనీ 'భాంజు' కొత్తగా 1.65 కోట్ల డాలర్లు (సమారు రూ.139.22 కోట్లు) సమీకరించింది. సిరీస్-బీ ఫండింగ్ ద్వారా ఈ నిధులు సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఎపిక్ క్యాపిటల్, 23 వెంచర్స్ ఎయిట్ రోడ్స్, లైట్‌స్పీడ్ వెంచర్స్ అనే సంస్థల నుంచి కంపెనీ ఈ నిధులు సమీకరించింది. ఈ నిధులతో తమ కార్యకలాపాలను అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియా దేశాలకూ విస్తరిస్తామని భాంజు ఫౌండర్, సీఈఓ నీలకంఠ భాను తెలిపారు.

హైదరాబాద్‌లోనూ 'టెక్‌ఎక్స్‌పిడైట్'

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ 'గేమ్స్ 24X7' తన 'టెక్ ఎక్స్‌పిడైట్' కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు విస్తరించింది. ఈ కార్యక్రమం ద్వారా కృత్రిమ మేధ (ఏఐ), గేమింగ్, ఇన్‌క్లూజివ్ టెక్నాలజీ రంగాలకు చెందిన స్టార్టప్ కంపెనీలకు ప్రత్యేక యాక్సిలరేషన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఏడబ్ల్యూఎస్ సంస్థ ఇందుకు క్లౌడ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుంది.

ఒక షేరుకు రెండు షేర్లు

ఎన్ఎండీసీ బోనస్ ఇష్యూ

సెప్టెంబరు త్రైమాసిక లాభంలో 17% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ.. వాటాదారులకు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రెండు ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. బోనస్ షేర్ల జారీకి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా కంపెనీ వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని తెలిపింది. అర్హులైన వాటాదారులకు రికార్డు తేదీ నాడు ఈ బోనస్ షేర్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. 2008 తర్వాత కంపెనీ బోనస్ షేర్లను జారీ చేయటం ఇదే తొలిసారి. అప్పుడు కూడా కంపెనీ 2:1 నిష్పత్తిలోనే బోనస్ షేర్లను జారీ చేసింది. కాగా కంపెనీ అధీకృత మూలధనాన్ని కూడా రూ.400 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంచేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ఎన్ఎండీసీ తెలిపింది.

క్యూ2 లాభం రూ.1,196 కోట్లు: సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఎన్ఎండీసీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 17%వృద్ధి చెంది రూ.1,195.63 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.1,024.86 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 22 శాతం వృద్ధితో రూ.4,335.02 కోట్ల నుంచి రూ.5,279.68 కోట్లకు పెరిగింది.

ఏపీలో కేవీబీ విస్తరణ

ఆంధ్రప్రదేశ్‌లో కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. సోమవారం నాడు బ్యాంక్.. ఆంధ్రప్రదేశ్‌లో రెండు, తమిళనాడులో 4 కొత్త శాఖలను ప్రారంభించింది. ఏపీలోని నెల్లూరు, విజయవాడల్లో ఈ శాఖలను ఏర్పాటు చేయగా తమిళనాడులోని చెన్నై, మధురై, నాగర్‌కోయిల్, సేలం ప్రాంతాల్లో కొత్త శాఖలను ప్రారంభించింది. దీంతో బ్యాంక్ మొత్తం శాఖల సంఖ్య 854కి చేరింది. కాగా కేవీబీ.. ఏపీ, తెలంగాణల్లో మొత్తం 205 శాఖలను నిర్వహిస్తోంది.

ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టేషన్ సంస్థ ఫెడెక్స్.. ఇన్వెస్ట్ ఇండియాతో జట్టు కట్టింది. దేశంలోని చిన్న వ్యాపారాలు.. అంతర్జాతీయ మార్కెట్లోని అవకాశాలను చేజిక్కించుకోవటమే కాకుండా వృద్ధి పథంలోకి సాగేందుకు ఈ ఒప్పందం తోడ్పాటునందిస్తుందని ఫెడెక్స్ తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన .వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్‌కు మద్దతునివ్వటమే కాకుండా చిన్న వ్యాపారులు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది.

ఆద్యంతం ఊగిసలాటలే..

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. 1,100 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. 79,001.34 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని, 80,102.14 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 9.83 పాయింట్ల లాభంతో 79,496.15 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 6.90 పాయింట్ల నష్టంతో 24,141.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్ షేరు ఏకంగా 8.18 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా నిలిచింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,760 ▼	72,200 ▼	1,02,000 ▼
ముంబై	76,840 ▼	70,385 ▼	90,859 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ

హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	117
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	102
విశాఖపట్నం	111	అనంతపురం	102
గోదావరి	117		

బీఓఐ లాభం రూ.2,421 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,421 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం ఏకంగా 61 శాతం పెరిగింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.1,458 కోట్ల నుంచి రూ.2,373 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.16,659 కోట్ల నుంచి రూ.19,872 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం 4%పెరిగి రూ.5,986 కోట్లుగా నమోదైంది.

హైదరాబాద్ నుంచి క్యాథే పసిఫిక్ సర్వీసులు

క్యాథే పసిఫిక్ సంస్థ హైదరాబాద్ నుంచి హాంకాంగ్‌కు నేరుగా విమాన సర్వీసులను పునరుద్ధరించింది. వచ్చే ఏడాది మార్చి 30 నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వీసుకు బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభించారు. హాంకాంగ్-హైదరాబాద్ మధ్య ఎయిర్‌బస్ ఎ330-300 విమానాన్ని క్యాథే నడుపుతుంది. ఈ విమానంలో బిజినెస్, ఎకానమీ క్లాస్‌లుంటాయి.

కేఫిన్‌టెక్, క్యామ్స్ జేవీ

ఎంఎఫ్ సెంట్రల్ నిర్వహణ కోసం జాయింట్ వెంచర్ (జేవీ)ను ఏర్పాటు చేయాలని కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (క్యామ్స్), కేఫిన్‌టెక్ టెక్నాలజీస్ నిర్ణయించాయి. ఈ జేవీ ఈక్విటీలో రెండు సంస్థలకు సమాన వాటా ఉంటుంది. ఈ జేవీ ద్వారా మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) మదుపరులకు అవసరమైన సమగ్ర సేవలు అందించాలని నిర్ణయించాయి.

రఘు వంశీ చేతికి యూకే కంపెనీ

పీఎంసీ గ్రూప్‌లో 100% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వైమానిక, రక్షణ రంగ కంపెనీలకు కీలకమైన ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరికరాలు సరఫరా చేసే రఘు వంశీ గ్రూప్ తన కార్యకలాపాలను బ్రిటన్‌కు విస్తరిస్తోంది. ఇందుకోసం బ్రిటన్ కేంద్రంగా పనిచేసే పీఎంసీ గ్రూప్ ఈక్విటీలో 100 శాతాన్ని కొనుగోలు చేసింది. ఇందుకు దాదాపు రూ.100 కోట్లు చెల్లించినట్టు సమాచారం. పీఎంసీ గ్రూప్ ప్రపంచంలోని మేటి ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలకు అవసరమైన కీలక విడిభాగాలు తయారుచేసి సరఫరా చేస్తుంటుంది. ప్రస్తుతం ఈ కంపెనీకి బ్రిటన్‌లో మూడు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. దాదాపు 100 మంది ఉద్యోగులతో గత ఏడాది రూ.180 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

వ్యూహాత్మక ముందడుగు

పీఎంసీ గ్రూప్‌ను కొనుగోలు చేయడం వ్యూహాత్మక ముందడుగు అని రఘు వంశీ గ్రూప్ తెలిపింది. ఇప్పటికే వైమానిక, రక్షణ రంగాల్లో పట్టున్న తమకు పీఎంసీ కొనుగోలు ద్వారా ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లోనూ అంతర్జాతీయ మార్కెట్లో ముఖ్యంగా యూరోపియన్ మార్కెట్లో మరింత బలం పెంచుకునే అవకాశం ఏర్పడిందని రఘు వంశీ గ్రూప్ ఎండీ వంశీ వికాస్ చెప్పారు. ప్రస్తుతం రఘు వంశీ గ్రూప్ ఆదాయంలో 95 శాతం వైమానిక, రక్షణ రంగాల ద్వారా, ఐదు శాతం ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలకు ప్రెషిసన్ పరికరాల సరఫరా ద్వారా సమకూరుతోంది. పీఎంసీ కొనుగోలుతో ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమ వాటా వెంటనే 25 శాతానికి చేరుతుందని వికాస్ చెప్పారు.

మార్కెట్లోకి సరికొత్త డిజైర్

సెడాన్ విభాగంలో వాటా పెంపుపై మారుతి ఫోకస్



న్యూఢిల్లీ: సెడాన్ విభాగంలో మార్కెట్ వాటా పెంచుకోవడం తమ లక్ష్యమని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టకూచి అన్నారు. ఎంట్రీ లెవెల్ చిన్న కార్ల అమ్మకాలు క్షీణించినప్పటికీ గ్రామీణ మార్కెట్ల పునరుజ్జీవం ఆ నష్టం భర్తీ కావడానికి దోహదపడిందని ఆయన చెప్పారు. సోమవారం ఆయన సరికొత్త కాంపాక్ట్ సెడాన్ డిజైర్ కారును మార్కెట్లో ప్రవేశపెట్టారు. ఢిల్లీలో దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.6.79 లక్షల నుంచి రూ.10.14 లక్షల మధ్యన ఉంది. ఈ కారుతో సెడాన్ విభాగంలో మార్కెట్ వాటాను పెంచుకోగలుగుతామన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. ఇటీవలి కాలంలో ఎస్‌యూవీ విభాగం మంచి వృద్ధిని నమోదు చేస్తున్నప్పటికీ అగ్రస్థానాన్ని కాపాడుకోవాలంటే తమకి అన్ని విభాగాలూ అవసరమేనని తేల్చి చెప్పారు. ఎంఎస్ఐ ప్రస్తుతం కార్ల మార్కెట్లో 40 శాతం, సెడాన్ విభాగంలో 50 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. కొత్త డిజైర్ అభివృద్ధిపై రూ.1,000 కోట్లు ఇన్వెస్ట్ చేశామని ఆయన చెప్పారు.

ప్రపంచ మార్కెట్లో డిజైర్ అద్భుత విజయం సాధించిందని, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 30 లక్షల కార్లు విక్రయించామని ఆయన తెలిపారు. మొత్తం పరిశ్రమలో సెడాన్ విక్రయాలు క్షీణిస్తున్నప్పటికీ తమకు మాత్రం ఆ మార్కెట్ బాగుందని టకూచీ చెప్పారు.

స్పోర్ట్స్

ఒలింపిక్ ఆతిథ్యం దక్కకుండా కుట్ర?

భారత్‌కు వ్యతిరేకంగా ఐఓసీకి లేఖ రాసే యోచనలో పాక్

చాంపియన్స్ ట్రోఫీకి రోహిత్ సేన తమ దేశం రావడం లేదన్న అక్కసుతోనే



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆడేందుకు రోహిత్ సేన పాకిస్థాన్ వెళ్లడంలేదని భారత్ స్పష్టంజేసింది. ఈమేరకు తమ నిర్ణయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ఇప్పటికే తెలియజేసింది. భారత్ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి ఐసీసీ వివరించింది కూడా. అయితే.. భారత్ ఈ నిర్ణయం..రెండు దేశాల ఇతర క్రీడా సంబంధాలపైనా తీవ్రంగా పడే అవకాశం కనిపిస్తోంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం భారత్‌కు దక్కకుండా ఉండాలని పాకిస్థాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. చాంపియన్స్ ట్రోఫీకి తమ దేశం వచ్చేందుకు నిరాకరించడంతో భారత్ ఒలింపిక్ బిడ్‌ను వ్యతిరేకించాలని పాకిస్థాన్ భావిస్తున్నట్టు తెలిసింది. 2036 ఒలింపిక్స్‌కు బిడ్ వేయాలని నిర్ణయించుకున్నామంటూ భారత్ ఆసక్తి వ్యక్తీకరణ లేఖను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి ఇటీవల అందజేసిన సంగతి తెలిసిందే. 'క్రీడా పోటీలను భారత్ రాజకీయం చేసింది' అనే కోణంలో భారత్ వ్యతిరేకంగా ఐఓసీకి లేఖ రాయాలని నిర్ణయించినట్టు సమాచారం. అంతేకాదు.. భారత్ బిడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కూడా పాకిస్థాన్ భావిస్తున్నట్టు తెలిసింది.

హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీ!

ప్రతిపాదించిన ఐసీసీ

పీసీబీ స్పందన కోసం ఎదురు చూపు

దుబాయ్: పాకిస్థాన్ వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో..చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రతిపాదించింది. ఈమేరకు టోర్నీ ఆతిథ్య హక్కులు కలిగిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రతిస్పందన కోసం ఐసీసీ ఎదురుచూస్తోంది. 'ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ వదులుకోకుంటే.. భారత్ ఆడే మ్యాచ్‌లను యూఏఈలో, ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహించాలని పీసీబీకి ప్రతిపాదించాం' అని ఐసీసీ అధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. 'ఫైనల్‌ను పాకిస్థాన్‌లో గాకుండా దుబాయ్‌లో నిర్వహిస్తేనే చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ పద్ధతికి బీసీసీఐ అంగీకరించింది' అని కూడా ఆ అధికారి తెలిపారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహణకు అంగీకరిస్తే..పూర్తి ఆతిథ్య రుసుము చెల్లించడంతోపాటు మెజార్టీ మ్యాచ్‌లు పాకిస్థాన్‌లో నిర్వహించేలా ఐసీసీ హామీ ఇచ్చినట్టు సమాచారం. భారత్ తమ దేశం రాని నేపథ్యంలో ఆతిథ్య హక్కులను పాక్ కనుక వదులుకొంటే..చాంపియన్స్ ట్రోఫీని దక్షిణాఫ్రికాకు తరలించాలని కూడా ఐసీసీ ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ టోర్నీలో షెడ్యూల్ ప్రకారం పాక్ వేదికగా వచ్చే ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగాలి.

బుమ్రాకే పగ్గాలు!



రోహిత్ సందేహమే.. ఓపెనర్‌గా రాహుల్

బోర్డర్-గవాస్కర్ సిరీస్‌పై కోచ్ గంభీర్



ముంబై: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగే తొలి టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. ఒకవేళ అతను ఆడలేకపోతే వైస్‌కెప్టెన్ బుమ్రా ఆధ్వర్యంలో జట్టు బరిలోకి దిగుతుందని స్పష్టం చేశాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టు ఆదివారం, సోమవారం రెండు విడతలుగా ఆస్ట్రేలియా పర్యటనకు బయలుదేరింది. ఈ బృందాల్లో రోహిత్ లేడు. ఈ నేపథ్యంలో కోచ్ గంభీర్ సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడాడు. 'ప్రస్తుతానికి రోహిత్ విషయంలో స్పష్టత లేదు. సిరీస్ ఆరంభ మ్యాచ్‌కు ముందు ఏ విషయం తెలుస్తుంది. ఒకవేళ రోహిత్ ఆడలేకపోతే పెర్త్ టెస్టుకు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రోహిత్ స్థానంలో ఆడేందుకు ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్, రాహుల్ మాకు అందుబాటులో ఉన్నారు. నాణ్యమైన జట్టుతోనే బరిలోకి దిగుతాం. రాహుల్‌కు ఓపెనర్‌గానే కాకుండా మూడు, ఆరు నెంబర్లలో ఆడిన అనుభవముంది. వన్డేల్లో కీపర్‌గానూ వ్యవహరించగలడు. ఎన్ని జట్లకు ఇలాంటి ఆటగాడు అందుబాటులో ఉంటాడు? అందుకే రోహిత్ స్థానంలో రాహుల్ ఆడే అవకాశం ఉంది' అని గౌతీ తేల్చాడు. ఇక శార్దూల్ ఠాకూర్‌ను ఎంపిక చేయకపోవడంపై స్పందిస్తూ.. ఆసీస్ పర్యటనకు తాము ఉత్తమ జట్టుతోనే వెళ్లనున్నట్టు వ్యాఖ్యానించాడు. చివరి భారత్ టూర్‌లో ఆల్‌రౌండర్‌గా శార్దూల్ అద్భుతంగా రాణించాడు. మరోవైపు పేసర్ హర్షిత్ రాణాపై పనిభారం పడకూడదనే భారత్ 'ఎ' తరఫున అతడిని ఎంపిక చేయలేదని వివరించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతడికి తగిన ప్రాక్టీస్ లభించిందని గంభీర్ చెప్పాడు.

10 రోజులు చాలు..: ఈనెల 22న తొలి టెస్టు మొదలవనుంది. అయితే భారత జట్టు పది రోజుల ముందే ఈ సుదీర్ఘ సిరీస్ కోసం ఆసీస్‌లో అడుగుపెట్టనుంది. 'మా దగ్గర అనుభవం కలిగిన క్రికెటర్లకు కొదువ లేదు. అలాంటి వాళ్లు యువ ఆటగాళ్లకు సహాయకంగా ఉంటారు. ఈ పది రోజులు మాకు చాలా కీలకం. కానీ 22న ఉదయం నుంచి తొలి బంతి నుంచే చెలరేగేందుకు సిద్ధంగా ఉంటాం' అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

మా గురించి ఆయనకు ఎందుకు?

ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలకు గంభీర్ మద్దతిచ్చాడు. అలాగే ఐదేళ్లలో కేవలం 2 సెంచరీలు చేసిన విరాట్‌కు జట్టులో చోటు అవసరమా? అని ప్రశ్నించిన ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్‌కు గౌతీ కౌంటరిచ్చాడు. 'భారత క్రికెట్‌తో పాంటింగ్‌కు ఏం సంబంధం? అతడు ఆసీస్ గురించి ఆలోచించాలి. ముఖ్యంగా విరాట్, రోహిత్‌పై ఆందోళన అతడికి అనవసరం' అని గంభీర్ సూటిగా తేల్చాడు.

గంభీర్‌తో మాట్లాడించొద్దు

మంజ్రేకర్ సూచన

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు తరఫున కోచ్ గంభీర్ మీడియా సమావేశంలో మాట్లాడడంపై మాజీ ఆటగాడు మంజ్రేకర్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఇంకెప్పుడూ అతడిని ఇలాంటి వాటికి పంపకూడదని బీసీసీఐకి సూచించాడు. 'గంభీర్ మీడియా సమావేశం చూశాను. కానీ మున్ముందు ఇలాంటి బాధ్యతలు అతడికి బీసీసీఐ అప్పగించకూడదు. ఎందుకంటే వారితో మాట్లాడేటప్పుడు ప్రవర్తనాలోపంతో పాటు అతను సరైన పదాలు కూడా వాడలేకపోయాడు. మీడియా భేటీలో మాట్లాడే హక్కు గంభీర్‌కు లేదు. అందుకే అతడిని తెర వెనకాలే ఉంచి రోహిత్ లేక చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌ను మీడియా ముందుకు పంపాలి' అని మంజ్రేకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.



అమ్మాయిల శుభారంభం

- మలేసియాపై ఘన విజయం
- హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్ (బిహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు అద్భుత శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత మహిళల బృందం 4-0 గోల్స్ తేడాతో మలేసియాను చిత్తు చేసింది. యువ స్ట్రయికర్ సంగీతా కుమారి (8వ నిమిషం, 55వ) రెండు గోల్స్‌తో విజృంభించగా.. ప్రీతి దూబె (43వ), ఉదిత (44వ) చెరో గోల్ సాధించారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను దక్షిణ కొరియాతో మంగళవారం తలపడనుంది. ఇతర మ్యాచుల్లో జపాన్, కొరియా జట్ల మధ్య పోరు 2-2తో డ్రాగా ముగియగా.. ఒలింపిక్ రజత పతక విజేత చైనా 15-0తో థాయ్‌లాండ్‌పై అద్భుత విజయం సాధించింది.



రష్మిక @1

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయి శ్రీవల్లి రష్మిక జాతీయ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా నిలిచింది. సోమవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో సింగిల్స్‌లో రష్మిక 209 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మరో తెలుగమ్మాయి సహజ (208) రెండో ర్యాంకులో ఉంది. సానియా, సహజ తర్వాత నెంబర్ వన్ ర్యాంక్ అందుకొన్న తెలుగు క్రీడాకారిణి రష్మికనే.

జ్యోతి సురేఖకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ జేవీడీ ఓపెన్ కింగ్స్ ఆర్చరీ అంతర్జాతీయ పోటీల్లో కాంస్యం పతకం సొంతం చేసుకుంది. సోమవారం నెదర్లాండ్స్‌లోని ఐండ్‌హోవెన్‌లో జరిగిన కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సురేఖ మూడోస్థానంలో నిలిచింది. ఎలీసా (ఇటలీ)కు స్వర్ణం, మార్టియా (ఈస్తోనియా)కు రజతం లభించాయి.

జిమ్నాస్ట్ నిషికకు పతకం



బెల్జియంలోని కీర్‌బ్రైన్ నగరంలో జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో హైదరాబాద్ అమ్మాయి నిషిక అగర్వాల్ కాంస్య పతకం కొల్లగొట్టింది. వాల్ట్ విభాగంలో నిషిక 12.817 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది.

ఉమా మహేష్ బృందానికి స్వర్ణం



ప్రపంచ విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన మద్దినేని ఉమా మహేష్ పతకంతో సత్తా చాటాడు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఉమా మహేష్, ఐశ్వరీప్రతాప్, స్మిత్ రమేష్‌లతో కూడిన భారత బృందం స్వర్ణం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో స్మిత్ రమేష్ రజతం గెలిచాడు.



'ఆమె'గా మారిన సంజయ్ బంగర్ కుమారుడు

ముంబై: భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమారుడు ఆర్యన్ లింగమార్పిడి చేయించుకున్నాడు. 23 ఏళ్ల ఆర్యన్ పదకొండు నెలల పాటు హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ఆర్‌టీ) కొనసాగించాక ఇటీవలే అమ్మాయిగా మారాడు. తన పేరును అనయ బంగర్‌గా మార్చుకున్నాడు. ముంబైలోని ఇస్లాం జింఖానా క్లబ్ తరఫున క్రికెట్ ఆడిన ఆర్యన్.. గతంలో ధోనీ, విరాట్‌తో దిగిన ఫొటోలతో పాటు అమ్మాయిగా మారిన క్రమాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

అర్జున్‌కు మూడోస్థానం


'చెన్నై గ్రాండ్‌మాస్టర్'గా అరవింద్

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్‌కు నిరాశే ఎదురైంది. ఈ టోర్నీలో తొలి ఐదు రౌండ్లలో సత్తాచాటిన అర్జున్ ఆఖరి రెండు రౌండ్లతో పాటు టైబ్రేకర్ పోటీల్లో పరాజయం పాలయ్యాడు. ఫలితంగా అర్జున్ టోర్నీలో మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అరవింద్ చిదంబరం (తమిళనాడు) టైటిల్ దక్కించుకోగా, లెవాన్ అరోనియన్ (అమెరికా) రెండో స్థానంలో నిలిచాడు. చెన్నై చాలెంజర్స్ ఓపెన్ చెస్ ఈవెంట్‌లో ప్రణవ్ (బెంగళూరు) విజేతగా నిలవగా.. తెలుగమ్మాయి హారిక ఏడు, వైశాలి ఎనిమిదో స్థానాలకు పరిమితమయ్యారు.

బరిలో సింధు, సేన్

నేటినుంచి జపాన్ ఓపెన్

కుమమోటో (జపాన్): జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన నాటినుంచి.. గతఫామ్‌ను అందుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న పీవీ సింధు, లక్ష్యసేన్ టోర్నీ బరిలో దిగుతున్నారు. సింగిల్స్ తొలిరౌండ్‌లో 8వ సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్)ను సింధు.. లియాంగ్ జున్ (మలేసియా)ను లక్ష్యసేన్ ఢీకొంటారు. డబుల్స్ మొదటి రౌండ్‌లో సు యిన్/లిన్ యన్ (తైపీ)తో గాయత్రి/ట్రీసా జంట తలపడనుంది.





నెలలు నిండకుండా పుట్టే పిల్లలు సాధారణ పిల్లల్లా ఆరోగ్యంగా ఎదగాలంటే పుట్టింది మొదలు అనుక్షణం పదిలంగా కాపాడుకోవాలి. అందుకు అవసరమైన అత్యాధునిక వైద్య సదుపాయాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే ఆస్పత్రినే ఎంచుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా పిల్లలు నెలలు నిండకుండా పుట్టే పరిస్థితులను తొలగించుకోవాలి. అందుకు ఏం చేయాలో, ఎలా నడుచుకోవాలో వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

నవంబరు 17
వరల్డ్
ప్రిమెచ్యూర్ డే

నెలలు నిండకుండా పుడితే?

తొమ్మిది నెలలు నిండినప్పుడే బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటాడనే విషయం మనందరికీ తెలిసిందే! కానీ కొందరు పిల్లలు 37 నుంచి 40 వారాల కంటే ముందు పుట్టేస్తూ ఉంటారు. ఈ పిల్లలే ప్రిమెచ్యూర్ బేబీస్. అరుదుగా కొన్ని సందర్భాల్లో 24 నుంచి 26 వారాలకే ప్రసవం అయిపోతూ ఉంటుంది. ఈ కోవకు చెందిన పిల్లల పట్ల రెట్టింపు అప్రమత్తతతో వ్యవహరించవలసి ఉంటుంది. నెలలు నిండకుండా పుట్టే పిల్లల్లో ప్రధాన అంతర్గత అవయవాలు పూర్తిగా ఎదిగిన స్థితిలో ఉండవు. ఎంత ముందుగా ప్రసవమైపోతే, పిల్లల్లో సమస్యలు అంత తీవ్రంగా ఉంటాయి. కాబట్టి ఈ పిల్లలకు పుట్టిన వెంటనే తక్షణ వైద్య సహాయం అవసరమవుతుంది.

మొదటి గంటే ప్రధానం

నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు మిగతా పిల్లలతో సమానంగా ఎదగలేరన్నది అపోహ మాత్రమే! పుట్టిన మొదటి గంటలోగా అన్ని వసతులూ ఉన్న ఆస్పత్రిలో వైద్య సేవలను అందించగలిగితే, ఈ పిల్లలు అన్ని విధాలా సాధారణ పిల్లల్లాగే ఎదిగే సామర్థ్యాన్ని సమకూర్చుకోగలుగుతారు. అందుకోసం ఆస్పత్రిలో సరిపడా పరికరాలు, నియో నేటల్ కేర్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది ఉండాలి. పుట్టిన మొదట గంట మీదే బిడ్డ ఆరోగ్యం, భవిష్యత్తు ఆధారపడి ఉంటాయి.

నెలలు నిండకుండా పుట్టే పిల్లల్లో ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగని స్థితిలో ఉంటాయి. కాబట్టి పుట్టిన వెంటనే వెంటిలేటర్ సహాయంతో కృత్రిమ శ్వాసను అందిస్తూ, ఐవి ద్వారా పోషకాలను అందించాలి. అలాగే నాడీవ్యవస్థ మెరుగు పడడం కోసం ఇంక్యుబేటర్ సహాయంతో కృత్రిమ వెచ్చదనాన్ని అందించాలి. 24 వారాలకు పుట్టిన పిల్లలు, 28 వారాలకు పుట్టిన పిల్లల కంటే బలహీనంగా ఉంటారు. తల్లి గర్భంలో బిడ్డ గడిపే ప్రతి రోజూ కీలకమైనదే! కాబట్టి బిడ్డ ఎంత ముందుగా ప్రసవించినా, తల్లి గర్భాన్ని మరిపించే సదుపాయాలు కల్పిస్తూ, తగిన పోషణను కూడా అందించగలిగితే నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు కూడా నెలలు నిండిన తర్వాత పుట్టిన పిల్లలతో సమానంగా ఆరోగ్యంగా ఉంటారు. అయితే అందుకోసం పుట్టింది మొదలు నెలలు నిండేవరకూ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే ఉండవలసి ఉంటుంది.

నెలలు ఎందుకు నిండడం లేదు?

ఇందుకు కారణం బిడ్డలో ఉండవచ్చు, గర్భిణిలో ఉండవచ్చు. తల్లికి అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, మూత్రపిండా ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు, ఉమ్మనీరును ప్రసవానికి ఎంతో ముందగానే కోల్పోయి, ప్రసవం కానప్పుడు నెలలు నిండకుండా పిల్లలు పుట్టే అవకాశాలుంటాయి. కృత్రిమ గర్భధారణలో కూడా ఈ సమస్య ఉంటుంది. అలాగే గర్భంలో బిడ్డ ఎదుగుదల క్షీణించినప్పుడు, బిడ్డలో జన్యుపరమైన సమస్యలు ఉన్నప్పుడు, కవలలు, ముగ్గురు పిల్లలతో గర్భం దాల్చినప్పుడు కూడా పిల్లలు నెలలు నిండకుండా పుట్టే అవకాశాలుంటాయి. అలాగే మొదటిసారి నెలలు నిండకుండా ప్రసవమైపోతే, రెండోసారి కూడా ఇదే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి ఈ పరిస్థితి పునరావృతం అవకుండా ఉండడం కోసం, కారణాన్ని కచ్చితంగా తెలుసుకుని దాన్ని అరికట్టడంతో పాటు, గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో మెలగాలి.



కంగారూ మదర్ కేర్ కీలకం

పుట్టినప్పుడు రెండున్నర కిలోల కంటే తక్కువ బరువుండే పిల్లలకు కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమవుతుంది. మరీ ముఖ్యంగా కేవలం 700 గ్రాముల బరువుతో కూడా పిల్లలు పుడుతూ ఉంటారు. ఇలాంటి పిల్లలకు 'కంగారూ మదర్ కేర్' అవసరమవుతుంది. ఎలాంటి అచ్ఛాదన లేకుండా తల్లీ, బిడ్డా శరీరాలు ఒకదానికొకటి తగిలేలా, తల్లి స్పర్శనూ, వేడినీ బిడ్డ పొందే వెసులుబాటు ఉండే కంగారూ మదర్ కేర్‌తో, బిడ్డ ఎదుగుదల మెరుగ్గా ఉంటుంది. అలాగే తల్లులతోపాటు, తండ్రులూ, అమ్మమ్మ, తాతయ్యలు కూడా కంగారూ మదర్ కేర్‌కు అర్హులే! ఈ కేర్‌తో నాడీ, ఇంద్రియ వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. బిడ్డకు పరిపూర్ణ ప్రయోజనం దక్కడం కోసం రోజు మొత్తంలో 8 నుంచి 10 ఎనిమిది గంటల పాటు కంగారూ మదర్ కేర్‌ను కొనసాగించాలి. ఇలా బిడ్డ బరువు 3 నుంచి 4 కిలోలకు పెరిగేవరకూ కొనసాగించాలి.

అన్ని సదుపాయాలు ఉండేలా...

నెలలు నిండకుండా ప్రసవానికి దారి తీసే ఆరోగ్య సమస్యలున్న గర్భిణులు, ఆరో వారం నుంచే అప్రమత్తంగా ఉండాలి. మొదటి ప్రసవం 24 వారాలకు జరిగిపోతే, రెండో ప్రసవం అంతకంటే రెండు వారాల ముందే జరిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన తల్లులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా తల్లీబిడ్డలు ఇద్దరికీ అవసరమైన వైద్యసేవలు అందుబాటులో ఉండే ఆస్పత్రులనే ఎంచుకోవాలి. అందుకోసం లెవల్ త్రీ ఎన్ఐసియు ఉన్న ఆస్పత్రులనే ఎంచుకోవాలి. ఇలాంటి ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్యులతో పాటు, పసికందుల వైద్యులు కూడా అందుబాటులో ఉంటారు. ఇలా అన్ని జాగ్రత్తలు పాటించగలిగితే తల్లీ బిడ్డా ఆరోగ్యాలను పుంజుకుని, క్షేమంగా ఇంటికి చేరుకోగలుగుతారు.

తల్లి పాలు అమృత సమానం

బిడ్డ వయసుతో సంబంధం లేకుండా పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం మొదలుపెట్టాలి. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు కూడా కచ్చితంగా తల్లి పాలు ఇవ్వవలసి ఉంటుంది. అయితే నెలలు నిండకుండా పిల్లలు పుట్టిన సందర్భాల్లో తల్లికి పాలు ఎక్కువగా తయారు అవకపోవచ్చు. ఆ సందర్భాల్లో బ్రెస్ట్ పంప్ ద్వారా చుక్కల మోతాదులో పాలను సేకరించి, ట్యూబ్ ద్వారా ఎన్ఐసియులో ఉంచిన పసికందుకు అందించవలసి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ పొందిన నర్సులు ఆస్పత్రుల్లో ఉంటారు. అరుదుగా కొన్ని సందర్భాల్లో తల్లి పాలిచ్చే పరిస్థితి లేనప్పుడు, తల్లి పాల బ్యాంక్ నుంచి పాలను తెప్పించి, పసికందుకు పట్టించవలసి ఉంటుంది. ఇలా బిడ్డ ఆస్పత్రిలో ఉన్నంత కాలం, పరిపూర్ణంగా కోలుకునే వరకూ పాల బ్యాంకు నుంచి పాలను ఉచితంగా పొందే సదుపాయం కూడా ఉంది.

గర్భానికి శరీరాన్ని సిద్ధం చేసి...

నెలలు నిండకుండానే ప్రసవమైపోవడానికి తీవ్ర ఆరోగ్య సమస్యలే కారణం కాదు. రక్తలేమితో కూడా ఇలా జరగవచ్చు. ఇతరత్రా ఆరోగ్య సమస్యలేవీ లేకపోయినా, రక్తలేమి కలిగి ఉంటే, నెలలు నిండకుండా ప్రసవమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితికి దారి తీయకుండా ఉండాలంటే గర్భం దాల్చడానికంటే ముందు నుంచే మహిళలు గర్భానికి శరీరాన్ని అన్ని విధాలా సంసిద్ధం చేయాలి. అధిక రక్తపోటు, మధుమేహాలను అదుపులో పెట్టుకోవాలి. ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా చూసుకోవాలి. నెలసరి సమస్యలను సరిదిద్దుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యులు సూచించే రక్తవృద్ధికి తోడ్పడే టానిక్కులు, మల్టీ విటమిన్ సప్లిమెంట్లు తీసుకోవాలి.

ఇంటికి చేరుకున్న తర్వాత...

పూర్తిగా ఆరోగ్యాన్ని పుంజుకుని ఇంటికి చేరుకున్న పసికందులను, ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా పిల్లల వైద్యులకు చూపిస్తూ ఉండాలి. డిస్చార్జ్ అయిన 48 గంటలకు ఒకసారి, తర్వాత వారానికొకసారి, ఆ తర్వాత నెలకొకసారి... ఇలా ఏడాది పాటు వైద్యులకు చూపిస్తూ ఉండాలి. కంటి చూపు, ప్రాణ శక్తి, ఎదుగుదలలను ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి.

- డాక్టర్ నితాషా బగ్గా
పిడియాట్రీషియన్ అండ్ నియోనటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.



చిట్కా

తులసి తింటే?

ఎన్నో దశాబ్దాలుగా సంప్రదాయ వైద్య విధానంలో తులసిని ఉపయోగిస్తున్నారు. దీన్లోని ఔషధగుణాలు కొన్ని రుగ్మతలకు చక్కని విరుగుడుగా పని చేస్తాయి. అవేంటంటే...

- **ఒత్తిడి:** తులసితో శరీరంలోని కార్టిసాల్ మోతాదులు సంతులనమై ఒత్తిడి అదుపులోకొస్తుంది. దాంతో నాడీవ్యవస్థ సామర్థ్యం పెరగడంతో పాటు, మానసిక ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి.
- **వ్యాధినిరోధకశక్తి:** తులసిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీనికి సూక్ష్మజీవులు, ఫంగస్, బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడే గుణాలుంటాయి. కాబట్టి తులసి తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధకశక్తి పెరిగి, వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.
- **జీర్ణశక్తి:** పొట్టలోని ఆమ్ల ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా జీర్ణ ప్రక్రియను మెరుగుపరిచే శక్తి తులసికి ఉంటుంది. కడుపు ఉబ్బరం, అజీర్తిలను తొలగించి జీర్ణక్రియ సాఫీగా సాగడానికి సహాయపడుతుంది.



- **మధుమేహం:** తులసిని క్రమం తప్పక తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర మోతాదులు తగ్గుముఖం పడతాయి. వంశపారంపర్యంగా మధుమేహం సంక్రమించే అవకాశాలున్న వాళ్లు క్రమం తప్పకు తులసిని తింటే, ఈ సమస్య దరి చేరకుండా ఉంటుంది.
- **చర్మం:** దీన్లోని యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి సహాయపడతాయి. మొటిమలు తొలగి, చర్మం కాంతివంతంగా మారుతుంది.
- **ఇలా తినొచ్చు:** తులసి ఆకులను వేడి నీళ్లలో మరిగించి, తేనె కలుపుకుని తాగొచ్చు. సలాడ్స్‌లో కలుపుకుని తినొచ్చు.

కంటి రక్ష

కళ్లు నీళ్లు కారకుండా...

కొంతమంది వెలుగును చూడలేరు. ఎండ వెలుగులోకి వెళ్లగానే కళ్ల నుంచి నీరు కారిపోతూ ఉంటాయి. ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉండేవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల నుంచి కళ్లను రక్షించడం కోసం, కళ్లలో ఉండే, లాక్రిమల్ గ్రంథులు ప్రేరేపితమై కళ్లకు తేమనివ్వడం కోసం నీళ్లను స్రవిస్తాయి. అయితే కొందర్లో ఈ గ్రంథులు అవసరానికి మించి పని చేస్తూ ఉంటాయి. మరీముఖ్యంగా డ్రై ఐ సిండ్రోమ్, అలర్జీలు ఉన్న వాళ్లలో ఈ గ్రంథులు అతిగా స్పందిస్తాయి. దాంతో వెలుగును చూసిన వెంటనే కళ్ల నుంచి నీరు స్రవించడం మొదలుపెడుతుంది. ఈ లక్షణానికి తోడు నొప్పి, మంట, దురద, చూపులో మార్పు లాంటి అదనపు లక్షణాలు కనిపిస్తే, ఆ పరిస్థితిని 'కెరటైటిస్'గా పరిగణించి, వైద్యులను కలవాలి. ఫొటోఫోబియా ఉన్నవాళ్ల కళ్లు వెలుగును తట్టుకోలేవు. ఈ కోవకు చెందినవాళ్లు వెలుగులోకి రాగానే కళ్లను చికిలిస్తూ ఉంటారు. ఈ లక్షణాన్ని కూడా వైద్యులు కచ్చితంగా అంచనా వేయగలుగుతారు. అత్యధిక అతినీలలోహిత కిరణాలకు బహిర్గతం కావడం, గాలి కాలుష్యాల వల్ల కూడా వెలుగుకు కళ్లు అతిగా స్పందించి నీళ్లు కారతాయి. ఇలాంటి సమస్య ఉన్నవాళ్లు అతినీలలోహిత కిరణాలను అడ్డుకునే చలువ కళ్లద్దాలు వాడుకోవడంతో పాటు, వైద్యులు సూచించే కంటి చుక్కలు కూడా వాడుకోవాలి. కళ్లలోని కన్నీటి నాళాలు వాతావరణ ప్రభావాలకు గురి కాకుండా అన్ని వైపులా మూసి ఉండే చలువ కళ్లజోడులను పెట్టుకోవాలి.



వ్యాయామం

6-6-6

నడక ఆరోగ్యకరం. అయితే ఆ నడకకు కూడా ఒక క్రమపద్ధతి ఉండాలి. అప్పుడే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అలాంటి ఒక పద్ధతే 6-6-6. ఈ నడక నియమాలను అనుసరిస్తే అనారోగ్యం దరిచేరదు.

6 నిమిషాల పాటు శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయడం (వార్మప్).. 6 నిమిషాలను చల్లబరచటం.. ఉదయం ఆరు గంటలకు లేదా సాయంత్రం ఆరు గంటలకు 60 నిమిషాల పాటు నడవడమే 6-6-6 నడక నియమం. అంటే రోజుకు 60 నిమిషాలు నడవాలి. ఒకే సారి 60 నిమిషాలు నడవలేకపోతే- ఉదయం 30 నిమిషాలు, సాయంత్రం 30 నిమిషాలు కూడా నడవవచ్చు. ఈ సమయాలు ఉద్యోగులకు సైతం అనువుగా ఉండడం, పొందే ఫలితం మెరుగ్గా ఉండడంతో ఈ కొత్త నడక నియమం ఈ మధ్య కాలంలో సర్వత్రా ఆదరణ పొందుతోంది. ఈ నియమంతో ఎలాంటి ఫలితాలు దక్కుతాయంటే...

ఉదయం నడక

ఉదయం ఆరు గంటలకు నడవడం వల్ల, శరీరంలో కొవ్వు కరిగే వేగం పెరుగుతుంది. ఉదయం శరీరం హుషారుగా ఉంటుంది. కాబట్టి చలాకీగా నడవగలుగుతాం. తాజా గాలి పీలుస్తూ, చకచకా నడవగలుగుతాం! దాంతో రక్తప్రసరణ మెరుగవుతుంది. మనసు ఉల్లాసంగా ఉంటుంది. ఏడు గంటలకు నడక పూర్తయిపోతుంది. కాబట్టి రోజులో చాలా సమయం మిగిలి ఉంటుంది.

సాయంకాలం నడక

రోజు మొత్తంలో శరీరంలో పోగయ్యే ఒత్తిడికి సాయంకాలపు నడక విరుగుడుగా పని చేస్తుంది. నడకతో శరీరం అలసి, రాత్రికి కమ్మని నిద్ర పడుతుంది. రోజంతా కుర్చీలో కూర్చుని ఉద్యోగాలు చేసే వాళ్లు సాయంకాలం గంట పాటు నడవడం వల్ల శరీరంలో చురుకుదనం పెరుగుతుంది. కండరాల నొప్పులు అదుపులోకొస్తాయి.



వారానికి ఐదుసార్లు

గుండె, ఊపిరితిత్తులు బలపడతాయి. శ్వాసకోస సమస్యలు, హృద్రోగాల ముప్పులు దరి చేరకుండా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మానసికోల్లాసం దక్కుతుంది. శరీరం చురుగ్గా మారి, పనులన్నీ సులభంగా చేసుకోగలుగుతాం! అలాగే అదనపు క్యాలరీలు ఖర్చయి, శరీర బరువు అదుపులో ఉంటుంది.

జాగ్రత్తలు

ఒక రోజులో ఎంత సేపు నడవాలనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వయస్సు ఆధారంగా.. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా.. వైద్యుల ఇచ్చే సలహా ఆధారం ఎంత సేపు నడవాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి.

ఛాతీ తెరవకుండా గుండె సర్జరీ

గుండెకు శస్త్రచికిత్స అనగానే ఛాతీ మీద పెద్ద కోత కళ్ల ముందు మెదులుతుంది. పెళ్లీడు యువతకు ఇదొక పెద్ద అవరోధమే! కానీ ఇప్పుడా సమస్య లేదు. తాజా మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలతో పక్కటెముల మధ్య నుంచి గుండెకు చికిత్స చేసే వెసులుబాటు కలుగుతోంది. ఈ శస్త్రచికిత్సకు ఎవరు అర్హులో తెలుసుకుందాం!



ఛాతీ తెరిచి చేసే సంప్రదాయ సర్జరీలతో కోత, కోలుకోడానికి సమయాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా పెద్దల్లో ఎముక అతుక్కోడానికి ఎక్కువ సమయం పడుతూ ఉంటుంది. అలాగే మధుమేహుల్లో కూడా కోత మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇక పెళ్లీడు యువత శరీరం మీద పెద్ద గాటు ఏర్పడుతుందనే భయంతో గుండె సర్జరీలను వాయిదా వేస్తూ ఉంటారు. ఇలా సంప్రదాయ గుండె సర్జరీలకు కొన్ని చిక్కులున్నాయి. వీటిని అధిగమిస్తూ తాజాగా అత్యాధునిక సాంకేతిక పరికరాలు, రోబోట్ల సహాయంతో చిన్న కోతతో గుండెకు శస్త్రచికిత్స చేసే మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు అందుబాటులోకొచ్చాయి.

ఎవరు అర్హులు?

ఈ శస్త్రచికిత్సకు అన్ని వయసుల వాళ్లూ అర్హులే అయినప్పటికీ, పైచర్మానికీ గుండెకూ మధ్య ఉన్న దూరం కీలకంగా మారుతుంది. పక్కటెముకల మధ్య నుంచి కోత పెట్టి, గుండెను చేరుకోవలసి ఉంటుంది కాబట్టి ఆ మార్గం సులువుగా ఉందో లేదో ముందుగానే పరీక్షించుకోవలసి ఉంటుంది. మరీ ముఖ్యంగా తొడ దగ్గరి రక్తనాళం వ్యాసార్థాన్ని ముందుగానే తెలుసుకోవాలి. ఈ రక్తనాళం సన్నగా ఉన్నా, ఛాతీ మరీ వెడల్పుగా ఉన్నా, మినిమల్లీ ఇన్వేసివ్ శస్త్రచికిత్స సాధ్యపడదు. ఈ సమస్యలేవీ లేకుండా భౌతిక ప్రమాణాలన్నీ కుదిరిన వాళ్లకు వయసుతో సంబంధం లేకుండా ఈ చికిత్సను ఎంచుకోవచ్చు.

ఏ సమస్యలకు?

ఇన్‌ఫెక్షన్, పుట్టుకతో వెంట తెచ్చుకునే సమస్యల వల్ల గుండెలోని రెండు ప్రధాన నాళాల్లో ఇబ్బందులు తలెత్తుతూ ఉంటాయి. కొన్నిసార్లు నాళాల్లో అవరోధాలు ఏర్పడవచ్చు లేదంటే వాటి నుంచి రక్తం బయటకు వచ్చేస్తూ ఉండవచ్చు. ఇలాంటప్పుడు నాళాలను మార్చే శస్త్రచికిత్సల కోసం ఈ తరహా విధానాన్ని ఎంచుకోవచ్చు. అలాగే అకస్మాత్తుగా తలెత్తే గుండెపోట్లకు కూడా ఈ విధానాన్ని ఎంచుకోవచ్చు. ఇలా నాళం మరమ్మత్తు, నాళం స్థానంలో కొత్త నాళాన్ని అమర్చడం, కొరొనరీ ఆర్టరీ బైపాస్‌లతో పాటు, పుట్టుకతో వెంట తెచ్చుకునే కొన్ని గుండె జబ్బులకు, మరీ ముఖ్యంగా గుండెలో రంధ్రాలకు కూడా ఈ సర్జరీని ఆశ్రయించవచ్చు. మధుమేహులకు ఈ సర్జరీ ఎంతో ఉపయోగకరం. ఛాతీ ఎముక కత్తిరించి చేసే గుండె శస్త్రచికిత్సతో మధుమేహుల్లో ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. చిన్న కోతతో ఆ ముప్పు తక్కువగా ఉంటుంది.

ప్రయోజనాలు ఎక్కువ

- కోత, నొప్పి, కోలుకునే సమయం తక్కువ
- కోత ఛాతీ పక్కన ఉంటుంది కాబట్టి స్పష్టంగా కనిపించదు
- ఎముక కత్తిరించే అవసరం ఉండదు
- ఆస్పత్రి నుంచి నాలుగు రోజుల్లో ఇంటికి చేరుకోవచ్చు
- ఒకటి రెండు వారాల్లో వాహనాలు నడపవచ్చు

సర్జరీ ఇలా...

ఈ సర్జరీలో ప్రత్యేకమైన పరికరాలను వినియోగిస్తారు. ల్యాప్రోస్కోపిక్ సర్జరీలలో ఉపయోగించే పరికరాలను పోలిన వాటినే ఈ శస్త్రచికిత్సలో కూడా ఉపయోగిస్తారు. అయితే వాటి కంటే ఇవి మరింత సన్నగా ఉంటాయి. కాబట్టి కోత ఐదు నుంచి పది సెంటీమీటర్లకు మించదు. ప్రోబ్స్, వాటి చివర అమర్చి ఉండే కెమెరాలతో గుండెను స్పష్టంగా పరిశీలిస్తూ, వైద్యులు సమర్థంగా చికిత్సను పూర్తి చేయగలుగుతారు. అరుదుగా కొన్ని సందర్భాల్లో, కొంత మందిలో, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ మొదలుపెట్టిన తర్వాత, ఓపెన్ హార్ట్ సర్జరీని ఆశ్రయించక తప్పని పరిస్థితులు కూడా తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో శస్త్రచికిత్స విఫలమైందని అనుకోడానికి వీల్లేదు. కొంతమందిలో అంతర్గత భౌతిక మార్పుల వల్ల ఈ సర్జరీ సాధ్యపడకపోవచ్చు. అలా మినిమల్లీ ఇన్వేసివ్ నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీకి మరలే అవకాశాలు ఐదు నుంచి పది శాతం మేరకే ఉంటాయి.

- డాక్టర్ గిరిధర్ ప్రసాద్
సీనియర్ కార్డియో థొరాసిక్, మినిమల్లీ ఇన్వేసివ్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.





భరోసా ఇచ్చిన బడ్జెట్: పవన్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూపొందించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రూ.1.3 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నప్పటికీ బడ్జెట్‌ను ఎంతో జాగ్రత్తగా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి భరోసా కల్పించేలా రూపొందించారన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సోమవారం వైసీపీకి చెందిన కార్పొరేటర్లు, జడ్పీటీసీ, కౌన్సిలర్లు పలువురు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటానని, తాను ఇచ్చే వ్యక్తినేగానీ తీసుకునే వ్యక్తిని కాదన్నారు. పార్టీకి బలమైన కార్యకర్తలు, ప్రజాదరణ ఉన్నాయన్నారు. టీడీపీ అనుభవం, బీజేపీ మద్దతు భవిష్యత్తులో కూడా రాష్ట్రానికి మేలు కలగజేస్తాయన్నారు. కాగా, విజయవాడ, జగ్గయ్యపేట, పుంగనూరు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి వైసీపీకి చెందిన పలువురు జనసేనలో చేరారు. వారిలో..విజయవాడ 16,48,51,38 డివిజన్ల కార్పొరేటర్లు, జగ్గయ్యపేట నుంచి యేసుపోగు దేవమణి, ధర్మవరానికి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు పార్టీలో చేరారు.



ప్రజారంజక బడ్జెట్: మంత్రి కొలుసు



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థికంగా ఛిద్రమైన పరిస్థితుల్లో.. కూటమి ప్రభుత్వం ప్రజారంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సమాచార మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సోమవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... 'గత ప్రభుత్వం పూర్తిగా అధికార దుర్వినియోగానికి పాల్పడింది. వ్యవస్థలన్నీ నాశనం చేసింది. రాష్ట్ర వనరులను దోపిడీ చేశారు. కేంద్ర నిధుల్ని దారి మళ్లించారు. ఛిద్రమైన రాష్ట్రాన్ని పట్టాలెక్కిస్తారనే నమ్మకంతో కూటమికి ప్రజలు పట్టంగట్టారు. ఎంతో అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు కొత్త పాలసీలు తీసుకొచ్చారు' అని అన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట: మంత్రి సత్యకుమార్



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు, మనోభావాలకు అనుగుణంగా ఉందని వైద్య ఆరోగ్య మంత్రి వై సత్యకుమార్ చెప్పారు. 'గత ఐదేళ్లలో అన్ని రంగాల్ని విధ్వంసం చేస్తే.. దాన్ని సరిజేస్తూ, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు, సంపదను సృష్టిస్తూ, ఇచ్చిన హామీలు అమలు చేస్తూ, బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.18,421 కోట్లు ఆరోగ్యశాఖకు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోల్చిచూస్తే ఇది 23% అధికం. విద్యాశాఖ తర్వాత అత్యధిక కేటాయింపులు ఆరోగ్యశాఖకు జరగడం.. ప్రజారోగ్యం పట్ల ఈ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. గత ప్రభుత్వం రూ.2,500 కోట్లు బకాయి పెట్టిపోయింది. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.1,300 కోట్లు బకాయిలు చెల్లించింది. గత ప్రభుత్వం మూలధన వ్యయం కింద ఐదేళ్లలో రూ.3,970 కోట్లు ఖర్చు చేస్తే.. మా ప్రభుత్వం ఈ ఏడాదికే రూ.2,100 కోట్లు కేటాయించింది. వైద్య కళాశాలల అంశంలో జగన్ చేయనిదానిని చేసినట్లు చెప్పుకొంటున్నారు' అని వివరణాత్మకంగా పేర్కొన్నారు.

రోడ్లపై చర్చకు సిద్ధం: మంత్రి జనార్దన్‌రెడ్డి



అసెంబ్లీకి హాజరు కాని జగన్‌కు కూటమి ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. 'గంగవరం పోర్టులో ప్రభుత్వానికి ఉన్న 10.40% వాటాను కూడా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన జగన్.. పోర్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. గుంతల రహిత రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే.. గుంతల్లో చిడతల మేళం అంటూ జగన్ మీడియాలో వండివార్చిన కథనం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రభుత్వం తరుపున చర్చకు సిద్ధమని, దమ్ముంటే జగన్ తమ సవాల్‌ను స్వీకరించాలి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీకి రూ.14 వేలు కోట్లు కేటాయిస్తే.. రూ.11,469 కోట్లు ఖర్చు చేసింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.16,852 కోట్లు కేటాయించి, కేవలం రూ.7,334 కోట్లే ఖర్చు చేసింది. అందులోనూ రూ.2,300 కోట్లు అప్పులు కూటమి ప్రభుత్వం నెత్తిన పడేసింది. కనీసం గుంతలు కూడా జగన్ పూడ్చలేదు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ గతంలో ఏపీ రోడ్ల గురించి అవహేళనగా మాట్లాడారు' అంటూ గుర్తు చేశారు.

జగన్‌కు నైతికత లేకే డుమ్మా: పంచుమర్తి



జగన్‌కు నైతికత లేకనే అసెంబ్లీకి ఎగ్గొట్టారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. 'జగన్‌కు ప్రతిపక్ష హోదా లేదు. ఆయనకు జనం ఆ హోదా ఇవ్వలేదు. వైసీపీ పాలనలో విధ్వంసం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. చంద్రబాబు గాడిలో పెడతారన్న నమ్మకంతోనే కూటమిని ప్రజలు గెలిపించారు. వైసీపీ నేతల మైండ్ బ్లాంక్ అయ్యింది' అని పంచుమర్తి ఎద్దేవా చేశారు.

స్వర్ణాంధ్ర సాధన దిశగా బడ్జెట్: లంకా దినకర్



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గత పాలన విధ్వంసం నుంచి వికాసంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా బడ్జెట్ ఉందని 20సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ఈ బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం కనపడిందన్నారు. అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం దాదాపు 23 శాతం బడ్జెట్ నిధులు కేటాయింపులు చేయడమంటే, ఈ వర్గాలను స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వామ్యం చేయడమనే చెప్పవచ్చన్నారు. రాష్ట్ర జీడీపీలో 40 శాతంపైగా వాటా ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.43,402 కోట్లు కేటాయించడం ద్వారా రైతు సంక్షేమ ప్రభుత్వంగా కనపడుతుందన్నారు. మాజీ సీఎం బడ్జెట్ సమావేశాలకు మొహం చాటేయడం బాధ్యతారాహిత్యం అని దినకర్ విమర్శించారు.

గిరిజన పక్షపాతి చంద్రబాబు: ధారు నాయక్



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గిరిపుత్రుల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు తూతూమంత్రంగా చేసి గిరిజనులను అభివృద్ధికి దూరం చేసింది. కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రూ.7,557 కోట్లు బడ్జెట్ కేటాయించి ఎస్టీల పక్షపాతిగా, ఎస్టీల అభివృద్ధికి బాటలు వేసేదిగా నిలిచింది' అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'సీఎం చంద్రబాబు గిరిజన పక్షపాతి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఊసే లేదు. రోడ్ల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లు లేక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలీలు కట్టుకుని కొండలు, గుట్టలు దాటాల్సి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిపుత్రుల అభివృద్ధికి శ్రీకారంచుట్టింది' అని అన్నారు.

హామీలకు కేటాయింపులేవీ?: ఎమ్మెల్సీ కల్యాణి



అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగలేదని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. 'ఏడు నెలలుగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో నడిపి, ఇప్పుడు ఫుల్ బడ్జెట్ అంటున్నారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. దానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. అమ్మ ఒడిని కాపీ కొట్టి, ఇద్దరు పిల్లలకు డబ్బులిస్తామని, ఏమీ ఇవ్వలేదు. 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని ఐదు నెలలైనా పథకాన్నే ప్రారంభించలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామని పైసా ఇవ్వలేదు. 20 లక్షల ఉద్యోగాలని కనీసం జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని విమర్శించారు.

అన్నదాతకు అగ్రతాంబూలం

వ్యవసాయం మరింత పరిపుష్టం

- సాగు బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు
- పావలా వడ్డీకి రుణాలు.. యాంత్రీకరణకు 187కోట్లు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో అన్నదాతకు అగ్రతాంబూలం ఇచ్చామని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరైన వ్యవసాయ రంగాన్ని మరింత పరిపుష్టం చేసే దిశగా కేటాయింపులు చేశామన్నారు. సోమవారం శాసనసభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. 'గత ప్రభుత్వం భూసార పరీక్షలను విస్మరించింది. సూక్ష్మపోషకాలు, రాయితీపై వ్యక్తిగత పనిముట్లు ఇవ్వలేదు. రబీలో పంట నష్టపోయిన రైతులకు బీమా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి 100 రోజుల్లోనే భూసార పత్రాలు, పొలం పిలుస్తోంది, ఫార్మర్స్ రిజిస్ట్రీ, డ్రోన్ల వినియోగం, వరద సాయం వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలిచాం. సాగు రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏపీ సాగుదారుల హక్కు చట్టం-2024 తెస్తాం. 50% సబ్సిడీపై ఈ ఏడాది సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలు అందిస్తాం. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187.68 కోట్లు ప్రతిపాదించాం' అని చెప్పారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ.లక్షా66 వేల కోట్లు, అనుబంధ రంగాలకు రూ.98 వేల కోట్ల రుణాలు అందిస్తామని చెప్పారు.

పావలా వడ్డీ రుణాల పునరుద్ధరణ

టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు వెన్నుదన్నుగా ఉన్న పావలా వడ్డీ రుణాలను జగన్ సర్కారు ఎత్తేసింది. ఇప్పుడు మళ్లీ పావలా వడ్డీ రుణాలకు వడ్డీ రాయితీ అమలు చేస్తామని అచ్చెన్నాయుడు ప్రకటించారు. రూ.3 లక్షల వరకు పంట రుణాలు పొంది, ఏడాదిలోగా చెల్లించే రైతులకు రూ.లక్ష వరకు 4%, రూ.1-3లక్షలకు 1% వడ్డీ రాయితీ అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. కొత్త సాగుదారుల హక్కు చట్టం-2024ను తెస్తామని మంత్రి తెలిపారు. అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఇచ్చే 6 వేలతో కలిపి ఏటా రూ.20 వేలు అందించేందుకు బడ్జెట్‌లో 4,500 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

తొలిసారి వ్యవసాయ బడ్జెట్ పెట్టిన అచ్చెన్న


వ్యవసాయ మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు తొలిసారి వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ప్రముఖ కవి గుర్రం జాషువా రైతు గురించి రాసిన పద్యంతో ప్రసంగం ప్రారంభించి.. మధ్యమధ్యలో శ్రీశ్రీ వ్యాఖ్యలను, ఎమ్మెస్ స్వామినాథన్ సూచనలను ప్రస్తావించారు.

11 ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

ఉద్యాన శాఖకు బడ్జెట్‌లో రూ.3,469.47కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కింద 11 ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహించాలని నిర్ణయించింది. నాణ్యమైన మొక్కలు సరఫరా చేసి, ఉద్యాన ఉత్పత్తుల్లో నాణ్యత పెంచి, రైతులకు రాబడి పెంచుతామని 2024-25 బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందుకోసం ఎంఐడీహెచ్ కింద రూ.331.41 కోట్లతో కార్యాచరణ రూపొందించినట్లు తెలిపింది. పంట వైవిధ్యం ద్వారా వ్యవసాయ పంటల నుంచి 1.73లక్షల ఎకరాలను వాణిజ్య, ఉద్యాన పంటల కిందకు తేస్తామని తెలిపింది. ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి రూ.373.93 కోట్లు కేటాయించింది. సూక్ష్మసేద్యం కిందకి 7.50 లక్షల ఎకరాలు తెస్తామని, సూక్ష్మసేద్య పరికరాల రాయితీకి రూ.2,700 కోట్లతో వార్షిక ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొంది.

90% రాయితీపై గోకులాలు

పశుసంవర్ధక శాఖ పథకాల్లో భాగంగా గోకులం పథకం ద్వారా ఈ ఏడాది ఉపాధి హామీ పథకం నిధులతో పేద పశుపోషకులకు 90% రాయితీపై పశువుల షెడ్లు, 70%రాయితీపై గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం 26 జిల్లాలకు రూ.13 కోట్లు కేటాయించింది. యాదవ, కురుబ, కురుమ మహిళా పశుపోషకులకు గొర్రెలు, మేకల కొనుగోలులో 40% రాయితీ ప్రకటించింది. మత్స్యకారుల మరబోట్లకు రాయితీ డీజిల్‌కు రూ.5వేల కోట్లు ప్రతిపాదించారు. ఎన్టీఆర్ జలసిరి కింద 20వేల బోర్లు వేసేందుకు 300 కోట్లు, 15వేల మోటార్ల పంపిణీకి రూ.225 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు.



వ్యవసాయ, అనుబంధ శాఖలకు కేటాయింపులు (రూ.కోట్లలో)

నీటి ప్రాజెక్టుల నిర్వహణ	14,637.03
వ్యవసాయ శాఖ	8,546.37
సాగు విద్యుత్	7,241.30
ఉపాధి హామీ పథకం	5,150.00
ఉద్యాన	3,469.47
పశుసంవర్ధక	1,095.71
మత్స్య	521.34
మార్కెటింగ్	314.80
సహకారం	308.26
పట్టుపరిశ్రమ	108.44
విశ్వవిద్యాలయాలకు..	
వ్యవసాయ యూనివర్సిటీ	507.03
పశువైద్య	171.72
ఉద్యాన	102.22
మత్స్య	38.00
రైతు సంక్షేమ పథకాలకు..	
అన్నదాతా సుఖీభవ	4,500
పంటల బీమా	1,023
వడ్డీలేని, పావలా వడ్డీ రుణాలు	628
ప్రకృతి వ్యవసాయం	422.96
ఆయిల్‌పామ్	373.93
రాయితీ విత్తన పంపిణీ	240.00
వ్యవసాయ యాంత్రీకరణ	187.68
ఎన్టీఆర్ జలసిరి	50.00
డిజిటల్ వ్యవసాయం	44.77
అగ్రిల్యాబ్స్	44.03
ఎరువుల నిల్వ	40.00
భూసార పరీక్ష కార్డులు	38.88
రైతుసేవా కేంద్రాలు	26.92
పొలం పిలుస్తోంది	11.31



సాగు అనుబంధానికి 43,402 కోట్లు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త బడ్జెట్‌లో వీటికి రూ.43,402.33 కోట్లు కేటాయించింది. వ్యవసాయ అనుబంధ శాఖల బడ్జెట్‌ను సోమవారం శాసనసభలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శాసనమండలిలో మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశపెట్టారు. అన్నదాతా సుఖీభవ పథకానికి రూ.4,500 కోట్లు ప్రతిపాదించారు. పంటల బీమాకు 1,023 కోట్లు, ఉద్యానం 3,469 కోట్లు, పశుసంవర్ధక శాఖకు 1,095 కోట్లు కేటాయించారు. జగన్ సర్కారు 2023-24లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.41,436.29 కోట్లతో బడ్జెట్ పెట్టగా.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రూ.1,966.04 కోట్లు అదనంగా కేటాయించడం గమనార్హం. వ్యవసాయ విద్యుత్ రంగానికి గతేడాది బడ్జెట్‌లో రూ.5,500 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత ప్రభుత్వం రూ.7,241.30 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ఉపాధి హామీ పథకం అమలుకు గత ప్రభుత్వం రూ.5,100 కోట్లు కేటాయించగా.. కూటమి సర్కారు రూ.5,150 కోట్లు ప్రతిపాదించింది. ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్, సహకార, మత్స్య శాఖలకు, పట్టుపరిశ్రమకు కూడా కేటాయింపులు పెరిగాయి.

వైసీపీ ఎమ్మెల్యేలు రాకపోతే

చట్టం తన పని తాను చేస్తుంది

- జగన్‌కు ప్రతిపక్ష హోదా రాకపోయినా అంతే
- సభకు రాని వాళ్లతో మనకెందుకు: స్పీకర్ అయ్యన్న

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వాళ్లు సభకు రాకపోయినా, జగన్‌కు ప్రతిపక్ష హోదా రాకపోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. అసెంబ్లీలో సంఖ్యా బలం ఆధారంగానే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, గతంలో చాలా మంది సంఖ్యా బలం లేకపోయినా ప్రతిపక్ష హోదా కావాలని కోర్టుకు వెళ్లారని వ్యాఖ్యానించారు. కోర్టులు కూడా సంఖ్యా బలం ఆధారంగానే ప్రతిపక్ష హోదా లభిస్తుందని స్పష్టంగా చెప్పాయని వివరించారు. 'ఏ విషయంలోనైనా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఇదే నా సిద్ధం' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. బీఏసీ సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన కాసేపు ముచ్చటించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రావడం లేదని మీడియా ప్రతినిధులు అడగగా, ఆయన స్పందించారు. రాని వాళ్లతో మనకెందుకు అంటూ వ్యాఖ్యానించారు. దేనికైనా చట్టం తన పని తాను చేసుకుంటుందని, వైఎస్ రాజశేఖర రెడ్డిని ఏ విషయం గురించి అడిగినా ఇదే మాట అనేవారని గుర్తుచేశారు. తమది కూడా అదే మాటని అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్న అడగాల్సిన ఎమ్మెల్యేలు సభకు వచ్చి వెంటనే వెళ్లిపోవాలన్న వైసీపీ నిర్ణయం గురించి మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ... వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే పూర్తి సమయం సభలో ఉండాలని, కాసేపు ఉండిపోయేదానికి రావడమెందుకని, దీనిని అసెంబ్లీని బహిష్కరించడమని అంటారా అని వ్యాఖ్యానించారు.



భోజనంపై స్పీకర్ సీరియస్

అసెంబ్లీలో భోజనం బాగా లేకపోవడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ అంటే తమాషా అనుకుంటున్నారా? అని అధికారులు, కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. ఒక్క ఎమ్మెల్యే అయినా భోజనం బాగుందన్నారా? సభ్యులకు ఒకలా, ఇతరులకు మరోలా భోజనం పెట్టారా? అని నిలదీశారు. అందరికీ ఒకేలా భోజనం పెట్టామని, కానీ అన్నం మాత్రమే మారిందని అధికారులు వివరణ ఇచ్చారు. ఒకేలా భోజనం పెడితే తానెందుకు నిలదీస్తానని స్పీకర్ అన్నారు. తనకు ఎందుకు ఫిర్యాదులు వచ్చాయో సమాధానం చెప్పాలన్నారు.

రేపు సెలవిస్తున్నా.. బడ్జెట్ చదువుకోండి

'కొత్త సభ్యులకు బడ్జెట్ అర్థం అవ్వాలి. బడ్జెట్‌పై అవగాహన రావాలంటే స్టడీ చెయ్యాలి. రేపు సెలవు ఇస్తున్నా.. చదువుకుని రండి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ్యులకు సూచించారు. సభలో మంత్రులు బడ్జెట్ ప్రవేశపెట్టాక స్పీకర్ మాట్లాడారు. 'మొదటిసారి ఎమ్మెల్యేలు అయిన వారు 84 మంది, రెండోసారి గెలిచినవారు 39 మంది ఉన్నారు. కొత్తగా వచ్చిన వారికి సాధారణ బడ్జెట్ అంటే ఏంటి? వ్యవసాయ బడ్జెట్ అంటే ఏంటి? అనేది అర్థమవ్వాలి. ఇది నా రిక్వెస్ట్.. రేపు జరగబోయే చర్చలో మీరు మాట్లాడాలి. సలహాలు కూడా ఇవ్వాలి. మీ అవగాహన కోసం రేపు అసెంబ్లీకి సెలవు ఇస్తున్నా. 13, 14న చర్చ ఉంటుంది. అందరూ బడ్జెట్‌పై చర్చలో పాల్గొనాలి' అన్నారు. చదువుకోవడానికి సెలవు ఇస్తున్నారా అధ్యక్షా అని ఉండి ఎమ్మెల్యే రఘురామరాజు అనడంతో.. 'అవును తప్పేం లేదుగా' అన్నారు. దీంతో సీఎం చంద్రబాబు సహా పలువురు నవ్వారు. సభ్యులతో పాటు బయటి వ్యక్తులు ఎక్కువగా లోపలికి వస్తున్నారని, అసెంబ్లీ ప్రాంగణంలోకి ఇష్టానుసారం రానీయవద్దని ఎమ్మెల్యేలకు స్పీకర్ సూచించారు.



శాసనసభా వ్యవహారాల కమిటీ సమావేశంలో స్పీకర్ అయ్యన్న, సీఎం చంద్రబాబు, మంత్రులు కేశవ్, నాదెండ్ల, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

అసెంబ్లీ 11 రోజులు

- 22వ తేదీ వరకూ సమావేశాలు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 11 రోజుల పాటు నిర్వహించాలని బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 22 వరకూ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో బీఏసీ సమావేశం జరిగింది. బుధవారం నుంచి 22వ తేదీ వరకూ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 17వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు సభకు సెలవు. మొత్తం 11 రోజుల పాటు జరిగే సమావేశాల్లో బడ్జెట్‌పై చర్చించడంతో పాటు పలు కీలకమైన బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. సమావేశాలు 15 రోజుల పాటు నిర్వహించాలని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించారు. అయితే అన్ని రోజుల పాటు సభ నిర్వహణకు కొన్ని ఇబ్బందులు ఉండడంతో 11 రోజులే నిర్వహించాలని నిర్ణయించారు. బీజేపీ విన్నపం మేరకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సభ నిర్వహిద్దామన్న స్పీకర్ ప్రతిపాదనను సీఎం ఆమోదించారు. బుధ, గురు, శుక్రవారాల్లో సభను సాయంత్రం వరకూ కొనసాగిస్తారు. బీఏసీ సమావేశంలో సీఎం చంద్రబాబు, ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

సభ ఎవరి కోసమూ ఆగదు: సీఎం

అసెంబ్లీ సమావేశాలు ఎవరి కోసమూ ఆగవని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బీఏసీ సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోవడం చర్చకు వచ్చింది. దీనిపై స్పందించిన సీఎం.. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని, ఎవరి కోసమో కాదని అన్నారు. ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన చర్చ జరగాలన్నారు. బీఏసీ సమావేశంలో రుషికొండ ప్యాలెస్‌పై చర్చ జరిగింది. రుషికొండ ప్యాలెస్‌ను సీఎం అధికారిక నివాసంగా పేర్కొంటూ జీవో విడుదలైందని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. జీవో ఇచ్చినందున మనం రుషికొండ ప్యాలెస్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉందని సరదాగా అన్నారు. చంద్రబాబు స్పందిస్తూ... 'ఆ ముఖ్యమంత్రి లేరుగా' అంటూ నవ్వుతూ బదులిచ్చారు.

మండలి ముద్దు.. సభ వద్దు

- శాసనమండలికి హాజరైన వైసీపీ.. శాసనసభకు మాత్రం దూరం
- పార్టీ భిన్న వైఖరిపై విమర్శలు.. తాడేపల్లిలో ఎమ్మెల్యేలతో జగన్ భేటీ



అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ముద్దు, శాసనసభ వద్దు అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. శాసనమండలిలో వైసీపీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. శాసనసభలో ప్రతిపక్ష హోదాకు తగినంత మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీకి లేరు. దీంతో శాసనసభలో ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న సాకుతో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి సభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, వైసీపీ ఎమ్మెల్సీలు ఉదయం పది గంటలకల్లా శాసనమండలికి చేరుకున్నారు. కాగా జగన్ తాడేపల్లి నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో 10 మంది ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. మధ్యాహ్నం 3గంటలకు మరోసారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. సోమవారం ఉదయం మాక్ అసెంబ్లీని నిర్వహిస్తారని భావించినా ఆయన ఆ ఊసెత్తలేదు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు, సభలో మైకు ఇచ్చేందుకు కూడా కూటమి ప్రభుత్వం భయపడుతోందని ఎమ్మెల్యేలతో జగన్ వాఖ్యానించారు. అసెంబ్లీకి రాకపోవడంపై విమర్శలు రావడంతో తాను పదవి కోసం పట్టుబట్టడం లేదని, ప్రతిపక్షనేత హోదా ఉంటేనే ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అడిగినప్పుడల్లా మైకు ఇస్తారని జగన్ వివరణ ఇచ్చుకుంటున్నారు. అయితే శాసనసభకు వెళ్లనప్పుడు ఎమ్మెల్యే పదవి ఎందుకని, రాజీనామా చేయాలని విమర్శలు వస్తున్నాయి.

నేడు ఎమ్మెల్యేలకు బడ్జెట్‌పై శిక్షణ

- హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో శాఖల వారీగా కేటాయింపులు, సూపర్ సిక్స్ పథకాలపై ఎన్డీయే ఎమ్మెల్యేలకు కూటమి ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ వేదికగా పీఆర్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని 164 మంది ఎమ్మెల్యేలకు ఇప్పటికే సమాచారం అందించారు. రాష్ట్ర బడ్జెట్ ఎలా ఉంది? ఏయే అంశాలపై సభలో చర్చించాలి? బడ్జెట్‌పై ప్రసంగం ఎలా చేయాలి? అన్న దానిపై శిక్షణ ఇస్తారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారు. ఆ తర్వాత రెండు గంటలకు ఎన్డీయేఎల్పీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు పలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

ఎన్టీఆర్‌కు చంద్రబాబు నివాళి



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు, పక్కన పల్లా శ్రీనివాస్, పార్థసారథి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనిని ప్రత్యేక సందర్భంగా భావించిన చంద్రబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అసెంబ్లీకి వెళ్లే మార్గమధ్యలో వెంకటపాలెం వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆగారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్, ఇతర నేతలు పూలమాలలు వేశారు.



● వెంకన్న సన్నిధిలో కేశవ్

అమరావతి/తుళ్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు అమరావతి రాజధానిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. బడ్జెట్ పత్రాలను వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో తొలిసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన కేశవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విధానాలను స్పష్టంగా వివరిస్తూనే, గత ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఎత్తిచూపారని కొనియాడారు.



● 58 నిమిషాల్లో బడ్జెట్

అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కాగా, 10.09 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సభలోకి అడుగు పెట్టారు. 10.11 గంటలకు సభలోకి వచ్చిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు 10.12 గంటలకు సభ్యులతో కలసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సిందిగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. మంత్రి బడ్జెట్ ప్రసంగాన్ని 58 నిమిషాల్లోనే (11.11 గంటలకు) పూర్తి చేశారు.

● రంగు మారింది!

వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వానికి, అసెంబ్లీకి సంబంధించి ఎలాంటి పుస్తకాలు వచ్చినా వైసీపీ రంగులు పులిమేసేవారు. చివరికి బడ్జెట్ ప్రతులకు కూడా బులుగు రంగులు కనిపించేవి. ప్రభుత్వం మారడంతో రంగు మారింది. ఏ పార్టీకి సంబంధం లేకుండా, అందంగా బడ్జెట్ ప్రతులను ముద్రించారు. దీంతో పలువురు సభ్యులు బులుగు, నీలం రంగుల బాధ తప్పిందని వ్యాఖ్యానించారు.

ఆర్థిక పునరుజ్జీవమే లక్ష్యంగా..

2,94,427.25 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

2024-25 ఆర్థిక పద్దు ప్రవేశ పెట్టిన మంత్రి కేశవ్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టింది. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో పతనం అంచుల్లోకి నెట్టిన రాష్ట్రానికి ఆర్థిక పునరుజ్జీవం పోయడమే బడ్జెట్ లక్ష్యమని ప్రకటించింది. సరళమైన ప్రభుత్వం ప్రతిభావంతమైన పాలన అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2,94,427.25కోట్ల పద్దు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. శాఖల వారీగా కేటాయింపులు, రెవెన్యూ-మూలధన వ్యయం, జీఎస్‌డీపీ-ద్రవ్యలోటు గురించి తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. ఇందులో రెవెన్యూ వ్యయం 2.34లక్షల కోట్లు కాగా, మూలధన వ్యయం 32,712 కోట్ల రూపాయలు. అయితే ద్రవ్యలోటు 68,743కోట్లు ఉండొచ్చని ఆర్థిక మంత్రి సభలో వెల్లడించారు. జీఎస్‌డీపీలో రెవెన్యూ లోటు 4.19శాతం, ద్రవ్యలోటు 2.12శాతంగా ఉండొచ్చని వివరించారు.

అది ఒక చీకటి అధ్యాయం

'ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకోండి' అంటూ ముఖ్యమంత్రి తరచూ చెప్పే మాటలు స్ఫూర్తిగా తీసుకుని పని చేస్తాం. రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా 57శాతం ఓట్లేసి 93శాతం సీట్లు(164) ఎన్డీఏ కూటమికి ఇవ్వడం చంద్రబాబు నాయకత్వానికి, దూరదృష్టికి... జనసేనాని పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ నాయకత్వానికి తార్కాణం. విభజన తర్వాత దిక్కుతోచని స్థితిలో ఉన్న రాష్ట్రాన్ని 2014-19 మధ్య వ్యవసాయం, పరిశ్రమలు, నీటిపారుదల, రోడ్లు, ఉపాధి తదితర రంగాల్లో చంద్రబాబు వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్లారు. అందుకు సాక్ష్యమే కియా, నదుల అనుసంధానం... అన్ని రంగాల్లోనూ సంస్కరణలతోపాటు బహుముఖ వ్యూహంతో రాష్ట్రం సుస్థిర ఆర్థికాభివృద్ధి పథంలో పయనించింది. అయితే 2019తర్వాత జరిగిన పరిణామాలు రాష్ట్రానికి ఒక చీకటి అధ్యాయం. ప్రజావేదిక కూల్చడం నుంచి పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేయడం వరకూ ఎన్నో అరాచకాల వల్ల తిరోగమనంలోకి వెళ్లాం"

'సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలే...'

'సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలే...అనే అవగాహనతో కూటమి ప్రభుత్వం ముందుకుపోతోంది. రాష్ట్ర విభజన జరిగిన మొదటి ఐదేళ్లలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఉంది. కానీ, గడిచిన ఐదేళ్లలో గడ్డుస్థితికి చేరుకుంది. వనరుల దుర్వినియోగం, నిధుల పక్కదారి, పేలవమైన పాలనతో రాష్ట్రంలోని ఆస్తుల్ని తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చింది. వైసీపీ అధికారం నుంచి వైదొలగే నాటికి (జూన్ 2024) ఉద్యోగులకు 21,980కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు 4,657కోట్ల బకాయిలు ఉన్నాయి. పాలన ఆర్థిక సూత్రాలతో కాకుండా వ్యక్తి ప్రయోజనాలతో ప్రైవేటు సంస్థలా నడిచింది. సహజ వనరులు కొల్లగొట్టడం, అధిక పన్నులు వేసిన దుష్పరిపాలనలతో ప్రజలు దారుణమైన కష్టాలు పడ్డారు. ప్రజల గొంతు నులిమి, ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీసిన కక్షసాధింపు పాలనకు జనం చరమగీతం పాడారు. 'సవ రా జవే ం దే వా లయ ం, ప్రజలే దేవుళ్లు' అని నమ్మే పార్టీని ఆశీర్వదించారు"

రూపాయి రాక ₹

రాష్ట్ర పన్నులు - సుంకాలు	54.6
కేంద్ర పన్నుల్లో వాటా	25.0
పన్నేతర ఆదాయం	20.4
అంకెలు	పైసల్లో..

రూపాయి పోక ₹

అభివృద్ధి వ్యయం	80.8
వడ్డీ చెల్లింపులు	14.6
పరిపాలనా వ్యయం	7.4
పన్ను వసూళ్ల వ్యయం	0.7
ఇతరత్రా వ్యయం	13.8
లోటు	(-)17.3

సూపర్ సిక్స్ అమలు...

"ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎన్డీఏ ప్రభుత్వం అమలుచేస్తోంది. రైతుల సమగ్ర అభివృద్ధి కోసం పెట్టుబడి సాయం అందించడమే 'అన్నదాత సుఖీభవ' లక్ష్యం. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్లో 11,855కోట్లు కేటాయించాం. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా 64.38లక్షల మందికి నెలకు నాలుగు వేల నుంచి పదిహేను వేల రూపాయల వరకూ 'ఎన్టీఆర్ భరోసా' అమలవుతోంది. రజకులు, దూదేకులు, వడ్డెర, వాల్మీకి, గౌడ, కళింగ, గవర, పద్మశాలి, బెస్త, ఉప్పర నాయీ బ్రాహ్మణులు వంటి సంప్రదాయ వృత్తుల్లో ఉన్న కార్మికుల జీవనోపాధిని పెంపొందిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీల కాంపోనెంట్‌కు 18,497కోట్లు, ఎస్టీలకు 7,557కోట్లు, బీ ిస ల క ి [illegible] 39,007కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల 'సంక్షేమానికి' 4,376కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం"

దీపం-2తో ఉచిత సిలెండర్లు..

"ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపం 2 పథకం ద్వారా మహిళలకు ఏటా మూడు వంట గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇచ్చేపథకాన్ని ప్రారంభించాం. ప్రజా రవాణా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలో అమలు చేస్తాం. 'తల్లికి వందనం' కోసం నిధులు కేటాయిస్తాం. అమరావతి, తిరుపతి, విశాఖపట్నంలో మూడు విజ్ఞాన నగరాల ఏర్పాటే లక్ష్యం"

మహనీయుల అడుగుజాడల్లో..

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో మహనీయుల సూక్తులను ఉదహరించారు. రాష్ట్రంలో 20లక్షల మందికి ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు నైపుణ్య గణన నిర్వహిస్తున్నామని చెబుతూ.. చైనా తత్వవేత్త సూక్తిని ప్రస్తావించారు. "ఒక వ్యక్తికి ఆహారంగా చేపను ఇవ్వడం కన్నా చేపను పట్టడం నేర్పించు" అన్న ఆ తత్వవేత్త దారిలోనే ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. రైతుల సమగ్ర అభివృద్ధి కోసం 'అన్నదాత సుఖీభవ' పథకం తెచ్చామని చెబుతూ.. "వ్యవసాయం చేసే చేతులకు మనం సాయం చేయాలి" అన్న ప్రముఖ సంఘ సంస్కర్త వీరేశలింగం వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఆర్థిక క్రమశిక్షణ ఎంత అవసరమో చెప్పే సందర్భంలో కౌటిల్యుడి మాటలను ప్రస్తావించారు. "సంపదకు మూలం ఆర్థిక కార్యకలాపాలే. అవి లేకుంటే వనరుల సమీకరణ ఇబ్బందులు తెచ్చిపెడుతుంది..ప్రస్తుత శ్రేయస్సు, భవిష్యత్ వృద్ధి రెండూ నాశనమయ్యే ప్రమాదం ఉంది" అన్న కౌటిల్యుడి హెచ్చరికలను గత ప్రభుత్వం విస్మరించిందని, తమ ప్రభుత్వం వాటిని శిరసావహిస్తోందని మంత్రి తెలిపారు. కాగా, కేశవ్ బడ్జెట్ ప్రసంగం అనంతరం సభలో వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. సాధారణ బడ్జెట్‌ను శాసనమండలిలో మంత్రి కొల్లు రవీంద్ర, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి పి. నారాయణ ప్రవేశపెట్టారు.

కలల రాజధాని సాకారం దిశగా..

"ఐదేళ్లుగా కనుమరుగైన మన రాష్ట్ర కలల రాజధాని అమరావతి సాకారం దిశగా ఎన్డీఏ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది..రాజధాని నగర అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రం నుంచి పదిహేను వేలకోట్ల రూపాయలు పొందింది. 189కిలోమీటర్ల ఓఆర్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పునరుద్ధరణకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపింది"

త్వరిత గతిన పోలవరం పూర్తి..

పోలవరంతోపాటు పలు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసే ప్రణాళికలో భాగంగా జలవనరుల శాఖకు 16,705కోట్లు బడ్జెట్‌లో కేటాయించాం. రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చేందుకు పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0తీసుకొస్తున్నాం."

ఆరోగ్యశాఖకు 18,421 కోట్లు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖకు బడ్జెట్‌లో మంచి ప్రాధాన్యం ఇచ్చింది. ఎప్పుడూ లేని విధంగా ఆ శాఖకు రూ.18,421 కోట్లు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం గతేడాది రూ.15,882 కోట్లు కేటాయించగా, కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అంతకంటే దాదాపు 3 వేల కోట్లు అదనంగా కేటాయింపులు చేసింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు అత్యధికంగా రూ.9,177 కోట్లు కేటాయించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు రూ.2,619 కోట్లు, కుటుంబ సంక్షేమ విభాగానికి రూ.4,764 కోట్లు కేటాయించారు.

రూ. కోట్లలో	
బడ్జెట్ మొత్తం	2,94,427
రెవెన్యూ లోటు	34,743
ద్రవ్య లోటు	68,742

శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపులు

వివిధ శాఖలు	రూ. కోట్లు
పాఠశాల విద్య	29,909
వ్యవసాయం, అనుబంధ రంగాలు	11,855
ఎస్సీ సంక్షేమం	18,497
ఎస్టీ సంక్షేమం	7,557
బీసీ సంక్షేమం	39,007
మైనార్టీల సంక్షేమం	4,376
మహిళా శిశు సంక్షేమం	4,285
మానవ వనరుల అభివృద్ధి	1215
ఉన్నత విద్య	2,326
ఆరోగ్య రంగం	18,421
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	16,739
పట్టణాభివృద్ధి	11,490
గృహనిర్మాణం	4,012
జలవనరులు	16,705
పరిశ్రమలు, వాణిజ్యం	3,127
ఇంధనరంగం	8,207
రవాణా, రోడ్లు, భవనాలు	9,554
యువజన, పర్యాటక, సాంస్కృతికం	322
పోలీస్ శాఖ	8,495
పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతికశాఖ	687

సంక్షేమం.. అభివృద్ధి!

(మొదట పేజీ తరువాయి)

కేటాయించారు. పెన్షన్లు, దీపం 2.0, అన్న క్యాంటీన్లు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చారు.

రాష్ట్ర ఖాతాలోనే అమరావతి అప్పు...

రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఇస్తున్న అప్పును రాష్ట్ర బడ్జెట్లో అప్పుల ఖాతాలోనే చూపించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమరావతి అప్పు కింద రూ.3,000 కోట్లను అంచనా వేశారు. కేంద్రం నుంచి వచ్చే రుణాలు రూ.18,249 కోట్లు చూపించారు. ఇందులో రూ.3,000 కోట్లు అమరావతికి వచ్చే అప్పు! మిగిలినవి రహదారులు, విద్యా రంగానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలిచ్చే దీర్ఘకాలిక లోన్లు ఉన్నాయి. అప్పుల అసలు కోసం రూ.24,498.98 కోట్లు, వాటి వడ్డీల కోసం రూ.28,754.32 కోట్లు చెల్లించాలని పేర్కొన్నారు. పబ్లిక్ డెట్ రూ.5,60,094.25 కోట్లు. ఇది జీఎస్‌డీపీలో 34.14 శాతం. కార్పొరేషన్ల అప్పుల వివరాలు, వాటి వడ్డీల చెల్లింపుల వివరాలు బడ్జెట్లో చెప్పలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పులు రూ.1,54,797.11 కోట్లున్నాయి. ఇందులో విద్యుత్ రంగానికి సంబంధించినవి రూ.48,638.59 కోట్లు కాగా, మిగిలిన రంగాలు తెచ్చుకున్న గ్యారంటీ అప్పులు రూ.1,06,158.52 కోట్లున్నాయి.

అంకెల్లో జాగ్రత్త....

బడ్జెట్ తయారీలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. ముఖ్యంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఆధారంగా బడ్జెట్‌ను నియంత్రించారు. ఆదాయానికి, ఖర్చుకు మధ్య వ్యత్యాసం తగ్గించడం కోసం వీలైనంత మేరకు బడ్జెట్ పరిమాణం కుదించినట్టు అర్థమవుతోంది. కేపిటల్ వ్యయం రూ.32,000 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటి వరకు చెల్లించిన బిల్లుల ఆధారంగా చూస్తే... ఈ అంచనాలు చేరుకునే సంకేతాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అత్యధిక కేపిటల్ వ్యయం రూ.18,000 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వం దీన్ని రెండింతలకు పెంచడం గమనార్హం. అలాగే, కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల గ్రాంట్లు వస్తాయని అంచనా వేశారు. గత ఏడాది రూ.34,500 కోట్లు వచ్చాయి. అయితే... 2014-15కి సంబంధించిన రెవెన్యూ లోటు గ్రాంటు రూ.10,500 కోట్లను కేంద్రం గత ఏడాది విడుదల చేయడంతో ఈ మొత్తం భారీగా పెరిగింది. ఈ ఏడాది అలాంటిది లేకుండానే... రూ.30,000 కోట్లుగా అంచనా వేయడం మంచి పరిణామమే!

అంత ఆదాయం సాధ్యమేనా?

రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో వచ్చిన ఆదాయం రూ.68,000 కోట్లు మాత్రమే. మిగిలింది ఆరు నెలల లెక్కలే. దీంతో... 2 లక్షల కోట్ల ఆదాయం సాధించడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇక.. అప్పులు రూ.94 వేల కోట్లుగా చూపించారు. ఆదాయం అనుకున్నంత రాకపోతే... ఆ మేరకు అదనంగా అప్పులు తేవాల్సి ఉంటుంది.

ఎందుకింత ఆలస్యం...

పలు ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో... అసాధారణ రీతిలో నవంబరులో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడ్డాయి. 12వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. అప్పటికే అమలులో ఉన్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్.. జూలై 31వ తేదీన ముగిసిపోయింది. సాధారణంగా కేంద్ర బడ్జెట్లోని కేటాయింపులు, ప్రాధాన్యాల ఆధారంగా రాష్ట్రాలు బడ్జెట్ రూపొందించుకుంటాయి. ఏపీ విషయానికొచ్చేసరికి అమరావతి, పోలవరం అత్యంత కీలకం. ఈ రెండు ప్రాజెక్టులను కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై స్పష్టత లేకుండా రాష్ట్ర బడ్జెట్ రూపొందించడం కష్టమని కూటమి సర్కారు భావించింది. పైగా జగన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ భ్రష్టుపట్టింది. ఎక్కడి నుంచి ఎంత అప్పు తెచ్చారు, ఏ శాఖలో ఎన్ని పెండింగ్ బిల్లులున్నాయి, ఏ పథకం నిధులు ఏ పనులకు మళ్లించారు, ఖజానాకు రావాల్సిన పన్నులను ఏయే కార్పొరేషన్లకు మళ్లించారు, రాష్ట్ర ఆస్తులు ఎక్కడెక్కడ తాకట్టు పెట్టి, ఎన్ని అప్పులు తెచ్చారన్న స్పష్టత లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రయ్యే నాటికి ఆర్థిక వ్యవస్థ గందరగోళంగా ఉంది. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడానికి ఇవన్నీ ప్రతిబంధకాలుగా మారాయి. జూలై 31 తర్వాత మరో 4 నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు ప్రతిపాదన పంపి ఆర్డినెన్సు తెచ్చారు. ఈ నాలుగు నెలల సమయంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై స్పష్టతకు వచ్చారు. కేంద్రంతో పలుమార్లు చర్చించి పోలవరం, అమరావతికి రావాల్సిన నిధులపై ఒక స్పష్టతకు వచ్చి, మరో 4 నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందనగా ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం




వివరం	2022-23	2023-24 (బ.అం)	2023-24 (స.అం)	2024-25 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	1,57,768	2,06,224	1,73,767	2,01,173
ఎ)పన్ను ఆదాయం	78,089	1,02,651	85,978	1,09,872
బి) పన్నేతర ఆదాయం	5,417	15,400	7,432	10,576
సి) కేంద్ర పన్నుల్లో వాటా	38,113	41,338	45,655	50,391
డి) గ్రాంట్లు	36,149	46,835	34,702	30,334
2) మూలధన వసూళ్లు	68,085	73,055	79,775	93,254
3) మొత్తం వసూళ్లు	2,25,853	2,79,279	2,53,542	2,94,427
4) రెవెన్యూ వ్యయం	2,01,255	2,28,541	2,12,450	2,35,917
5) మూలధన వ్యయం	7,244	31,061	23,330	32,713
6) రుణాలు, వడ్డీ చెల్లింపు	17,343	19,677	17,776	25,797
7) మొత్తం వ్యయం	2,25,842	2,79,279	2,53,556	2,94,427
8) రెవెన్యూ లోటు	-43,487	-22,316	-38,682	(-)34,743

బ.అం.- బడ్జెట్ అంచనా (అంకెలు రూ. కోట్లలో)
స.అం.- సవరించిన అంచనా

బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆనవాయితీ ప్రకారం మంత్రివర్గ ఆమోదం తీసుకోవాలి. సోమవారం ఉదయం అసెంబ్లీలో సీఎం చంద్రబాబు చాంబర్‌లో మంత్రివర్గ సమావేశం జరిగింది. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం బడ్జెట్‌ను గవర్నర్ ఆమోదించాలి. గవర్నర్ నగరంలో లేకపోవడంతో ఈ ఫైలింగ్ ద్వారా ఆమోదం పొందారు. ఆ తర్వాత అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ప్రవేశ పెట్టారు.

అప్పులే అప్పులు



సంవత్సరం	అప్పు(రూ.కోట్లలో)	జీఎస్‌డీపీలో %
2017-18	2,23,705	27.83
2018-19	2,57,509	28.02
2019-20	3,01,802	31.02
2020-21	3,50,556	35.53
2021-22	3,78,086	31.46
2022-23	4,29,525	32.60
2023-24 (స.అం.)	4,91,734	33.71
2024-25 (బ.అం.)	5,60,094	34.14

స.అం.: సవరించిన అంచనా
బ.అం.: బడ్జెట్ అంచనా

జలకళ కోసం.. కాసుల గలగల

కీలక ప్రాజెక్టులకు కేటాయింపులివీ..


(రూ.కోట్లలో)

ప్రాజెక్టు	2023-24	2024-25
పోలవరం	438	5,448.62
గాలేరు-నగరి	2,072	2,888
హంద్రీ-నీవా	339	1,867
వెలిగొండ	27	393
తోటపల్లి-పుష్కర	154	303
తెలుగుగంగ	674	887.54
సోమశిల	246	249
పులివెందుల కెనాల్	186	395
కృష్ణా బేసిన్	195	234
ఉత్తర కోస్తా ఇరిగేషన్	185	234
వంశధార	52	59
నాగార్జున సాగర్	108	137
అనంతపురం ప్రాజెక్టులు	486	2,014
కర్నూలు ప్రాజెక్టులు	445	561
కడప ప్రాజెక్టులు	2,383	2,888
ఉత్తర కోస్తా ప్రాజెక్టులు	195	234
ఒంగోలు ఇరిగేషన్	217	581
తుంగభద్ర బోర్డు	122	52
మేజర్ ఇరిగేషన్, వరద నివారణ	216	548
కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్	203	185
మైనర్ ఇరిగేషన్	841	1,018

పోలవరానికి పండగే

- రూ.5,448 కోట్లు కేటాయింపు
- జలవనరుల శాఖకు 16,705 కోట్లు
- నిరుడు జగన్ హయాంలో 11,908 కోట్లు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు జలకళ వచ్చేలా కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జల వనరుల శాఖకు రూ.16,705 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో ప్రధాన వాటా పోలవరం ప్రాజెక్టుకే. దానికి రూ.5,448.62 కోట్లు కేటాయించారు. అలాగే రాయలసీమ ప్రాజెక్టుల పనులు శరవేగంగా సాగేలా నిధులు ప్రతిపాదించారు. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కనీసం ప్రాజెక్టుల నిర్వహణకు కూడా నిధులివ్వలేదు. ఇప్పుడు ప్రాధాన్య పథకాలకు పెద్దపీట వేయడంతో పాటు అన్ని ప్రాజెక్టుల నిర్వహణకూ కేటాయింపులు జరిపారు. జగన్ ప్రభుత్వం జలవనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించింది. తర్వాత చేపట్టిన సవరణల్లో తొలిసారిగా కేటాయించిన నిధులను రూ.8,371 కోట్లకు కుదించింది. తగ్గించిన ఈ నిధులను కూడా ఇవ్వకపోవడంతో ప్రాజెక్టులన్నీ పడకేశాయి. తాజా బడ్జెట్‌లో కర్నూలు ప్రాజెక్టులకు రూ.561.94 కోట్లు, అనంత ప్రాజెక్టులకు రూ.2,014 కోట్లు, కడప ప్రాజెక్టులకు రూ.2,889 కోట్లు, తెలుగుగంగకు రూ.887 కోట్లు. గాలేరు-నగరికి రూ.2,439 కోట్లు, హంద్రీ-నీవాకు రూ.812 కోట్లు, పులివెందుల కెనాల్-305 కోట్లు, తుంగభద్ర హెచ్ఎల్‌సీ-22 కోట్లు, ఎల్ఎల్‌సీ-31 కోట్లు ప్రతిపాదించారు.





సోమవారం విజయవాడలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం-2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, సత్యకుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపీ లక్ష్మణరావులతో పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

టీచర్లను వైసీపీ అవమానించింది!

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం విజయవాడలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం వాస్తవానికి సెప్టెంబరు 5నే జరగాల్సి ఉన్నా విజయవాడ వరదల కారణంగా వాయిదా పడిందన్నారు. దేశంలో ఐఐటీల వ్యవస్థకు నాంది పలికిన వ్యక్తి దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తెలిపారు. ఆంగ్ల భాష మన విద్యార్థులకు డబ్బు సంపాదించుకోవడానికి ఉపయోగపడుతుందని, అలాగని మాతృభాష తెలుగును విస్మరిస్తే జాతి మనుగడ కష్టమవుతుందని చెప్పారు. అందువల్ల రెండు భాషలను సమతుల్యం చేసుకోవాలన్నారు. ఇక్కడ సాధారణ బడుల్లో చదివి నేడు అమెరికాలో అమెరికన్ల కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నవారు ఉన్నారంటే.. అందుకు గురువులే కారణమని చెప్పారు. టీడీపీ కూటమి 93 శాతం సీట్లతో విజయం సాధించిందంటే అందులో వారి పాత్ర కూడా ఉందన్నారు. 'తెలుగుదేశం ప్రభుత్వం మొత్తంగా 11 డీఎస్సీలు ఇచ్చింది. వాటిలో ఎనిమిదింటిని నేను సీఎంగా ఉండగా ఇచ్చాను. ఇప్పుడు నాలుగోసారి సీఎం అయ్యాక తొలి సంతకం డీఎస్సీ ఫైలు పైనే పెట్టా. ఒకప్పుడు జిల్లా పరిషత్ ఛైర్మన్లు సిగరెట్ ప్యాకెట్లపై టీచర్ల బదిలీలకు సిఫారసు చీటీలు రాసేవారు. ఆ అవమానాలు ఉండకూడదనే కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టాం. టీచర్లకు అన్ని రకాలుగా మా ప్రభుత్వం అండగా ఉంటుంది. భావి తరాలను వారు ఉన్నతంగా తీర్చిదిద్దాలి. వారు కూడా నిత్యం విద్యార్థిలా కొత్త విషయాలు నేర్చుకోవాలి. నేను రిక్షావాలా చెప్పినా దానిని ఎలా అమలుచేయాలనే కోణంలో ఆలోచిస్తూ నిత్య విద్యార్థిగా ఉంటాను' అని తెలిపారు.

164 మందికి అవార్డులు..

రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులు 164 మందికి దక్కాయి. వారిలో పాఠశాల విద్య టీచర్లు 68 మంది, జూనియర్ లెక్చరర్లు 25 మంది, ఉన్నత విద్యలో 55 మంది లెక్చరర్లు, సాంకేతిక విద్య లెక్చరర్లు 16 మంది ఉన్నారు. వీరితో పాటు ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఇద్దరికి కూడా అవార్డులు అందజేశారు. అవార్డు కింద రూ.20 వేల చెక్, మెడల్, ప్రశంసాపత్రం ఇచ్చారు.

..అందుకే చాగంటి నియామకం

భారతదేశంలో ప్రపంచంలో ఎక్కడా లేని గొప్ప కుటుంబ వ్యవస్థ ఉందని చంద్రబాబు అన్నారు. అయితే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో అందుకు భిన్నంగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆ సంస్కృతిని తొలగించి మంచి విలువలు పెంచేందుకే ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించామని తెలిపారు. వచ్చే నాలుగైదేళ్లలో ఏపీ నాలెడ్జ్ హబ్‌గా మారాలన్నారు. నాలెడ్జ్ ఆధారిత ఎకానమీ పెరగాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖలను విజ్ఞాన కేంద్రాలుగా తయారుచేస్తామన్నారు. 2047 నాటికి తెలుగు జాతి ప్రపంచంలోనే గొప్ప జాతిగా ఎదగాలనేది లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. రూ.1.35 లక్షల కోట్ల బిల్లులు చెల్లించకుండా ఆపేసిందన్నారు.

జనాభా పెంపుపై నవ్వులు

'ఒకప్పుడు నేనే జనాభా నియంత్రణ అవసరమని ప్రచారం చేశాను. ఇప్పుడు అనేక దేశాలు, దక్షిణ భారతదేశంలో జనాభా తగ్గిపోతోంది. మానవ వనరుల అవసరం చాలా ఉంది. అందుకు తగ్గట్టుగా జనాభా పెరగాలి. టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు 12 మంది పిల్లలున్నారు. ఆయన కూడా పిల్లలను కనాలని ప్రచారం చేస్తున్నాడు. ఒకప్పుడు ఇద్దరికి మించి పిల్లలుంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చట్టం చేశాం. ఇప్పుడు ముగ్గురు ఉంటేనే పోటీకి అర్హులని నిబంధనలు తేవాలేమో' అని సీఎం అనగానే సభలో నవ్వులు పూశాయి. ఒకప్పుడు ఎయిడ్స్‌పై అవగాహన కోసం బ్రేక్ సైలెన్స్ అనేవాళ్లమని, ఇప్పుడు జనాభా పెంపుపై టీచర్లు సైలెన్స్ బ్రేక్ చేసి సమాజంలో అవగాహన కల్పించాలని పిలుపిచ్చారు.

నా నెత్తిన 6,500 కోట్ల అప్పు పెట్టారు

- టీచర్లు తలచుకుంటే ప్రైవేటు బడులు క్లోజ్: లోకేశ్

మాజీ సీఎం జగన్ రాత్రిపూట ఆత్మలతో మాట్లాడి, తెల్లవారగానే అనాలోచిత నిర్ణయాలు తీసుకునేవారని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రధాన సభలో ఆయన మాట్లాడుతూ.. 'నేను కూడా సీబీఎస్ఈ విద్యార్థినే. పరీక్షలు వస్తున్నాయంటే మా అమ్మ ఎక్కువ భయపడేది. ఇక్కడ కూడా సీబీఎస్ఈపై అంచనా కోసం పరీక్షలు నిర్వహిస్తే 90శాతానికి పైగా విద్యార్థులు ఫెయిలయ్యారు. టోఫెల్, ఐబీ అంటూ ఆచరణ సాధ్యంకాని సంస్కరణలు ప్రవేశపెట్టి కోట్ల రూపాయలు వృథా చేశారు. చివరకు నా నెత్తిన రూ.6500 కోట్ల అప్పులు పెట్టి వెళ్లారు' అని వ్యాఖ్యానించారు. మొదట తాను విద్యాశాఖ తీసుకున్నప్పుడు, ఇందులో ఇబ్బందులు ఎక్కువ ఉంటాయని శాఖ మార్చుకోవాలని చాలా మంది సలహాలిచ్చారని, కానీ సవాల్‌గా భావించి దీనిని తీసుకున్నానని చెప్పారు. ఐదేళ్లలో ఏపీ విద్యా విధానం అంటే ఇదీ అనుకునేలా మారుస్తామన్నారు. 'నా బలం, బలగం టీచర్లే. వారు తలచుకుంటే ప్రైవేటు బడులు మూతపడిపోతాయి. శనివారం నో బ్యాగ్ డేగా ఉంచాలని నిర్ణయించాం' అని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారి కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జల డైరెక్షన్

(మొదటి పేజీ తరువాయి)

కడపలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి డీఐజీ కోయ ప్రవీణ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. సోషల్ మీడియాలో వైసీపీ వికృత చేష్టలన్నీ.. సజ్జల భార్గవ్ రెడ్డితోపాటు అర్జున్‌రెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి నుంచి నడిచాయని డీఐజీ తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, హోం మంత్రి, ఇతర మహిళా నేతలపై సోషల్ మీడియాలో వీళ్లు వాడిన భాష నీచం, ఘోరం! గల్ఫ్ దేశాలలో అయితే ఊరిమధ్యలో పెట్టి రాళ్లతో కొట్టే శిక్ష విధించే వారు. మీడియా సమక్షంలో ఆ పోస్టులను చదివేందుకు నా సభ్యత, సంస్కారం అడ్డు వస్తున్నాయి. వర్రా రవీంద్రరెడ్డి భారతీ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండే వాడు. 2012లో ఉద్యోగం మానేశాడు. అప్పటి ప్రభుత్వం చిన్న వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్ అధిపతిగా నియమించింది. వైసీపీ సోషల్ మీడియాలో ఆయన కీలక పాత్ర పోషించారు. వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా వివేకానంద రెడ్డి, కో కన్వీనర్‌గా వర్రా రవీంద్రా రెడ్డి ఉండేవారు. సజ్జల భార్గవ్‌రెడ్డి చేతుల్లోకి వైసీపీ సోషల్ మీడియా వెళ్లాక వీరందరి బూతుపురాణం ప్రారంభమైంది. 'జగనన్న కనెక్ట్' పేరుతో వైసీపీ సోషల్ మీడియా విభాగం నడిచింది. దానికి 2022 నుంచి సజ్జల భార్గవ రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. భార్గవ్ రెడ్డితోపాటు మరికొందరి ఆదేశాల మేరకు ఇతరులు పని చేస్తారు. మూడు రాజధానుల విషయంలో జడ్జిలపై కూడా పోస్టులు పెట్టారు. సోషల్ మీడియాలో వీరి వికృత చేష్టలు చెప్పలేం. ఇవన్నీ సజ్జల భార్గవ్ రెడ్డి, అర్జున్ రెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి నుంచి నడిచాయి. ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌తోపాటు మరో కార్పొరేషన్ ద్వారా ఉద్యోగులను నియమించుకుని... వారిని వైసీపీ సోషల్ మీడియా కోసం వాడుకున్నారు. వీరిలో ఐడ్రీమ్ నుంచి 60 మంది, అవినాశ్ రెడ్డి పీఏ బండి రాఘవ రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి ద్వారా 65 మంది ఉన్నారు. వీరికి అప్పటి ప్రభుత్వం నుంచి నిధులు మళ్లించి డబ్బులు ఇచ్చే వారు. వీరికి 40 యూట్యూబ్ చానళ్లు ఉన్నాయి. 400లకుపైగా సోషల్ అకౌంట్ హ్యాండిల్స్‌ను నిర్వహిస్తున్నారు. తాడేపల్లిలోని పీవీఎస్ ఐకాన్ బిల్డింగ్ మూడో ఫ్లోరులోని వైసీపీ సోషల్ మీడియా కార్యాలయం నుంచి మొత్తం కార్యకలాపాలు జరిపారు. ఈ ముఠాలో 45 మందిని గుర్తించాం. పంచ్ ప్రభాకర్, జగనన్న సైన్యం (వెంకటేశ్ బాడి), ఇడ్లీ సాంబార్ (హరికృష్ణా రెడ్డి), రెడ్డిగారి అమ్మాయి వంటి ఖాతాలతోపాటు... బేతంపూడి నాని, కేసరి రాజశేఖర్ రెడ్డి, ఇందుకూరి శ్రీనివాసరాజు, రామాల మన్విత్ కృష్ణా రెడ్డి, మలకా అమరనాథ్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, ఇంటూరి రవి కిరణ్, షేక్ జాను, జగదీశ్వర్ రెడ్డి ఆళ్ల, శ్రీనివాసరెడ్డి, జింకల రామాంజనేయులు, ఎన్.బాలాజీ రెడ్డి, భార్గవ రెడ్డి, మునగాల హరీశ్వర్ రెడ్డి.. తదితరులు సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన సందేశాలు పోస్టు చేసినట్లు విచారణలో గుర్తించాం. కొందరి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు తీసుకుని వారి పేరుతో వైసీపీ సోషల్ మీడియా కార్యాలయంలోనే కొన్ని పోస్టులు పెట్టేవారు.



అరెస్టయిన వర్రా రవీంద్రరెడ్డి, గుర్రంపాటి వెంకటసుబ్బారెడ్డి, గురజాల ఉదయ్‌కుమార్ రెడ్డి

అవినాశ్ రెడ్డి 'డిక్టేషన్'తో...

ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి వాట్సాప్ ద్వారా పంపిన 'కంటెంట్'ను సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు వర్రా రవీంద్రా రెడ్డి తన వాంగ్మూలంలో అంగీకరించాడు. అవినాశ్ రెడ్డి చెప్పింది రాసుకుని దానినే రాఘవరెడ్డి తనకు పంపించేవాడని వర్రా చెప్పాడు. షర్మిల, వైఎస్ సునీత, వైఎస్ విజయలక్ష్మిపై పెట్టిన పోస్టులు అవేనని తెలిపాడు. పులివెందులకు చెందిన ఒక వ్యక్తి అప్పటి సీఎంను ప్రశ్నిస్తే కులం పేరుతో అతడిని దూషించారు. మంద కృష్ణ తల్లిపై అసభ్యకరంగా వారు పోస్టులు పెట్టారు. దీనికి సంబంధించి బండి రాఘవ రెడ్డిపై కూడా కేసు నమోదు చేశాం. షర్మిల, సునీతల పోస్టులకు సంబంధించిన కేసులు తెలంగాణలో ఉన్నాయి. అవి ఇక్కడికి బదిలీ అయితే రాఘవరెడ్డిపై చర్యలు తీసుకుంటాం. సుమోటో కింద కేసు నమోదు చేయలేం. వర్రాపై రాష్ట్రవ్యాప్తంగా 40 కేసులు ఉన్నాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లోనే 10 కేసులు ఉన్నాయి. వర్రాను మరింత లోతుగా విచారించేందుకు కస్టడీకి కోరుతాం.

అరెస్టు ఇలా...

కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి నాలుగురోజుల క్రితం వర్రాకు 41ఏ నోటీసు ఇచ్చాము. రాజంపేటకు సంబంధించిన కేసులో వర్రాను కస్టడీలోకి తీసుకోలేక పోవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఆదివారం మార్కాపురం వద్ద వర్రా రవీంద్రరెడ్డితో పాటు అతడికి సహకరించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లికి చెందిన గుర్రంపాటి వెంకట సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లికి చెందిన గురజాల ఉదయ్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కారును స్వాధీనం చేసుకున్నాం!

నిర్బంధంలో ఎవరూ లేరు!

- నిందితులను మేజిస్ట్రేట్ ముందు పెట్టాం: ఎస్‌జీపీ విష్ణుతేజ
- ఫుటేజీను మేజిస్ట్రేట్ ముందు ఉంచండి: హైకోర్టు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్బంధాల్లో ఎవరూ లేరని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలతో నమోదైన కేసుల్లో అదుపులోకి తీసుకున్నవారి విషయంలో పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని తెలిపింది. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి. విష్ణుతేజ సోమవారం హైకోర్టుకు వివరించారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం నిందితుల అరెస్ట్ చూపించిన పోలీస్ స్టేషన్ల సీసీటీవీ ఫుటేజ్‌ను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావులతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

తిరుపతి లోకేశ్‌ను నిర్బంధించలేదు: ఎస్‌జీపీ

- లోకేశ్ కోసం భార్యను బెదిరించారు.. పిటిషనర్ తరఫు లాయర్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలతో నమోదైన కేసులో విశాఖపట్నానికి చెందిన నిందితుడు తిరుపతి లోకేశ్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించలేదని ఎస్‌జీపీ టి. విష్ణుతేజ హైకోర్టుకు నివేదించారు. లోకేశ్‌ను ధర్మాసనం ముందు హాజరు పరచేందుకు ప్రయత్నించి పోలీసులు విఫలమయ్యారన్నారు. ఫోనులో అందుబాటులోకి రాలేదని చెప్పారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా విజయవాడ సైబర్ పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను సీల్డ్ కవర్‌లో విజయవాడ మేజిస్ట్రేట్ కోర్టు ముందు ఉంచినట్టు చెప్పారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించారనే ఆరోపణలతో లోకేశ్ కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషనర్ వేశారు. విచారణ జరిపిన ధర్మాసనం లోకేశ్‌ను సోమవారం కోర్టు ముందు హాజరుపర్చాలని పోలీసులను ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా లోకేశ్ తరఫున న్యాయవాది సి. సుమన్ స్పందిస్తూ.. పిటిషనర్ అరెస్టు విషయంలో గతంలో తాము ఈ నెల 5న అరెస్ట్ చేసినట్లు కోర్టుకు తెలిపామని, కానీ, ఈ నెల 6న విశాఖపట్నంలో లోకేశ్‌ను అరెస్ట్ చేసి విజయవాడకు తరలించారన్నారు. అనంతరం విజయవాడ డీసీపీ(టాస్క్‌ఫోర్స్) ఆఫీస్‌లో నిర్బంధించారన్నారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లోకేశ్ కోర్టు ముందు హాజరయ్యేలా చూడాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పోలీసులు ఆయన భార్యకు ఫోను చేసి బెదిరించారని తెలిపారు. ఎస్‌జీపీ విష్ణు స్పందిస్తూ.. నిందితుడి ఆరోపణలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచితే అన్నింటికీ సమాధానం చెబుతామన్నారు. హైకోర్టు ధర్మాసనం స్పందిస్తూ ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ నెల 8వ తేదీ వరకు డీసీపీ(టాస్క్‌ఫోర్స్) ఆఫీసు సీసీటీవీ ఫుటేజ్‌ను సీల్డ్ కవర్‌లో విజయవాడ మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని ఆదేశించింది.

రామ్‌గోపాల్ వర్మపై కేసులు

- మద్దిపాడు, తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో నమోదు

ఒంగోలు క్రైం, తుళ్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు, గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వర్మ రూపొందించిన 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, బ్రాహ్మణి, పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఫొటోలు తమ నాయకుల వ్యక్తిత్వాలను కించపరిచేలా ఉన్నాయని పేర్కొంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వర్మపై ఐటీ యాక్టు కింది కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. కాగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టిన రాంగోపాల్ వర్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు సోమవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అసభ్య పోస్టులపై ఉక్కుపాదం

- పంచ్ ప్రభాకర్ సహా పలువురిపై రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదు
- నారా లోకేశ్‌ను కించపరుస్తూ పోస్టు పెట్టిన వ్యక్తికి రిమాండ్
- వైసీపీ మాజీ మంత్రి కాకాణిని 2 గంటలు విచారించిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఇతర మంత్రులు సహా వారి కుటుంబాల్లోని మహిళలపై బండ బూతులతో విరుచుకుపడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరాచక శక్తులను గుర్తించి కేసులు పెడుతున్నారు. ఇప్పటికే కొందరిని అరెస్టు చేయగా మరింత మందిని అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు. పలు జిల్లాల్లో కొత్తగా మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. ఇదిలావుంటే, వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పోలీసులు రెండు గంటలపాటు విచారించారు. టీడీపీ నేతలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంపై ఆయనను ప్రశ్నించారు. మూడు నెలల క్రితం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లిపాకుల పెంచలయ్య నెల్లూరులో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సర్వేపల్లి ఎమ్మెల్యే, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాటిని కాకాణి తన వ్యక్తిగత ఫోన్ నుంచి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, ఇటీవల తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో కాకాణి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్య లు చేశారు. దీనిపై తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులకు సంబంధించి కాకాణికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో దాదాపు రెండున్నర గంటలకు పైగా కాకాణిని పలు కోణాల్లో విచారించారు. విశాఖ జిల్లా, గాజువాక మండలానికి చెందిన బోడి వెంకటేశ్‌ను బాపట్ల జిల్లా మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అతనికి అద్దంకి కోర్టు రిమాండ్ విధించగా ఒంగోలు జైలుకు తరలించారు. వైసీపీకి చెందిన వెంకటేశ్ తిరుమల అన్నప్రసాదంలో జెర్రి వచ్చిందని, అలాగే మంత్రి నారా లోకేశ్‌ను కించపరుస్తూ, అసభ్యకరంగా ఫొటోను పోస్టు చేశారు. మరోవైపు విదేశాల్లో ఉంటూ టీడీపీ, జనసేన నాయకులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడే పంచ్ ప్రభాకర్‌పై కేసు నమోదైంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితపై ప్రభాకర్ అసభ్య పోస్టులు పెట్టడంతోపాటు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రకాశం జిల్లా చందలూరుకు చెందిన మురకొండ సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. సోషల్ మీడియాలో వైసీపీ తరఫున యాక్టివ్‌గా ఉండే పెద్దిరెడ్డి సుధారాణిపై చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పెరుగు ముద్దుకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



నెల్లూరు జిల్లా వెంకటాచలం పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సైబర్ నేరాలపై రాజీపడం: డీజీపీ

తిరుపతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సైబర్ నేరాలను కట్టడి చేసే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 'సైబర్ క్రైం, డ్రగ్స్ క్రైం- అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్' అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. సైబర్, డ్రగ్స్ వంటి నేరాలతోపాటు, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు అందరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. నేరాలు రూపాంతరం చెందుతున్నాయని, సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నాయని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు ఉంచకపోవడం మంచిదన్నారు. ప్రతి జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు డీజీపీ చెప్పారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గ్రంథి ఇంట్లో భారీగా బంగారం, డబ్బు స్వాధీనం

- 25 మంది ఐటీ అధికారులు.. ఆరు రోజులు సోదాలు

భీమవరం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంతోపాటు వ్యాపార భాగస్వాములు, సన్నిహితులు నివాసాల్లో ఆదివారం అర్ధరాత్రితో ఐటీ దాడులు ముగిశాయి. మద్రాసు నుంచి వచ్చిన సుమారు 25 మంది ఐటీ అధికారులు ఆరు రోజులుగా దాడులు కొనసాగించారు. మిగిలిన ఏడుగురు నివాసాల్లో కూడా దాడులు ముగిశాయి. సుమారు 10 కేజీల బంగారం, భారీగా డాక్యుమెంట్లు, ఫైల్స్ తీసుకుళ్లినట్టు సమాచారం. అయితే అధికారులు మీడియాతో మాట్లాడానికి నిరాకరించారు. సంజన డెవలపర్స్ యజమాని నివాసంలో 61 లక్షలు సీజ్ చేసినట్టు తెలిసింది. ఆస్తులకు సంబంధించిన ఎటువంటి డాక్యుమెంట్లు, పత్రాలు సీజ్ చెయ్యలేదని సమాచారం. అలాగే మరో వ్యక్తి నివాసంలో 2 కేజీల బంగారం, భారీగా నగదు, మెంటేవారితోటకు చెందిన వ్యక్తి నివాసంలో 2 కేజీల బంగారం, డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు సమాచారం.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన సజ్జల భార్గవ్‌రెడ్డి

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా, గుడివాడ పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసుకు సంబంధించిన తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణిని దూషిస్తూ కృష్ణా జిల్లా, గుడివాడకు చెందిన మహ్మద్ ఖాజాబాబా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ గుడివాడ, బాపూజీ నగర్‌కు చెందిన ఆకునూరి శ్రీరాం కనకాంబరం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ నెల 3న కేసు పెట్టారు. ఖాజాబాబాను అరెస్ట్ చేసి విచారించగా... సజ్జల భార్గవ్‌రెడ్డి ఆదేశాలతోనే పోస్టులు పెట్టామని ఖాజాబాబా చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు సజ్జల భార్గవ్‌రెడ్డిని ఈ కేసులో మొదటి నిందితుడిగా చేర్చారు.

సమాజమే అండగా మాదిగల విజయం

- రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ వర్గీకరణను త్వరగా అమలు చేయాలి
- మంద కృష్ణ మాదిగ డిమాండ్
- ఒంగోలులో మాదిగల ఆత్మీయ సమావేశం



మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఒంగోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా 30 ఏళ్లుగా సాగించిన ఉద్యమానికి సమాజమే అండగా నిలిచిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఒంగోలు నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ నేతృత్వంలో ఒంగోలులో సోమవారం నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన మాదిగ జాతి కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. ఉద్యమ పురిటిగడ్డ ప్రకాశం జిల్లాలో మొదలైన వర్గీకరణ పోరాటం అనంతరకాలంలో దేశంలో ప్రధాన చర్చగా మారిందని తెలిపారు. కాగా, ఎస్సీల్లో 59 కులాలుంటే తాము అందరికీ సమాన ఫలాలు అందాలని పోరాటం చూశామని, కానీ, మాల సోదరులు కొందరు వ్యతిరేక ప్రచారాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వెనుక టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు ఉన్నారని దుష్ప్రచారం చేశారని అన్నారు. 1994, జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భవిస్తే అప్పట్లో విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆ తర్వాత ఎన్టీఆర్ సీఎంగా ఉన్నారని తెలిపారు. ఆ సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఎవరికీ తెలియదన్నారు. తాము పోరాడే సమయానికి చంద్రబాబు సీఎం అయ్యారని పేర్కొన్నారు. మాదిగలు ఎదగడాన్ని ఓర్వలేక ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను మాలలు ఒక్కరే అనుభవించాలని చూశారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకించారని తెలిపారు. ఇలాంటి సమయంలోనే 58 ఉపకులాలు ఏకతాటిపైకి వచ్చి హక్కుల కోసం పోరాడాయని వివరించారు. తమకు మాలలు తప్ప అన్ని సామాజికవర్గాలు, సమాజం అండగా నిలిచిందని కృష్ణమాదిగ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. త్వరితగతిన రెండు తెలుగు రాష్ట్రప్రభుత్వాలు వర్గీకరణను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిలమూరి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు భిక్షాలు పాల్గొన్నారు. కాగా, సభ ప్రారంభంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం, అలాగే దివ్యాంగుల కోసం, చిన్నారుల గుండె ఆపరేషన్ కోసం చేసిన ఉద్యమాలను ఎల్ఈడీ తెరపై ప్రదర్శించారు. ఈ సమయంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానం ప్రదర్శన వీక్షిస్తూ మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.

మైనార్టీలకు మా ప్రభుత్వంలో న్యాయం: మంత్రి ఫరూక్

- పలు బాధిత కుటుంబాలకు సాయం

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేస్తే కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. సోమవారం విజయవాడలో జరిగిన మైనార్టీ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మైనార్టీలకు పలు వరాలను ప్రకటించారు. 2020 ఆగస్టులో హత్యకు గురయిన కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడుకు చెందిన హజీర కుటుంబానికి, చిత్తూరు జిల్లా పలమనేరులో మిస్బా కుటుంబానికి చెరో రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించారు. విజయవాడ ఎంబార్కేషన్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారికి రూ.లక్ష చొప్పున సబ్సిడీని ప్రకటించారు. పాస్టర్లు, మౌజమ్‌లకు ఏడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేయనున్నట్టు తెలిపారు. అనంతపురం జిల్లాలో మృతి చెందిన అబ్దుల్లా భార్యకు, చీరాల వీర్లపాలెంలో అమిన్ హరీఫ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. చంద్రన్న మదర్సా విద్యాపథకంలో 550 మంది వలంటీర్లను తిరిగి నియమించేందుకు, 258 మంది ఉర్దూ గౌరవ ఉపాధ్యాయుల నియామకం పరిశీలనలో ఉన్నట్టు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రులు ఎన్ఎండి ఫరూక్, సత్యకుమార్, సలహాదారు షరీఫ్ తదితరులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.